
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 11
**ఏప్రిల్ 2017**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**
**99491 11175**

## జిజ్ఞాస

జిజ్ఞాస అనగా ప్రశ్నించటము కాదు, చర్చకు సుముఖత చూపించటము కాదు. జిజ్ఞాస అనగా కేవలం జ్ఞానము కొరకు తపన, తీవ్ర ఆకాంక్ష! గురు-శిష్యుల మధ్య సాగే సంవాదమనే వంతెన! ప్రపంచములో నాలుగురకములైన మనుష్యులుంటారు. 1.మూఢుడు 2. అజ్ఞాని 3. ముముక్షువు 4. జ్ఞాని. మూఢుడు అనగా తనలో ఇంకా జిజ్ఞాస అన్నదే పుట్టనివాడు. అతను జిజ్ఞాస అనేదాని పరిధికి ఆవల ఉంటాడు. నిజము చెప్పాలంటే అతనికి 'జిజ్ఞాస' అన్న పదమే పరిచయం లేనంత మూర్ఛితస్థితిలో ఉంటాడు. జ్ఞాన సముపార్జన సంభవమే అని కూడా మూఢుడు తలంచడు. అతను కేవలము పశువు వలే జీవిస్తుంటాడు.

అజ్ఞాని ఎల్లప్పుడు గర్వముతో మిడిసిపడుతుంటాడు. అతనికి తలవంచటం అన్నది రానేరాదు. 'నాకు సంపూర్ణ జ్ఞానమున్నది. ఇక నాకు చెప్పగలిగేవారెవ్వరున్నారు?' అని భావిస్తుంటాడు అజ్ఞాని. ఒకవేళ అజ్ఞాని ఎప్పుడైనా ఒక ప్రశ్న అడిగినా ఇతరులను తప్పుపట్టేందుకే ప్రశ్నిస్తుంటాడు. 'కేవలం నాకు మాత్రమే అంతా తెలుసు. కానీ ఇతనికి తెలుసో తెలియదో చూద్దాం' అని అనుకుంటూ ఉంటాడు. అజ్ఞాని ఎదుటివారిని పరీక్షించటానికే ప్రశ్నలు సంధిస్తుంటాడు. అతని మనస్సులో ప్రశ్న తలెత్తుతుంది. కానీ జిజ్ఞాస అన్నది ఇంకా అంకురించలేదు.

పై ఇద్దరికంటే భిన్నమైనవాడు ముముక్షువు! ముముక్షువులో మోక్షం పట్ల ఆకాంక్ష దాగి ఉంటుంది. కానీ ఇంకా మోక్షం దరికి చేరలేదు. అతను జ్ఞాని కాదు. మోక్షద్వారానికి ఎదురుగా నిలబడ్డాడంతే. ఐతే మూఢుడు కాదు, గర్విష్ఠి కాదు. వినమ్రుడు, నిరాడంబరుడు. ముముక్షువునకు అర్థం-తేలికపాటి జిజ్ఞాస కలిగినవాడు.

జ్ఞాని యొక్క జిజ్ఞాస నిశ్శబ్దమైనది. జ్ఞాని యొక్క జిజ్ఞాస 'జిజ్ఞాసయే' కాదని చెప్పుకోవాలి. అతను అంతా తెలుసుకున్నాడు కనుక ఇంక తెలుసుకునేందుకు ఏమీ మిగిలిలేదు. అతను జ్ఞానపు తుదిమజిలి చేరుకుని శాంతిని పొందాడు. సత్యమును దర్శించాడు. విశ్రాంతస్థితిలోకి అడుగుపెట్టాడు. అయితే దీని అర్థం జ్ఞాని నేర్చుకునేందుకు సిద్ధంగా లేడని కాదు. జ్ఞాని ఎల్లవేళలా నేర్చుకునేందుకు ఉత్సుకతను చూపిస్తూ బాలుని వలె సహజంగా జీవిస్తుంటాడు.

– అనువాదం: *శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

# విషయసూచిక


1. **సంపాదకీయం:** జిజ్ఞాస 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-25:** భారతీయ సంస్కృతిపై ఆక్రమణ 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-58:** అరవిందులవారితో చర్చలు 6
5. **సూక్ష్మీకరణ సాధన-17:** పరిజనులకొరకు విశేష సాధన - ఉపక్రమము 9
6. **శ్రీరామనవమి ప్రత్యేకం:** మానవీయ వ్యక్తిత్వమునకు సర్వోత్కృష్ట ఆదర్శపురుషుడు శ్రీరామచంద్రుడు 14
7. **21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 5:** అంతఃస్ఫురణ - భవిష్య జ్ఞానము 17
8. **సమయదానమే యుగధర్మము-4:** సమయదానం - మహాదానం 20
9. **దేవసంస్కృతి దిగ్విజయ యాత్ర-2:** యజ్ఞమయ జీవనం 23
10. **ఎటువంటి అన్నమును స్వీకరిస్తామో అటువంటి మనస్సు ఏర్పడుతుంది** 26
11. **అంతర్యాత్ర-5:** జాగ్రత్త - మనస్సు నిస్సహాయులను చేస్తుంది 27
12. **శిష్య సంజీవని-2:** అన్నింటికన్నా ముందు శిష్యుడు తన మహత్త్వాకాంక్షలను వదిలివెయ్యాలి 29
13. **బోధ కథ:** స్నేహమను సిరాతో సద్గుణాల రచన 31
14. **హనుమాన్ జయంతి ప్రత్యేకం:** రామకార్యం కాకుండా విశ్రాంతి ఎలా? 33
15. **మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-1:** అమ్మ 35
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** యజ్ఞం యొక్క తాత్త్విక దర్శనం 38
17. **నా వారితో నా మాట:** విప్లవ శకం ఇక ఆగదు 42
18. **ఆయుర్వేద వైద్యం-25:** మెంతులు - ఒక విశిష్ట ఔషధము 45
19. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-9) 47
20. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49



## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపేవారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**ఏప్రిల్ 2017**

**05-04-2017** శ్రీరామనవమి
**09-04-2017** భగవాన్ మహవీర్ జయంతి
**14-04-2017** గుడ్ ఫ్రైడే, అంబేద్కర్ జయంతి
**28-04-2017** పరశురామ జయంతి
**30-04-2017** శ్రీ ఆదిశంకరాచార్య జయంతి

**మే 2017**

**10-05-2017** గౌతమబుద్ధ జయంతి

**అతి ఎప్పుడూ ఎక్కడా పనికిరాదు**

## యుగనిర్మాణ చిత్రావళి-25

# భారతీయ సంస్కృతిపై ఆక్రమణ



భారతీయ సంస్కృతి, ధర్మము, ఆధ్యాత్మికత ఒక సువ్యవస్థిత లక్ష్యమును, తత్త్వజ్ఞానమును, దిశను, రాజనీతిని ప్రతిపాదిస్తాయి. వీటి ప్రకాశములో భారతీయ సమాజము అగ్రగామిగా కాగలిగినది. ఒకే ఈశ్వరుడు, ఒకే ఉపాసన, ఒకే ఆచారము, ఒకే ఆలోచన, ఒకే సమాజం, ఒకే నిష్ఠ ఇక్కడి విశేషములు.

గత 2000 సంవత్సరాలలో వేరు చేసే దుష్ప్రవృత్తులు ఉత్పన్నమయి అనేక కుతంత్రాలను తెచ్చిపెట్టాయి. ఒక ఈశ్వరుని స్థానంలో అసంఖ్యాక ఉపాసనలు, ఒక సమాజంలో అనేక జాతులు, ఉపజాతులు, వాటిలో కూడా అనేక ఉచ్చనీచములు అనేవి పురుడుపోసుకున్నాయి. వేదం యొక్క ఒకే ధర్మం స్థానంలో అగణిత నిర్దేశిత పుస్తకాల ప్రచురణ, ఒకే ధర్మం స్థానంలో అగణిత సంప్రదాయములు, ఉపసంప్రదాయములు; ఒకే ఆచారం స్థానంలో అగణిత పద్ధతులు, పరంపరలు వచ్చిపడ్డాయి. స్వార్థపరులు తమ తమ నేతృత్వము, వర్గములు తయారు చేసుకునేందుకు సమాజాన్ని ముక్కలు ముక్కలు చేశారు. ఫలస్వరూపముగా చెల్లాచెదురైన గడ్డిపోచలవలే దేశం దీనముగా, దుర్బలమైనది, విదేశీయుల ఆక్రమణలో వేయి సంవత్సరాలు ఉండవలసి వచ్చింది.

ఋషులు భారతీయ సంస్కృతిని ఏకత, ఏకరూపత రూపములలో రూపొందించారు. భారతీయ సమాజం అంతా ఏకరూపం-ఏకత సూత్రములో చిరకాలం కట్టివేయబడింది, అత్యంత సుదృఢముగా, సమర్థవంతముగా వికసించింది. ఎప్పుడైతే చెల్లాచెదురుచేసే, వేరువేరు చేసే దుష్ప్రవృత్తులు స్వార్థం కొరకు మొదలు అయ్యాయో, అప్పటి నుండి అన్నిరకాల దుర్బలతలు ప్రారంభమయ్యాయి, దయనీయ దుర్దశలో పడవేశాయి.

ఆసురీ తత్త్వములు చూడటానికి, చెప్పుకోవడానికి నేతల రూపములో కనిపిస్తాయి, ధర్మగురువుల రూపంలో పూజింపబడతాయి. ఈ ధర్మగురువుల కార్యక్రమములలో స్వార్థం ఉండేది. వారు వారి అనుయాయులను ప్రజలలోకి పంపి తమ సామర్థ్యముల గురించి గొప్పగా చెప్పించుకునేవారు, తమ కార్యములను నెరవేర్చుకునేవారు. వీరు సమాజాన్ని, సంస్కృతిని ఛిన్నాభిన్నం చేయుటలో, దుర్బలం చేయడంలో చేయని పనిలేదు. వస్తుతః విదేశీ, ఇతర ధర్మముల ఆక్రమణల కన్నా మన సమాజంలో మంచిగా కనిపించే దుర్మార్గులే భారతీయ ఏకతకు, ఏకరూపతకు అధిక హాని చేశారు.

ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, పార్శీ ఇంకా ఇతర ధర్మాలలో ఇటువంటి నిర్దేశనములు అంటే ఒకే అనుశాసనం, ఒకే పద్ధతి, ఒకే ఆలోచనా సరళి, ఒకే ఉపాసన పద్ధతి కనిపించవు. ఇవి లేకుండా సమాజాన్ని జోడింపచేయడం అసంభవం. మన దురదృష్ట హిందూ సమాజంలో అగణిత వర్గములు, దేవతలు, నిర్దేశాలు ఆచార వ్యవహారములు విస్తరించాయి. అందువలన విశృంఖలమైన సమాజం తయారయింది.


వేరువేరుగా ఉన్న ఈ పద్ధతుల వెనుక ఉన్న కారణములను తీసివేసి ఏకత్వమును, ఏకరూపతను స్థాపించడమే ఈనాటి కాలం కోరుకుంటున్నది.

*- అనువాదం : ముక్కామల రత్నాకర్*

**చిరునవ్వులు, ఆప్యాయత తెచ్చుకోవాలి**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-58

# అరవిందులవారితో చర్చలు



ప్రత్యేకమైన సందర్భాలలో అనుకోని పరిస్థితులు ఏర్పడడం సర్వసాధారణం. శ్రీ అరవిందులవారితో ఏకాంతంగా కలవడం కూడా ఇలాంటి ఊహించని పరిస్థితే. వారిద్దరి మధ్యలో ఏ విషయమై చర్చ జరిగింది? వారిద్దరు ఒకరినొకరు ఎలా పలకరించుకున్నారు? ఏ నిర్ణయాలు తీసుకున్నారు? ఈ విషయాల గురించి అధికారికంగా ఎలాంటి సమాచారము లేదు. కొన్ని సంవత్సరాల తరువాత ఈ విషయమై శ్రీరామ్ చిన్న సంకేతాన్ని మాత్రమే ఇచ్చారు. 1937లో వారు కలిసినప్పుడు మనుష్యుల ప్రయోగశాల ఏర్పాటు చేసే బాధ్యత ఆయనకు అప్పగించబడింది. అప్రయత్నంగానే మనుషులలో దివ్యత్వభావం జాగృతమయ్యే వాతావరణం కలిగించే ప్రయత్నం అరవింద ఆశ్రమం చేస్తోంది. వ్యక్తులను కూడగలుపుకోవడం మొదలుపెట్టే బాధ్యత శ్రీరామ్‌కు ఇవ్వబడింది. చూడడానికి సర్వసాధారణంగా ఉన్నా, ఆంతరంగికంగా శక్తివంతులు, సమర్థులైనవారిని తయారు చేయాలి. వ్యక్తిగతంగా, సంస్థాపరంగా నలువైపులా దివ్య చైతన్యం ఆవిర్భవించేలా ప్రయత్నాలు చేయాలి.

కంచికామకోటి పీఠంలో చంద్ర శేఖరేంద్ర సరస్వతిగారితో జరిగిన చర్చ విషయాలు ఇక్కడ కూడా ప్రస్తావనలోకి వచ్చాయి. చంద్రశేఖరేంద్రస్వామి కుల వ్యవస్థ, నియమాలు కొంతవరకు సరైనవే అన్నారు. అయితే ఇవి గత యుగంలోని విషయాలని ప్రకటించారు. నమ్మదలుచు కున్నవారు నమ్మచ్చు, లేకపోతే ఊరుకోవచ్చు. స్వామిగల్ చెప్పినవాటిని శ్రీ అరవిందులు పాతభాషలో చెప్పిన నూతన భావాలు అన్నారు. దేనినుంచైనా దూరంగా ఉండాలంటే వేళాకోళం చేయడం కన్నా, పక్కకు తప్పుకోవడం సరైన విధానం అన్నది స్వామిగల్ ఉద్దేశ్యం అని శ్రీ అరవిందులవారు చెప్పారు. ఆధ్యాత్మికంలో కులవ్యవస్థకు ఈ మేరకే అనుమతి ఉంది.

ఆధ్యాత్మికతకు సంబంధించి జాతి, కులం, పెద్దరికం, ఐశ్వర్యం, పేదరికం గురించి ఆలోచించరు, ఎందుకంటే నేటి కాలంలో గుహలలో కూర్చుని సాధన చేయడం కుదరదు. రాబోయే రోజులలో జీవితం ఇంకా క్లిష్టంగా మారుతుంది. అప్పుడు ఇంకా ఎక్కువ సమస్యలు ఎదుర్కోవలసివస్తుంది. కుటుంబం పట్ల కొద్దిగా ఉదాసీనంగా ఉండడం కూడా సాధనలో తప్పదు అని అన్నారు. ఉపేక్షించకూడదు, అలా అని మోహం, మమకారాలతో కుటుంబం కోసం పరితపించకూడదు అన్నారు. ఆధ్యాత్మిక జీవితంలో మనిషి ప్రవేశించినప్పుడు కుటుంబ సంబంధాలు రాలిపోవడం మొదలవుతాయి. కొత్త సంబంధాలు వికసిస్తాయి. పాత సంబంధాలతో బంధింపబడడం అంటే సామాన్య ప్రకృతితో బంధింపబడడం.

సుమారు 40 నిమిషాలు చర్చ కొనసాగింది. ఆశ్రమంలో శ్రీరామ్ మరో రెండు రోజులున్నారు. ఆశ్రమానికి సంబంధించి శ్రీమా మరికొన్ని విషయాలు ప్రకటించారు. ఈ తథ్యాలన్నీ శ్రీ అరవిందుల ఆలోచనలే, జీవితాన్ని యోగమయం చేయడమే ఆశ్రమ ఉద్దేశ్యం అయి ఉండాలి అన్నారు. దానికోసం జీవితాన్ని కూడా స్వీకరించవలసి ఉంటుంది. జీవితాన్ని స్వీకరించినప్పుడు దాని ఇబ్బందులను కూడా స్వీకరించవలసి ఉంటుంది. ఆ ఇబ్బందులను దూరం చేయడానికే కదా యోగం అభ్యసించేది. కాబట్టి జీవనక్రమాన్ని విరోధించే ఏ పని ఆశ్రమంలో జరగకూడదు. ఆశ్రమాన్ని ప్రేరేపించే భావం 'ఉల్లాసం' అయి ఉండాలి. అది జీవితం పట్ల స్వీకృతితోనే సాధ్యం అన్నారు శ్రీమా. పాతరకాల ఆశ్రమాల్లో జీవితాన్ని విరోధించడం మొదలైంది. ప్రపంచంతో తెగతెంపులు చేసుకున్నారు. బౌద్ధ ధర్మం దేశమంతటా వ్యాపించినప్పుడు ఈ తిరస్కారం ఇంకా పెరిగింది. దాని ప్రతిక్రియ ఎలా ఉన్నది? ఆశ్రమాలలో, మఠాలలో, సంఘాలలో జీవితాన్ని అతిక్రమించడం మొదలు పెట్టారు. అవి విలాసానికి కేంద్రాలుగా మారాయి.

పూర్వకాలం ఆశ్రమాలు ఈవిధంగా ఉండేవి కావు. అక్కడి

**పుట్టేటప్పుడు ఏమి తెచ్చుకోము, పోయేటప్పుడు ఏమి తీసుకెళ్ళలేము**

సాధకులు, విద్యని అభ్యసించే పిల్లలు మరియు సాధకులు జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలలో శిక్షణను పొందే వారు. ఆశ్రమంలో జీవితాన్ని, ఆధ్యాత్మికతను కలపాలనుకున్న ప్పుడు, అక్కడ అవసరమైన అన్ని తత్త్వాల సమ్మేళనం ఉండాలి.

## మారుతున్న విధానం

ధ్యానం, ఉపాసన లేదా ప్రార్థన ఆశ్రమ జీవనంలో తప్పనిసరి భాగం అయి ఉండాలి. ఒక క్రమశిక్షణను నిర్ధారించాలి. ఆ నియమాలను పాటించాలి. బద్ధకంతో ఆ నియమాలను ఉల్లంఘించకూడదు. రెండు రోజులు అక్కడ ఉండి, ఆశ్రమ జీవనాన్ని అధ్యయనం చేశాక శ్రీరామ్ తమ అనుభవాలను, ప్రతిక్రియలను వ్రాసుకున్నారు. ఆ వ్యాసం 'సైనిక్' సాప్తాహిక ఎడిషన్‌లో ప్రచురించారు కూడా. పై విషయాలు అందులో ప్రధాన అంశంగా వ్రాయబడ్డాయి. 'నవయుగ విధానం' అన్న శీర్షికతో వ్రాసిన ఈ లేఖలోని ఎన్నో భాగాలు తరువాత చాలా సందర్భాల్లో, చాలాచోట్ల ప్రచురించారు. ఆధ్యాత్మికం మరియు జీవితాల సమన్వయం పట్ల సాధకులలో మంచి అభిరుచి ఎలా పుట్టించాలి? ఈ సమస్యలో మనస్సు చిక్కుకుంది. అనుకూల, ప్రతికూల పక్షాల బేరీజు కొనసాగింది. దారంతా ఈ మథనంతోనే సాగిపోయింది.

ఆగ్రా చేరాక మునుపటిలాగానే తమ పనిలో మునిగి పోయారు. కానీ మనస్సులో ఏదో క్రొత్తగా చేయాలనే ఉల్లాసం పెల్లుబుకుతోంది. రాజకీయ వాతావరణంలో నెలకొన్న నిస్సత్తువ మరియు దక్షిణయాత్ర, ఈ రెండింటి ప్రభావంతో సమాచార ప్రపంచంలోనే కూరుకుపోయి ఉండకూడదని చాలా త్వరగా అర్థమయింది. సమాచారాలు కేవలం సూచనలను అందిస్తాయి. కాసేపు ఆవేశపరుస్తాయి. కానీ దానితో ఉద్దేశ్యం నెరవేరదు.

శ్రీరామ్ నెరవేర్చాలనుకున్న ఉద్దేశ్యం ఏమిటి? లోపల కూర్చున్న మరో శ్రీరామ్ అడిగిన ప్రశ్న. జవాబు రాలేదు. చాలాసేపు మౌనమే కొనసాగింది. చాలా రోజులవరకు ఈ ద్వంద్వం కొనసాగింది. ఒక పక్క రాజకీయ కార్యక్రమాలు చల్లబడ్డాయి. ఏదో మాయా ఉత్సాహమే కమ్ముకుంది. అందులో చెప్పుకోదగ్గదేమీ లేదు. కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఈ దశను విజయం అని అనుకున్నా, నిజానికి బ్రిటిష్ రాజ్యం, కాంగ్రెస్ రెండు పరస్పర సహకారంతో నడుస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే కింకర్తవ్య విమూఢ స్థితిలో ఉన్నాయి. ఎందుకంటే ఇద్దరిలో ఎవరికీ ఈ భాగస్వామ్యం వల్ల వచ్చే పరిణామాలు ఏమిటో తెలియటం లేదు.

ఇరుపక్షాలు తమ చరిత్రను మర్చిపోవాలి అంటూ పత్రికలు వ్రాయడం మొదలుపెట్టాయి. కొట్లాటలు, దానివల్ల రుచి చూసిన చేదు అనుభవాలు తప్ప ఆ చరిత్రలో ఏమీ లేదు అన్నాయి. రెండు పక్షాలు కలిసి పనిచేయడంవలన అడ్డుగోడలు తొలగి పోతున్నాయి అన్నారు. గాంధీగారికి మంత్రి ఘన్‌శ్యామ్ దాస్ బిర్లా వ్యక్తిగతంగా ఒక లేఖ వ్రాశారు. అందులో ఇలా వ్రాసుంది, 'అహ్మదాబాద్ కమీషనర్ గైరట్ మురార్జీబాయికి స్వాగతం పలకడం కోసం స్వయంగా స్టేషన్‌కు వచ్చారు. వారితోపాటు చాలాదూరం రైలులో మూడో తరగతిలో కూర్చుని ప్రయాణం చేశారంటే వారి ఔదార్యం ఎంతటిదో ఆలోచించండి.'

ఈ ఉత్తరం వార్తాపత్రికల్లో ప్రచురించారు. ఇలాంటి వర్ణనలకు కాంగ్రెస్ కార్యకర్తలు పులకించిపోయేవారు. శ్రీరామ్‌కు ఇవన్నీ నచ్చలేదు. ఇదంతా ఆయనకు మాయా విజయం లాగా కనిపిస్తోంది. ఇసుక భవనం లాగా ఎప్పుడైనా కుప్పకూలిపోతుంది అనిపించింది. సెప్టెంబరు నెలకి ఆయన చాలా ఉద్విగ్నులయ్యారు. ఆశ్వయుజ నవరాత్రులు మొదల య్యాయి. ముందురోజు నవరాత్రుల ప్రత్యేక పూజ కోసం సంకల్పం తీసుకుని నిద్రపోయారు. ఈ ద్వంద్వం తొలగిపోవాలి అని కూడా ప్రార్థించారు. పొద్దున నిద్ర లేచి స్నానాదులు పూర్తిచేసుకున్నాక సాధనకు కూర్చోగానే పన్నెండేళ్ళ క్రితం వెలిగించిన దీపం మీద దృష్టిపడింది. ఆ ప్రకాశంలో లీనమయ్యారు. ఉపాసన పూర్తయ్యేసరికి కూడా దృష్టి అఖండ దీపం మీదే ఉంది. ఆ తరువాత చిత్తంలో మెదిలిన పదాల వరుస – జ్యోతి, దీపం నుంచి వచ్చే జ్యోతి, అఖండజ్యోతి, అఖండదీపం, దీపం ఇచ్చే 'అఖండజ్యోతి'. ఈ భావగాంభీర్యం పెరిగింది. ఈ పేరుతోనే ఒక పత్రికను మొదలుపెట్టాలి. పూజగదిలో స్థాపించిన ఆ దీపం ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా వాతావరణాన్ని కాంతితో నింపుతుంది. దాని ప్రేరణతో పుట్టిన పేరు 'అఖండజ్యోతి' జగత్తునే కాంతిమయం చేయాలి.

**ఒకరికి ఒకరు తోడుగా అండగా ఉండాలి**

### బహిర్గతమైన కాంతి

సమాచారాల ప్రపంచం నుంచి విరామం తీసుకుంటూ 'అఖండజ్యోతి' అనే పత్రిక మొదలుపెట్టాలని తీసుకున్న నిర్ణయం మిత్రులకు కొన్ని రోజుల్లోనే చెప్పారు. 'సైనిక్'లో పని చేసినప్పుడు అందే వేతనం చాలా తక్కువ. దాంట్లో ఖర్చులు పోగా ఇంకా మిగుల్చుకునేంత వీలు ఉండేది కాదు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేటప్పుడు మార్గదర్శక సత్తా అనుష్ఠానానికి విరామంగా ఇచ్చిన గడువు కూడా అయిపోయింది. కాబట్టి ఇప్పుడు మునుపటిలాగానే కఠోర నియమాలు పాటించడం మొదలుపెట్టారు. జపతపాలు ఇంతకు ముందు కూడా చేశారు. ఆహార విహారాలు, నిద్ర, మనుషులను కలవడం వంటి వాటిలో కూడా కఠోర నియమాలు పాటించడం మొదలుపెట్టారు. అందువలన వనరులు సమకూర్చుకోవడానికి పెద్దగా అవకాశం కుదరలేదు.

శ్రీరామ్ తమ ఊరు ఆవల్‌ఖేడాకి వెళ్ళి తాయీజీని కలిశారు. విషయం చెప్పారు. ఆవిడ ఒక్కటే అడిగింది, "ఇది మీ గురువుగారు చెప్పారా?" అవునంటూ తలూపారు. ఆవిడ మెల్లిగా "మరి స్వరాజ్యం సంగతేంటి? నువ్వు అందులో పాల్గొనవా?" అని అడిగారు.

"కొన్నేళ్ళలో స్వరాజ్యం ఎలాగూ వస్తుందమ్మ. ఇప్పుడు నేను రామరాజ్యం కోసం పనిచేయాలి. గురువుగారు ఇదే చెప్తున్నారు." శ్రీరామ్ జవాబు వింటూనే ఆవిడ రామరాజ్యం గురించి చెప్పే చౌపాయి చదివింది – "దైహిక్ దైవిక్ భౌతిక్ తాపా, రామరాజ్ నహి కాహూహి వ్యాపా." ఈ రామరాజ్య కోసమేనా అంటూ శ్రీరామ్ తల నిమిరి పత్రిక కోసం అనుమతి ఇచ్చింది.

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

---

## సత్యాన్వేషణ చేయాలి

*రబియా బసరి అనే ఆయన సత్సంగంలో పాల్గొని ఉండగా హసన్ బసరి అక్కడకి వచ్చి రబియా బసరీని ఆహ్వానిస్తూ చెరువు నీళ్ళపై కూర్చొని మన ఇరువురం ఆధ్యాత్మిక చర్చ చేద్దామని రమ్మంటాడు. ఆయన నీళ్ళపై నడవగల సిద్ధిని పొంది ఉన్నట్లు ఖ్యాతి గడించటంవల్ల తన ప్రతిభను ప్రదర్శించాలని ఉత్సాహపడుతున్నట్లు రబియా బసరి గ్రహిస్తాడు. గాలిలో ఎగిరే శక్తికలిగిన రబియా గంభీర స్వరంతో "సోదరా! నీవు చేయగల పని చేప కూడా చేయగలదు. అలాగే నేను చేయగల పనిని ఈగ కూడా చేస్తుంది. కానీ సత్యం ఈ చమత్కారాలన్నిటికీ అందని అతీతమైనది. వినమ్రతతో ఆ సత్యాన్వేషణను చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆధ్యాత్మిక వ్యక్తి దర్పంతో తన సహజ ధర్మాన్ని, సహజ స్వభావాన్ని కోల్పోరాదు" అని పలుకగానే హసన్ ఆధ్యాత్మికత యొక్క మర్మాన్ని అవగతం చేసుకొని ఆత్మశోధనకు మార్గాన్ని చూపమంటూ రబియా పాదాలపై వ్రాలతాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## అజ్ఞానం

*ఒక చెట్టు మీద గుడ్లగూబల దండు నివసించేది. తెల్లవారేసరికి వాటికి కన్నులు కనిపించకపోవటం వలన అవి గూటిలోనికి పోయి దాక్కొని ఉండేవి. ఒకనాడొక హంస ఉదయాన్నే ఆ చెట్టు మీద వాలి బాలభానుని ప్రకాశంతో పులకిస్తున్న ప్రకృతిని చూసి తన్మయత్వంతో 'సోదరులారా! ఇంతటి రమణీయమైన ప్రకృతిని, సూర్య భగవానుని ప్రకాశాన్ని చూడకుండా గూటిలో దాక్కొన్నారే మని' ఆశ్చర్యంగా ప్రశ్నించింది. గుడ్లగూబలు పకపక నవ్వి 'ప్రకృతిని అంతగా ప్రకాశింపచేయగల ప్రకాశం నిజంగా సూర్యునికే ఉండి ఉంటే మాకెందుకు కనిపించదు. అంతటి తేజస్వరూపుడు నిజంగానే అయివుంటే మాకు తప్పక కనిపించి తీరాలి. అనవసర పొగడ్తలు కట్టిపెట్టి నీ పనిని నీవు చూసుకో'మని హంస మాటలను కొట్టి పడేస్తాయి. ఈనాడు ఇటువంటి నరపామరులే ఎక్కడ చూసినా అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. వారి వాదన, వారి తర్కం, వారి అహంకారముతో సత్యాన్ని గుర్తించలేక హేళన చేస్తూ విర్రవీగుతున్నారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**విజయ సాధనకు కష్టపడటం ఎంత ముఖ్యమో, ఓర్పు అంత ముఖ్యము**

సూక్ష్మీకరణ సాధన - 17

# పరిజనులకొరకు విశేష సాధన - ఉపక్రమము

వెనుకటి పంక్తులలో నేను పరిజనులతో నా తపశ్చర్యలో సహభాగులు కమ్మని అడిగాను. దీనికొరకు వారు 15-15 నిమిషాల కాలమును మూడుసార్లు త్రికాలసంధ్య రూపంగా ఉపాసన, సాధన, ఆరాధన నిమిత్తము సునిశ్చయంగా ఇవ్వాలి.

**ఉపాసన:** ప్రాతఃకాలము నిత్యకర్మములో నివృత్తులై ఒక మాల గాయత్రీ జపము ఆత్మోత్కర్షకొరకు, ఒక మాల వాతావరణ పరివర్తన కొరకు చెయ్యాలి. ఈ కాలములో ఆత్మ పరమాత్మలో లీనమైపోతున్నదని భావన చెయ్యాలి. ఇంధనము, నిప్పు వలె ఉపనదులు-నదులలోనికి, బిందువు-సింధువులోకి, పురుగు-దీపములోకి ఆదర్శముల సముచ్చయము విరాట్ బ్రహ్మతో తన ఉనికిని సంపూర్ణంగా విసర్జితము చేసుకోవాలి. మురళీ వాదకుని వలె, గాలిపటము ఎగరేస్తూ ఉన్నవాని వలె ఆయన సంకేతముల మీద మాత్రమే నడుస్తున్నాననే నిశ్చయము చేసుకోవాలి.

**సాధన:** మధ్యాహ్న కాలములో జీవనసాధన కొరకు 15 నిమిషాలు ఏకాంత చింతనము కొరకు ఉపయోగించాలి. ఈ కాలములో ఆత్మసమీక్ష, ఆత్మనిర్మాణ ప్రణాళికలు, విధానములు మరియు ఆత్మవికాసస్థితిని పొందుటకు ఆలోచనలు మానెయ్యాలి. వర్తమానస్థితిలో ఏమి చేయగలమో దానిని గురించి స్పష్టమైన నిర్ణయాలు చెయ్యాలి.

నాలుగు సంయమ తపస్సులు - ఇంద్రియ, అర్థ, వాక్కు, ఆలోచనలలో ఏ ఒక్కదానిని అపవ్యయము చేయకూడదు. కుటుంబమును అల్పవ్యయముతో నిర్వహించుకొని స్వావలంబులయ్యే విధానములు నేర్పాలి. సాదాజీవితము, ఉన్నత ఆలోచనల యొక్క జీవనవిధానమును అలవాటు చేసుకోవాలి. 8 గం॥లు ఆర్జనకొరకు, 7 గం॥లు నిద్రపోవుటకు, 5 గం॥లు ఇతర కార్యక్రమాలకు వినియోగించుకున్నా, మిగిలిన 4 గంటల యొక్క సునియోజనము చేయుట వ్యక్తి తనను తాను ఎంతగా మలచుకుంటున్నాడో అన్నదానిమీద ఆధారపడి ఉన్నది.

**ఆరాధన:** సాయంత్రము లేక పడుకొనే ముందు మంచంమీద పడుకొని ఈ రోజు సమయము, శ్రమ, వైభవము, జ్ఞానములో ఎంతభాగము లోకమంగళకర కార్యములలోఉపయోగించాను అని పర్యవేక్షణ చెయ్యాలి? ఒకవేళ వినియోగించకపోతే ఎందుకు చేయలేదో ఆలోచించాలి. భవిష్యత్తులో ఆ కారణాలను తొలగించుకొనుటకు తగిన ప్రయత్నాలను ప్రణాళికగా వేసుకోవాలి. శరీరము కంటే ఆత్మకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చినప్పుడు సమయమంతా ఉదరపోషణ-ప్రజనన వైభవము కొరకు మాత్రమే వినియోగింపబడవలసిన కారణమేమీ లేదు. కాలముయొక్క పిలుపు, యుగధర్మమును పూర్తిగా పెడచెవిన పెట్టకూడదు. నలువైపులా ఉన్న వాతావరణము తనమీద ప్రభావము చూపెట్టకుండా, పడనీయకుండా ఆత్మయొక్క ప్రేరణ మీద నడుచుకోవాలి.

ప్రాతఃకాలము ఆత్మ, పరమాత్మలో లీనమగుట లేక పెనవేసుకొనుట, మధ్యాహ్నము పొదుపు, సంయమన కార్యక్రమాలను పాటించుట, సాయంత్రము యుగధర్మము పాటించుటకు చేసిన కార్యక్రమాలు, చేయబోయే కార్యక్రమాల ప్రణాళికను నిర్ణయించుకొనుట. ఈ మూడు సంక్షిప్తంగా ఉపాసన, సాధన, ఆరాధనలు. ఇవి మూడు నిత్యచర్యలో కలిసినప్పుడు జీవితము పవిత్ర త్రివేణీ సంగమంగా మారుతుంది. ప్రఖరమై పవిత్రమవుతుంది. కాకి-కోకిలగా మారుతుంది. కొంగ-హంస వలె మారుతుంది.

యుగధర్మ నిర్వహణకు ఏమిచేయాలి? ఈనాటి యుగ ధర్మము 'విచారక్రాంతి' (ఆలోచనలలో క్రాంతి / Thought revolution) దీనికొరకు సమయదాన, అంశదాన, ప్రతిభా దానములు అవశ్యకము. 'సంచి-పుస్తకాలయము', జ్ఞానఘట స్థాపన, స్వాధ్యాయ కార్యక్రమము, జన్మదినోత్సవ కథ-పురాణ రూపంలో సత్సంగ కార్యక్రమాలు మొదలవ్వాలి. పూర్తికాలము వెచ్చించగలిగేవారు 'శాంతికుంజ్'ను తమ ఇంటిని చేసుకోవాలి. సమాజ సేవకొరకు సర్వస్వము అర్పించగలిగి, తమ సామాజిక ఋణాన్ని తీర్చుకోవాలి. దానికొరకు ఏమి చెయ్యాలో ముందే చెప్పాను.

**మిలన ప్రాణాయామము:** ఉదయము సూర్యోదయ కాలంలో 24 ప్రాణాయామాలు చేయడం ద్వారా ప్రజ్ఞాపరిజనులతో

**రాత్రికి రాత్రి విజయాలు రావు, ఓర్పు అత్యంత అవసరం**

విశేష సంపర్కస్థాపన క్రమము నిర్వహించబడినది. దివ్య ప్రేరణ తరంగాలు ఆ కాలంలో సంప్రేషితమౌతాయి. వాటిని ఆకర్షించుకొని, ధారణ చేసే భావన శ్వాస పీలుస్తున్నప్పుడు చేయాలి.

ఈ శ్వాసలతోపాటు విశేష సందేశ-సంకేతాలు ఉన్నాయి. దివ్యసత్తాతో కలియుట, గుంభన, ఏకాత్మ-అద్వైతస్థితి అనుభవములోనికి వస్తుంది. దివ్యప్రాణము సమస్త నాడీ మండలములో సంవ్యాప్తమౌతున్నట్లు అనుభవంలోకొస్తుంది. శ్వాస వదులుతున్నప్పుడు లోభ-మోహ అహంకారములు అనే మూడు భవబంధనములు నానుండి పలాయనము చేస్తున్నాయి అనే భావన ఉండాలి. ఆత్మ-సద్భావన, సద్విచారణ, సత్క్రియల వలన ఉల్లసితమౌతుంది.

ఈ కార్యక్రమాలన్నీ ఈ యుగసంధివేళలో నా పరోక్ష సాధన యొక్క రూపంగా నిరంతరము పాటించబడాలి.

**గాయత్రీ నగరంలో నివసించటానికి భావపూరిత ఆహ్వానము సత్యయుగ స్వప్నమును మనమే సాకారము చేద్దాము.**

మానవుడు శరీర సంరచనదృష్టితో పశువు. ఎవరికి విభిన్న పరిస్థితులలో ఏ స్థాయి శిక్షణ లభించినదో, అతడు ఆ స్థాయి మానవుడుగా గుర్తింపు పొందుతాడు. అతనికి ఏవిధమైన శిక్షణా వ్యవస్థ ఉండకపోతే ఈ సభ్యసమాజంలో కూడా ఆదిమానవులు, వన్యప్రాణుల వలె చరిస్తూ ఉంటాడు. తోడేలు ద్వారా పెంచబడిన రాము అనే బాలకుని గురించి అందరికీ తెలుసు. అతను నాలుగు కాళ్ళమీదే నడవడము, జంతువుల వలె గుఱ్ఱుపెట్టడము, పచ్చిమాంసము తినడము చేసేవాడు. అడవులలో, గుహలలో ఉండటమే అతనికి ఇష్టము. చాలా ప్రయత్నం మీద అతనికి కొన్ని మాటలు నేర్పి మానవుల కొన్ని అలవాట్లు చేయించగలిగారు.

అన్నం-వస్త్రం చాలా ప్రధానమైనవి. దానితర్వాత ప్రాముఖ్యత 'విద్య'ది. విద్య పుస్తకములు, అధ్యాపకుల వల్ల లభిస్తుంది. కానీ ఎందువల్ల విద్య ఇతర విధానాల ద్వారా లభించదు అని అనుకోకూడదు. మనిషి సహజీవనము కోరే ప్రాణి. అనుకరించుట అతని మూల ప్రవృత్తి. ఎవరితో కలసి ఉంటాడో వారు ఎలా మాట్లాడుతారో, ఆలోచిస్తారో అలాంటి బుద్ధే వీరిలో కూడా వికసిస్తుంది. వన్యప్రాంతములలో నివసించే వారు కూడా తమ జీవనశైలిని, సభ్యసమాజపు వ్యక్తులంత చురుకుగాను నేర్చుకొనగలుగుతారు. ఉచితానుచితముల తేడా చాలా వికసిత మనఃస్థితిలో వస్తుంది. మొదట అనుకరణ (imitation) తోనే వస్తుంది. మానవుని ఉత్థాన-పతనములు విద్య, వ్యవస్థల పైన ఆధారపడి ఉంటుంది.

ఈనాటికీ ఆఫ్రికా-న్యూగినీ, అండమాన్ లాంటి క్షేత్రాలలో ఆదివాసి సభ్యత ఇప్పటి సభ్యసమాజంతో పోల్చిచూస్తే శతాబ్దాల వెనుకన ఉన్నది. దీనికి విరుద్ధంగా ఉత్తరధృవము వద్ద అతి శీతల ప్రాంతాలలో వివిధమైన సాధనాసామగ్రి లభించనిచోట నివసించే Eskimoes కెనడా యొక్క సువికసిత వ్యక్తులతో ఉండి అవసరమొచ్చినప్పుడు అతి స్వల్ప వ్యవధిలోనే అంత వికాసశీలురయ్యారు. ఇది 'విద్య' యొక్క చమత్కారము... అందువల్ల విద్యను జీవనదాయిని అనుటలో తప్పు లేదు. అతిశయోక్తి లేదు. 'విద్య' ఒక పెద్ద సముదాయంలో నివసిస్తూ దాని పరంపరను కొనసాగించడమే. దీనివలన పుస్తకాల అధ్యాపకుల యొక్క సహకారము లభిస్తుంది. కానీ ఇది లేకుండా ప్రగతి అసంభవము కాదు. 'సమూహాల ప్రవాహం' (Flow of communities) విద్యయొక్క ఉద్గమస్థానము. అంతేకాక మానవత్వ విలువల కొలబద్ద విద్య అనుటలో తప్పు లేదు. లేకపోతే వ్యక్తి నర-వానరుడుగా; నర-పశువుగా మిగులుతాడు.

ప్రపంచ చరిత్రయొక్క ప్రముఖ సంఘటనల పర్యవేక్షణ వలన ప్రగతికి, అవనతికి ఏకమాత్ర కారణము ఆ కాలపు విద్యయొక్క స్థాయి అని తెలుస్తుంది. ఎక్కడ ఈవిధమైన ప్రయోగాలు ఎంత ఎక్కువస్థాయిలో లభ్యమైనవో అక్కడ నివసించువారు తమతమ క్షేత్రవాసుల హితము చేయగలిగారు. దానికొరకు కాలము-సాధనవల్ల సిద్ధింపజేసిన వాతావరణము కూడా అనుకూలించినది. ఉదాహరణకు-భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి మకుటాయమానంగా భాసించేది. దానికి కారణము ఇక్కడున్న ప్రాకృతిక సంపదలు కావు. విద్య, సభ్యత సంస్కృతి కారణాలు. దీనికి విరుద్ధంగా ప్రపంచంలో సంపన్న క్షేత్రములు ఉన్నా అవి వారి అనాచరణ వలన నిరంతరము కలహ-పరాభవములకు కారణమయ్యాయి.

శరీరము, ధనము, విద్య ఇవి భౌతికమైన బలములు. వాటితో పరాక్రమ-వైభవములు సంపాదించవచ్చు. కానీ వ్యక్తిత్వము (personality), చేతనత్వము (consciousness) లను సంపాదించడం కొరకు గుణ, కర్మ స్వభావముల

**వ్యాపార విజయాలు మాత్రమే నీలో సంతోషాన్ని నింపవు**

స్థాయి పెరగాలి. ఇది వాతావరణము, నిరంతర మనన-నిధి-ధ్యానముల అభ్యాసం వల్ల హస్తగతమవుతుంది. వ్యక్తిత్వపు మూల్యాంకన దీని ఆధారంగానే జరుగుతుంది. గొప్ప పనులు వాటి వల్లనే సాధ్యమౌతాయి. గౌరవగరిమ దీనివల్లనే సానపెట్ట బడుతుంది. మహామానవుల స్థాయికి తీసికెళ్ళగలిగేది కూడా ఇదే. మన దేశంలో ఈ సంస్కారములకే ప్రాముఖ్యత నిచ్చారు. దీనికొరకు అధ్యయన-అధ్యాపన కార్యక్రమాలు ఎలా పొందుపరచ బడ్డాయంటే వాటివల్ల వ్యక్తి నాగరికుడుగా (civilize) సుసంస్కారవంతుడు (cultured) అవగలిగేవాడు. దీనికొరకు అటువంటి సాన్నిధ్యము-సంపర్కము అవసరము. మానవుడి అనుకరణ ప్రియవృత్తి వలన నిరంతరము సద్గుణముల అభ్యాసము పెంపొందించే సాన్నిధ్యము అవసరము. సాహిత్యము యొక్క అధ్యయనము, చింతన-మనన విధానాలు చేతనత్వస్థాయిని సువికసితం చేసేవిగా ఉండాలి. ఈ 'విభూతి' ఎవరు పొందగలిగారో వారు చాణక్యుని వలె కురూపులైనా, అష్టావక్రుని వలె వికలాంగులైనా, కాళిదాసు వలె అశిక్షితులైనా, కుచేలుని వలె నిర్ధనులైనా ఆ లోటు వారి జీవితము యొక్క ఏ క్షేత్రములోను ప్రగతిని ఆపదు. అమితవేగంతో సాఫల్యదిశ వైపు సాగిపోగలరు.

**భారతదేశము-దేవమానవుల నివాసస్థలంగా, దేవభూమిగా గుర్తింపబడుతుంది. దానికి కారణము ఇక్కడ జన్మించినవారి భౌతికశరీరము యొక్క విశేషత ఏమి లేదు. శరీర రచన పూర్వకాలంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉన్నది. నిజానికి సుఖ-సాధన సంపత్తిలో మన పూర్వీకుల కంటే ముందు ఉన్నాము. తగ్గినది సుసంస్కారములే. దీనివల్ల అన్నీ ఉన్నా మానవుడు దీనుడు-హీనుడుగా మారాడు.** ధూర్తత్వము, లోలత్వము, వితృష్ణాలాంటి దుర్గుణాల వలన వ్యక్తి విద్య-సంపన్నత, రెండూ ఉన్నప్పటికీ సంతోషము లేకుండా నిరంతరము ఉద్వేగం (stress & strain) లో జీవిస్తున్నాడు. తను నిరంతరము ఆందోళనలో జీవించుటయే కాక తన సంపర్కక్షేత్రంలో ఉన్న వారందరినీ నిశ్చింతగా బ్రతుకనీయడు.

**ప్రాచీన సత్యయుగ వాతావరణాన్ని తిరిగి తీసుకొని రావటానికి మనము మళ్ళీ సుసంస్కారపూరితమైన వాతావరణాన్ని నిర్మించవలసి ఉన్నది. ఇది బజార్లోను, చెట్లలోను దొరకదు. కొనుక్కొని, కోసుకురావటానికి. ఇందుకొరకు వ్యక్తియొక్క కార్య క్షేత్రము శ్రేష్ఠ సజ్జనులతోను, శాలీనమైన (noble) ఆలోచనలతో నిండి ఉండాలి. వ్యక్తిత్వము యొక్క సమగ్ర ప్రగతికి ఇదే మార్గము, ఉపాయము. పూర్వకాలపు కుటుంబాలలో, ఇళ్ళకి ఈ విశేషతయే ఉండేది. వారి ముందు నిరంతరము ఆదర్శములను ప్రోదిచేసే ఆలోచనాసరళి ఉండేది.** ఆరోజులలో చిన్నచిన్న గ్రామాలు ఉండేవి. అందువల్ల సులభంగా శాసించ గలిగేవారు. ఒకరికంటే ఒకరు పైకి ఎదిగి, ముందుకు వెళ్ళడానికి సమయము ఉండేది. వీలు ఉండేది. ఇప్పుడు వ్యక్తి పూర్తిగా 'ఒంటరి' అయిపోయాడు. పెద్ద గ్రామాలలో, నగరాలలో పరస్పర సంపర్కము లేకపోవుట వలన వ్యక్తి అడవిలోని 'ఒంటరి' జంతువు వలె ఏకాకి. విశృంఖలం (Lack of control) గా జీవించడము మొదలుపెట్టాడు. ఇతరులతో సంబంధ-బాంధవ్యాలు పెట్టుకొనే పరంపర ఒకవిధంగా సమాప్తమైయింది.

నేను ఎల్లప్పుడు సత్యయుగ పునరాగమన స్వప్నమునే చూస్తున్నాను. అఖండజ్యోతి-పరివార్, గాయత్రీ పరివార్, ప్రజ్ఞాపరివార్ అనే కుటుంబ వ్యవస్థను సూచించే పదములే నాకు ప్రీతి. అందువల్లనే వీటికి అసామాన్య ప్రభావమిస్తే, ఇతరులు కూడా దీనివల్ల ప్రభావితమౌతారు. దీని తాత్పర్యము చిన్న నగరము అని. విశ్వనిర్మాణము, యుగనిర్మాణము కొరకు నేను ఇటువంటి స్వావలంబన నగరముల నిర్మాణ స్వప్నం చూశాను. అక్కడ సుసంస్కారములను అభివర్ధనము చేసే అన్ని సామాగ్రులు ఉంటాయి. అవి పరస్పరము ఒకదానితో ఒకటి పారివారిక (కుటుంబ) సంబంధ సూత్రములు ఏర్పరచుకొని నిరంతర సర్వతోముఖీ ప్రగతివలన లాభాన్వితులౌతాయి.

గాయత్రీ పరివార్ నా సర్వప్రథమ రచన. గాయత్రీ నగర్ నా అంతిమ సంరచన. స్థాపించటం వరకు నేను చేశాను. దానిని గతిశీలపరచుట పరిజనుల పని. నేను చూసిన 'కల'ని మీరు సాకారము చేయండి. సత్యయుగ, నవయుగ స్వప్నము మాత్రమే కాక దాని విధాన, స్వరూప, వివేచన కార్యక్రమము లలో కూడా ప్రశిక్షణ ఇచ్చాను. ఇప్పుడు పరిజనులు ఆ రాజబాటలో నడవాలి. అంతేగాక తనను, తన కుటుంబాన్ని మాత్రమే గాక, సమస్త ప్రపంచమును సుఖ, శాంతి, సంపన్నతల వైపు తీసుకువెళ్ళే ఈ మార్గమును అనుసరించమని ప్రబోధించాలి.

నేను 'శాంతికుంజ్' యొక్క గాయత్రీ నగర్ యొక్క నిర్మాణము ఎంత త్వరగా, భవ్యంగా చేశానంటే దానిని విశ్వకర్మ

**మానవుడు ఆశజీవి, కానీ ఆశ దురాశ కాకూడదు**

యొక్క కృతితో పోల్చవచ్చు. దీనిని వికసింపజేసి ఒక నందనోద్యానవనంగా తీర్చిదిద్దే బాధ్యత మీదే.

### సుసంస్కారముల సంవర్ధన కొరకు స్వావలంబనయే ప్రధాన శిక్షణ

మానవుని ఉనికి రెండు వర్గాలుగా విభజింపబడి ఉన్నది. ఒకటి-శరీరము, రెండవది చేతనత్వము. శరీరము కొరకు అనేక 'సాధనములు' కావాలి. వాటిలో ముఖ్యమైనవి అన్నము, వస్త్రము, ఇల్లు మొదలగునవి. చేతనత్వము కొరకు రెండు కావాలి. ఒకటి-అధ్యయనము-అధ్యాపనము; రెండు సంపర్కము-వాతావరణము. **వ్యక్తిత్వ వికాసము ఎంత ఎక్కువగా ఉంటే అంత తక్కువ స్వల్పసాధనములు సరిపోతాయి. ఋషులు, మునులు, మనీషులు, యోగుల జీవన విధానమును పరిశీలిస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. దానినిబట్టి ఒక సగటు భారతీయ బ్రహ్మశోభిత జీవితావసరములు ఎంత స్వల్పంగా ఉంటాయో అర్థము చేసుకొనవచ్చు.**

కానీ మనఃశక్తి స్థాయిని పెంచే వ్యవస్థ చేసినప్పటికీ శరీరగత అవసరములు పూర్తవ్వాలి కదా! ఇవి లేకపోతే గడవదు కదా! జ్ఞానవిహీనులు పశువుల వలె ఏదిపడితే అది తినేస్తూ బ్రతకగలరు. కానీ జ్ఞానవంతుడికి అలా కాదుకదా! వినోబా లాంటివారు కూడా నిరాహారంగా జీవించలేదు కదా!

ప్రశ్న సత్యయుగ పునరాగమనము గురించి నడుస్తోంది. దేవమానవుల పురాతన పరంపరను పునర్జీవితము చేసి పృథ్వి మీద స్వర్గావతరణ స్వప్నం సాకారము చేయుటకు శరీరము ఉండాలికదా! నిప్పుకు ఇంధనము వేయకుండా కుంపటి ఎలా మండగలదు? పొలమునకు నీటిపారుదల వ్యవస్థ లేకుండా పచ్చదనము ఎలా ఆశించగలము? ప్రకృతి యొక్క ఈ జడనియమాల (Natural Laws) ముందు జ్ఞానులు-అజ్ఞానులు ఒక్కటే. ఆవు కైనా, గాడిద కైనా గడ్డి కావాలిగదా!

వెనకాల పుటలలో పరిజనులకు సుసంస్కారములు కలుగ జేసే వాతావరణము, ప్రశిక్షణకు తగిన సంపూర్ణ విధి వ్యవస్థ ఉన్న గాయత్రీ నగర నిర్మాణయోజన గురించి వివరించాను. శాంతికుంజము యొక్క వ్యవస్థ దినచర్యలో సంలగ్నమై వ్యక్తి తన గుణ, కర్మ, స్వభావములను నిశ్చయముగా ఉచ్చస్థాయికి తీసుకొని వెళ్ళగలడు. ఇక్కడ దినచర్యలో అవాంఛనీయత ప్రవేశించే వీలు లేనే లేదు. నిద్రలేచిన దగ్గర నుండి, మళ్ళీ పడుకొనేంతవరకు సాధన, స్వాధ్యాయ, సంయమ, సేవను అడుగడుగునా క్రియాన్వితము చేయవలసి ఉంటుంది. ఆత్మ కళ్యాణ-లోకకళ్యాణ ఉభయ పక్షీయ క్రియాకలాపాలు పూర్తిగా ఇమిడి ఉన్నాయి. అందువల్ల గాయత్రీ నగరంలో ఉన్నవారు భౌతికదృష్టిలో ఉత్కృష్టత, సంపాదనలో వెనుక బడతారు అనే భయము లేదు.

ప్రశ్న జీవన నిర్వహణ వనరుల సేకరణ గురించి. అందులో చాలాకాలం బ్రహ్మచర్య జీవితము గడపలేని ఈ రోజులలో దానితోపాటు వానప్రస్థ జీవితం అనేది మర్చి పోయాము. 16-18 ఏళ్ళకి తల్లిదండ్రులవుతున్నారు. శరీరము జీర్ణ-శీర్ణము అయిపోయేవరకు ప్రజననక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఒకప్పుడు వీటిమీద చాలా ఆంక్షలు ఉండేవి. వీటిని కచ్చితంగా పాటించేవారు. రామ-లక్ష్మణులలాంటివారు కూడా ఇద్దరికంటే ఎక్కువ సంతానానికి జన్మనివ్వటానికి సాహసించ లేదు. ఈనాడు పిల్లులు, కుక్కలు, మేకల వలె... అనేకమంది పిల్లలకు తల్లిదండ్రులవుతున్నారు. దానియొక్క దుష్పరిణా మములు కూడా అనుభవిస్తున్నారు. కుటుంబము ఇంటిలోను దరిద్రత, దానివలన సంరక్షకుల (guardians) కు వ్యథ. తద్వారా సమాజంలో అశాంతి. తల్లిదండ్రుల పూర్తి స్నేహ-సాన్నిధ్యము లేకుండా సాంస్కృతిక ఉత్కర్షకి పూర్తి ఏర్పాటు చేయకుండా, ఏ పిల్లవాడు సుసంస్కారవంతుడు అవడు. సంస్కారములు లభించకపోతే తల్లిదండ్రులనుండి కుబేరసంపత్తి పొందినా అది అతని నాశనానికి కారణమౌతుంది.

సత్యయుగ వాతావరణంలో ఆజీవన బ్రహ్మచర్యము లేక ఆజీవన వానప్రస్థ ఆశ్రమము పాటించేవారు. గృహస్థ ఆశ్రమంలోనివారు వివాహం జరిగిన రోజునే ఇద్దరికంటే ఎక్కువమందికి జన్మనీయము అనే ప్రతిజ్ఞ తీసుకొనేవారు. అప్పుడున్న పెద్ద కుటుంబాలలో కొద్దిమంది పిల్లలు ఆర్థికంగా భార మనిపించేవారుకాదు. వారు ఇంట్లో అందరినీ ఆటబొమ్మల వలె తమ ఉనికి వల్ల సద్గుణముల అభ్యాసన కొరకు వివశుల్ని చేసేవారు. ఆరోజులలో కృషి, గోపాలన, శిల్పకళలు లాంటి ఉద్యోగముల వలన చిన్నకుటుంబము కూడా పదిమందిని పోషించగలిగేది. ఈనాడు పరిస్థితులు తల్లక్రిందులైనాయి. అందువల్ల సత్యయుగము తిరిగి తీసుకు రావటానికి, గంగావ తరణ సంభవం గావించటానికి ఉత్సాహము చూపించగలిగే వ్యక్తులు ఒక క్రొత్త ఆలోచనా పద్ధతిని అనుసరించాలి. అనేక

**సద్బుద్ధిని ప్రసాదించమని దేవుడిని వేడుకుందాం**

ప్రత్యామ్నాయములలో ఒకటి చదువు పూర్తి అయిన తరువాత తన ఆ జీవితము నిర్వహించటానికి ముందు ఐదు సంవత్సరాల తేడా ఉంచుకొని ఈ కాలమును సత్యయుగ నిర్మాణము కొరకు ఇవ్వడానికి సంకల్పించుకోవాలి. రెండవ ప్రత్యామ్నాయము ఏమిటంటే అందరికంటే పెద్దవారు గృహనిర్వహణ బాధ్యతను తీసుకున్నప్పుడు గృహస్వామి వానప్రస్థాశ్రమమును తీసుకొనుట. చిన్నపిల్లల బాధ్యతలన్నీ తీరిన తరువాత ఈ కార్యక్రమములు చేపట్టడము అనేది కష్టము. మూడవ ప్రత్యామ్నాయము సంపాదించిన డబ్బును బ్యాంకులో వేసి దానివలన వచ్చిన వడ్డీని ఉపయోగించుకొనుట, సంరక్షకుల డబ్బును పూర్వం పిల్లలు ఉపయోగించుకొనేవారుకాదు. మొత్తము శ్రాద్ధకర్మతో లోకోపయోగకరమైన కార్యక్రమాలకి ఖర్చుపెట్టేవారు. ఈ సత్యయుగ ప్రచలన మళ్ళీ తిరిగి పునరుద్ధ రింపబడాలి. నాల్గవ ప్రత్యామ్నాయము. ప్రాచీనకాలములోని చాలా ముఖ్యమైన దాన–దక్షిణల పరంపర. యజమానులు – పురోహితుల మధ్య అవగాహన ఉండేది. యజమాని ఉత్పాదనలో పదవభాగము పురోహితుల కొరకు ప్రక్కన తీసి పెట్టేవారు. దీనిద్వారా బ్రాహ్మణ కుటుంబములు, సాధు సంప్రదాయములు, అన్నక్షేత్రములు నడిచేవి. సామాన్య కాలములో ఇవ్వబడే రాశిని దానము అనేవారు. వివాహము, జన్మదినోత్సవము, అంత్యేష్ఠి శ్రాద్ధం, ఉపనయనము మొదలగు విశేష పర్వములలో ఇవ్వబడే ధనాన్ని దక్షిణ అనేవారు. ఈవిధంగా యజమాని–పురోహితులు పరస్పరము ఒకరినొకరు పోషించుకొనేవారు. బ్రాహ్మణుడు తన యజమానుల సర్వతో ముఖీ ఆరోగ్యము, విద్య మొదలగు బాధ్యతలను తీసుకొంటే, అతడి కుటుంబము యొక్క భౌతిక అవసరములను యజమానులు తీసుకొనేవారు. తీర్థయాత్రికులు, గురుకుల విద్యార్థులు స్థిరంగా ఒకచోట ఉండేవారు కాదు. వారి కార్యక్రమాలన్నీ అలా తిరుగుతూనే జరుగుతూ ఉండేవి. దీనికొరకు వారు ఒకటిరెండు రొట్టెలను భిక్షమెత్తుకొని కాలము గడుపుకొనేవారు.

ఈనాటి పరిస్థితులలో పైన చెప్పిన 5 పరంపరలు కష్టసాధ్య మనిపిస్తున్నాయి. బిచ్చమెత్తుకొనుట ఒక వృత్తిగా మారినది. కుపాత్రులు దీనిమీద తమ ఆధిపత్యము స్థాపించుకొన్నారు. అందువల్ల ఈనాడు దాన–దక్షిణలడగటము, ఇవ్వడము రెండు అవాంఛనీయములయ్యాయి.

గాయత్రీ పరివారము పెంచుటకు ముందుగా శాంతి కుంజ్‌లో 240 కుటుంబాలు ఉండటానికి ఏర్పాట్లు చేశాము. వారందరినీ వారి మొత్తము సంపదను ధనముగా మార్చి వారి పేరుమీద బ్యాంకులో వేసుకొని దానిమీద వచ్చే వడ్డీతో తమ ఖర్చులను భరించమన్నాము. తక్కువైనదానిని శాంతి కుంజ్–గాయత్రీనగర్ సమకూరుస్తుంది. తమ కాళ్ళమీద నిలబడ లేని పిల్లలున్నవారిని తమ ధనమును అక్కడికి పంపించడము కూడా ఒక వికల్పము. అంతకంటే మంచి సర్వోత్తమ ప్రత్యామ్నాయము ఏమిటంటే పిల్లలు ఒప్పుకుంటే వారినికూడా ఇక్కడికి తీసుకొచ్చేయడము.

శాంతికుంజము గాయత్రీ నగరంలో 240 కుటుంబాలు ఉండగలిగే స్థలము ఏర్పరచబడింది. దానికి తగిన కుటీర పరిశ్రమలకు కూడా వ్యవస్థ ఉన్నది. భవిష్యత్తులో ఎవరు ఏమి అవ్వాలి అనుకుంటున్నారో, ఆ నిమిత్తము విద్య యొక్క సముచిత ప్రబంధము ఉన్నది. పిల్లల శిక్షణ వ్యవస్థలో తరువాత వారు ఉద్యోగం వేటలో అటుఇటు తిరుగవలసిన అవసరము లేనివిధంగా కూర్చబడింది. వారు పెద్దవారై తమ తల్లిదండ్రులు, తోబుట్టువులకు సహాయపడుతూ ఆనాటి సత్యయుగ గ్రామీణ జీవితము జీవించగలుగుతారు.

## 9 రోజుల సంజీవనీ సాధనా శిబిరం

*గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో ప్రతి సంవత్సరం జరిగే 9 రోజుల సంజీవని సాధనా శిబిరం తెలుగు భాషామాధ్యమంగా 2017 మే 11 నుండి మే 19 వరకు జరుగును. ఈ శిబిరంలో పాల్గొనదలచినవారు ఈ క్రింది సమాచారాన్ని తెలుపుచూ శాంతికుంజ్‌నకు లేఖను వ్రాసి వారి స్థానాన్ని ఖరారు చేసికొనవలసిందిగా కోరడమైనది.*

*1. పూర్తిపేరు మరియు చిరునామా; 2. విద్యార్హతలు; 3. వయస్సు & పుట్టినతేది*

*శిబిరంలో పాల్గొనేవారు శాంతికుంజ్‌నకు 10వ తేది ఉదయానికి తప్పక చేరుకొనవలయును.*

*లేఖను వ్రాయవలసిన చిరునామా:*
*శ్రీ వేదమాతా గాయత్రీ ట్రస్టు, శాంతికుంజ్,*
*సౌత్‌సెల్, హరిద్వార్–249411. (ఉత్తరాఖండ్)*

**ఏ పని చేసినా "ఇంతకన్నా బాగా ఎవరు చేయలేరు" అనుకునేంత గొప్పగా చెయ్యాలి**

# మానవీయ వ్యక్తిత్వమునకు సర్వోత్కృష్ట ఆదర్శపురుషుడు శ్రీరామచంద్రుడు

సదాచరణ అన్న సంగతి ఎక్కడెక్కడ చర్చకు వచ్చినా అక్కడక్కడ అయోధ్యకు రాజైన శ్రీరామచంద్రుడు స్మరించ బడతాడు. సమస్త ప్రపంచమునకు రామచంద్రుడు మర్యాదా పురుషోత్తమునిగా తెలుసు. ఎందుకంటే శ్రీరాముడు సదాచారముల మీద సదా దృష్టినుంచేవాడు. ఎంతటి విషమ పరిస్థితులు ఎదురైనా సదాచరణ కావించుటలో శ్రీరామ చంద్రమూర్తి ఎన్నడూ నిర్లక్ష్యము, బద్ధకము ప్రదర్శించలేదు. పైగా సదాచారమును పట్టించుకోని రావణునితో సైతం యుద్ధము చేసి, అతడిని ఓడించి దానిని పునఃప్రతిష్ఠించాడు.

వాల్మీకి రామాయణమును అనుసరించి 'భగవాన్ శ్రీరాముడు చంద్రుని వలె అతి అందగాడు, సముద్రుని వలె గంభీరుడు, భూమాత వలె సహనశీలి. అంతేకాదు శ్రీరాముడు ఎంతటి శీలసంపన్నుడు అంటే దుఃఖాగ్ని జ్వాలల్లో జీవిస్తూ కూడా ఆయన ఎన్నడూ ఎవ్వరినీ కటువైన మాటలు అనలేదు. శ్రీరాముడు తన తల్లిదండ్రులు, గురువులు, సోదరులు, సేవకులు, ప్రజలు ఇలా ప్రతి ఒక్కరి పట్ల తనకు గల బాధ్యతలను స్నేహపూర్వకముగా నిర్వర్తించేవాడు. ముఖ్యంగా తల్లిదండ్రుల ఎడల కర్తవ్యపాలన మరియు వారి ఆజ్ఞాపాలన చెయ్యాలి అనే భావన అణువణువునా నిండి ఉన్నది. వారిచ్చిన కఠినాతికఠినమైన ఆజ్ఞలను సైతం పాటించుటకు రాముడు ఎల్లవేళలా సిద్ధంగా ఉండేవాడు.

భగవంతుడైన శ్రీరామచంద్రమూర్తి జీవితము మొత్తము మీద ఒక్కసారి దృష్టిసారించి చూసినచో అందులో ఎక్కడ అసంపూర్ణత్వము కానరాదు. ఎందుకంటే రాముడు తన జీవితములో ఏ క్షణములో, ఏ పనిని చెయ్యాలో దానిని ఆ క్షణములోనే సక్రమముగా పూర్తిచేసేసేవాడు. శ్రీరాముడు రీతి-నీతి, ప్రీతి-భీతిల గురించిన మర్మము క్షుణ్ణముగా తెలిసిన జ్ఞాని. ఈ కారణముగానే శ్రీరాముడు పూర్ణపురుషుడు! ఆదర్శప్రాయుడు! శ్రీరాముడు తన జీవితమంతా విలువలను పాటించాడు, త్యాగమయ జీవితమును గడిపి ఒక ఆదర్శమును స్థాపించినాడు.

భగవంతుడైన శ్రీరాముని జీవితము నిజమునకు ఒక త్యాగమయ జీవితము. రాముడు అందరినీ ఆదరించేవాడు. అందువలన రాముడు మహాత్ముడు అని పిలువబడ్డాడు. కూడబెట్టేవాడెప్పుడు తన ప్రతిష్ఠనే కోరుకుంటాడు. తన పంతమే నెగ్గాలని అనుకుంటాడు. అతడు పిసినారి. కానీ భగవాన్ శ్రీరామ్ మాత్రం ఏది చేసినా అది ఇతరుల కోసమే చేస్తాడు. రాముడు తన వలన ఎవ్వరికి క్లేశము కలుగకుండా సదా అప్రమత్తముగా వ్యవహరించేవాడు. రామాయణములో శ్రీరామచంద్రమూర్తికి రెండు స్వరూపములు ఉన్నాయి. 1) పరబ్రహ్మస్వరూపము 2) పురుషోత్తమ స్వరూపము. భగవంతుడైన రాముని యొక్క పరబ్రహ్మ స్వరూపము మనోవాక్కులకు అగోచరమైనది. వేదములు కూడా ఈ పరబ్రహ్మ స్వరూపమును 'నేతి నేతి' అనగా 'ఇది కాదు ఇది కాదు' అని ఉటంకించాయి. యోగిజనులు తమ సమాధిస్థితిలో ఈ బ్రహ్మపదార్థమును అనుభూతి చెందుతారు. పరబ్రహ్మ తత్త్వము ఆలోచనకు కాక; అనుభూతికి చెందిన విషయము.

రాముని పురుషోత్తమ రూపమును గురించి చింతన చెయ్యాలి. శ్రీరాముడు మానుషరూపం ధరించి చూపించిన లీలలన్నీ కూడా మానవ వ్యక్తిత్వమునకు సర్వోత్తమమైన ఆదర్శములుగా నిలుస్తాయి. అన్నదమ్ములలో రాముడే పెద్దవాడు. అందుచేత చిన్నవారితో ఎలా వ్యవహరించాలి అనేదానిని బాల్యం నుండే రాముడు ఆదర్శప్రాయముగా ఆచరించి చూపించాడు. భరతుడు ఆటలలో ఎప్పుడైనా ఓడిపోతూంటే తమ్ముడు గెలిచేటట్టుగా చేసి తమ్ముని గెలుపును, ఆనందమును చూసి తాను ఎంతో ఆనందించేవాడు.

'భగవాన్ శ్రీరాముడు ఎల్లప్పుడు గురుజనులు, తల్లిదండ్రుల ఆజ్ఞను పొల్లుపోకుండా పాటించేవాడు. తండ్రి ఆనతి కారణంగానే రాముడు మొదటిసారిగా విశ్వామిత్రమహర్షి వెంట అడవికి వెళ్ళి తాటకి అనే రాక్షసిని సంహరించాడు. ఋషుల యొక్క కంకాళాల గుట్టను చూసి చలించిపోయాడు. 'రాక్షసుల దుష్కృత్యముల కారణముగానే ఋషులు ఇంతటి వేదనను

**ఆలోచిస్తూ కూర్చుంటే జీవితంలో ఏమి సాధించలేము**

సహిస్తున్నారు' అని తెలిసిన మరుక్షణము 'నేను ఈ పృథ్విని రాక్షస రహితముగా చేసివేస్తాను' అని ప్రతినబూనాడు రాముడు.

యువరాజైన రాముని పరాక్రమము, సాహసము మరియు వీరత్వమును చూసి విశ్వామిత్రమహర్షి ఎంతగానో ప్రభావితుడైనాడు. ఆ సమయములో రామలక్ష్మణులు ఇద్దరు చిన్న వయస్సువారే, సుకుమారులే. కానీ వారి సామర్థ్యమును గుర్తించి, వారికి 'బల-అతిబల' విద్యలను నేర్పాడు. రామలక్ష్మణులు మహర్షి విశ్వామిత్రుని వెంట అడవిలో ఉన్న ఆయన ఆశ్రమమునకు వెళ్ళి యజ్ఞ సంరక్షణ గావించినారు. అంతేకాకుండా యజ్ఞమునకు విఘ్నములు కలిగించే రాక్షసులను వధించారు. ఆ పిమ్మట మహర్షులవారి వెంట మిథిలా పురమునకు వెళ్ళారు. అక్కడ రాముడు జనకుని కూతురైన సీతను వివాహం చేసుకున్నాడు.

వివాహం తరువాత దశరథమహారాజు గురువైన వశిష్ఠుని ఆదేశమునసరించి రామునికి రాజ్యాభిషేకము చేయాలని సంకల్పించినప్పుడు అయోధ్యానగరము సంతోషముతో పొంగిపోయింది. కానీ రాత్రికి రాత్రే మొత్తం విషయము తారుమారైపోయింది. తండ్రి మాటను నిలబెట్టడానికి రాముడు 14 సంవత్సరములు వనవాసమునకు వెళ్ళవలసి వచ్చింది. 'అడవులకు వెళ్ళవలసి ఉంది' అన్న మాటను విన్నప్పుడు రాముడు దుఃఖించలేదు సరికదా బదులుగా వనాలలో ఋషుల సాన్నిధ్యము లభిస్తుందని, తన చిన్న తమ్ముడైన భరతునికి రాజ్యసింహాసనము దక్కుతుందనీ ఆనందించాడు. శ్రీరామునితో పాటు భార్య సీతాదేవి, తమ్ముడు లక్ష్మణుడు కూడా తోడు వెళ్ళారు. తమ రాజోచిత వస్త్రములను విడిచిపెట్టి ఏ సాధనా సామాగ్రి లేకుండా వారంతా అడవికి ప్రయాణం కట్టారు. మిగిలినవారందరు రాముడిని ఆపాలని ఎంతగానో ప్రయత్నించారుకానీ రాముడు వారి మాటలను వినలేదు.

రాముడు అడవికి వెళ్ళిన తరువాత పుత్రవియోగంతో దశరథమహారాజు మరణించాడు. తమ మాతామహుల (అమ్మకి నాన్న) ఇంట ఉన్న శ్రీరాముని చిన్న తమ్ముళ్ళైన భరత-శత్రుఘ్నులు 'తండ్రి మరణించాడు అన్న వార్తను' విని అయోధ్యకు తిరిగి వచ్చారు. వస్తూనే విషయమునంతా తెలుసుకున్న భరతుడు తన అన్నగారైన రాముడిని తిరిగి అయోధ్యకు రమ్మనమని ఒప్పించటానికిగాను పాదచారియై శత్రుఘ్నునితో సహా అడవికి బయలుదేరి వెళ్ళాడు. కానీ రాముడు అయోధ్యకు తిరిగి వెళ్ళలేదు. భరతుడు శ్రీరాముడిని ఎంతగానో ప్రేమించేవాడు. అతను శ్రీరామునికి పరమభక్తుడు. రాజ్యమునకు తిరిగి రావటానికి రాముడు ఒప్పుకోనందున రాముని చరణ పాదుకలను తీసుకుని నగరమునకు తిరిగి వెళ్ళి ఆ పాదుకలనే సింహాసనము మీద ప్రతిష్ఠించి ఒక తాపసి వలె గడుపుతూ రాజ్యపాలన సాగించేవాడు.

అడవిలో శ్రీరామచంద్రమూర్తి తనకు ఎదురైన ఎంతో మంది రాక్షసులతో పోరాడి వారందరినీ వధించాడు. 'అడవులలో ఉండే రాక్షసమూకను తుదముట్టించడము' అన్నది దైవీ ప్రణాళికలో భాగము కనుక ఆ నిమిత్తమై రాముడు అడవులకు వెళ్ళాడు. కానీ శ్రీరాముని జీవితములో ఎలాంటి ఒకానొక క్షణము వచ్చినదంటే రాక్షస రాజైన పదితలలుండే రావణుడు ఆయన భార్యయైన సీతను అపహరించుకుపోయాడు. అప్పుడు సీతాన్వేషణలో భాగముగా శ్రీరామచంద్రుడు అడవులలో ఉండే వానరమూకను ఒక బలిష్ఠమైన సైన్యముగా తయారుచేశాడు. అది సాధారణమైన వానరమూక కాదు. రామకార్య నిమిత్తమై సేవ చేయుటకు జన్మించిన దైవాంశసంభూతులు. వానర సైన్య సహాయముతో రాముడు సీతాపహరణము గావించిన దశానన రావణుడిని సంహరించాడు. రావణుని రాక్షసవంశమంతా సర్వనాశనమైపోయింది. పిమ్మట రాముడు భార్య సీతతోపాటు అయోధ్యకు క్షేమముగా చేరుకుని రాజై రాజ్యము నేలాడు.

భగవాన్ శ్రీరాముడు తన జీవితములో తపస్సుకు ఎంతో గొప్ప స్థానమిచ్చాడు. అడవిలో ఉన్నప్పుడు రాముడు తపోమయ జీవితమును గడిపాడు. రాజైన తరువాత కూడా ప్రజా శ్రేయస్సుకై ఒక తాపసి వలె కష్టములను సహిస్తూవచ్చాడు. తన ప్రజలను తండ్రి వలె పరిపాలించేవాడు. రామరాజ్యములో ఎవ్వరికీ ఎటువంటి దుఃఖము-కష్టము లేదు. అందుచేతనే రాముని రాజ్యము 'రామరాజ్యము' అని పిలువబడుతున్నది. అసలు 'రామరాజ్యము' అంటేనే 'దైహిక-దైవిక-భౌతిక తాపము లేవీ ప్రజలను పట్టిపీడించవు' అని అర్థము. ప్రజలంతా పరస్పరం ప్రేమతో మెలగేవారు. వేదోక్త ధర్మమును

**ఏమి జరిగినా ప్రయత్నం ఆపకూడదు**

(వేదములలో చెప్పబడిన నీతినియమములను) పాటించుటకై తత్పరులై ఉంటూ తమ తమ స్వధర్మమును ఆచరించేవారు. ఇవాళ కూడా మానవజాతి భగవాన్ శ్రీరాముడిని 'రాజా రాముడు' రూపములో స్మరించుకొంటూ ఉంటుంది. ఎందు కంటే శ్రీరామచంద్రమూర్తి కేవలము అయోధ్యానగరము లోనే లేడు. రాముడు అందరి హృదయములను ఏలినాడు కనుక ఆయన సర్వహృదయవాసి!

విష్ణుభగవానుని అంశావతారమైనప్పటికినీ రాముడు సదాచరణకు లోబడి తన జీవితములోని కార్యములనన్నింటిని నిర్వర్తించేవాడు. ఒక ఆదర్శవంతమైన జీవితమును గడిపాడు. రామునికి జీవితములో లెక్కలేనన్ని కష్టములు ఎదురైనాయి. కానీ విలువలను నిలుపుకొనుటలో ఆయన ఎన్నడూ విచలితుడు కాలేదు. శ్రీరాముడు అత్యంత ధైర్యశాలి, పరాక్రమ వంతుడు, జ్ఞాని, మధురభాషి, సత్యభాషి, నీతికుశలుడు, సాహసి... ఇత్యాది గుణములకు నిధి. రాముని యొక్క అనంతమైన గుణముల గానము చేస్తూ గోస్వామి తులసీదాసు ఆ సుగుణముల గొప్పతనము చెప్పుట తనకు అసాధ్యమని తలంచేవాడు. రామనామ మహిమ వ్యాపకమైనది. శ్రీరాముని యెడల ఉండే భక్తి యొక్క మహిమకు హద్దులు లేవు. రాముని పట్ల భక్తి కారణముగానే రామభక్త హనుమాన్ శ్రీరాముని చరణ సేవ చేస్తూ అసంభవ కార్యములను సుసంపన్నము గావిస్తాడు.

మనమందరము దేనినైతే శ్రీరామచంద్రుని జన్మదినముగా జరుపుకుంటామో ఆ రామనవమి పండుగ మనకు 'మనం కూడా శ్రీరాముని వలె ఆదర్శవంతమైన జీవితమును గడపాలి, సదాచరణ గావించాలి, మర్యాదలను పాటించాలి, సద్గుణము లను అలవరచుకోవాలి, శ్రీరామభక్తితో మన జీవితాలను సఫలము చేసుకోవాలి' అనే సందేశమును ఇస్తున్నది.

– అఖండజ్యోతి,

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## ఆడి తప్పరాదు

*ఒకచోట కొబ్బరికాయలు అమ్ముతున్నారు. ఒక జాలరి అచ్చటికి వచ్చి కొబ్బరికాయ ధర అడుగగా 8 అణాలు (అర్ధ రూపాయి) అని చెప్పాడు. జాలరి బేరమాడసాగాడు. దీనితో కొబ్బరి కాయల వ్యాపారి విసిగిపోయి, ముందుకుపోతే అచ్చట కొబ్బరికాయలతోట ఉంది, నీకు చౌకగా దొరుకుతాయి అని చెప్పగా జాలరి కొబ్బరితోట వద్దకు చేరుకొని ఖరీదు అడుగగా 4 అణాలు (పావలా) చెప్పాడు. జాలరి అదేవిధంగా బేరమాడుచుండగా, "చెట్టు ఎక్కి కాయలు కోసికొన్నచో ఉచితంగా వస్తాయి" అని దుకాణదారుడు చెప్పాడు. దీనిని విన్న జాలరి వెంటనే కొబ్బరిచెట్టు ఎక్కి కొన్ని కొబ్బరికాయలు త్రెంచుకొన్నాడు. చెట్టుపై నుండి దిగేముందు క్రిందికి చూసి, క్రింద పడతానేమోనని భయపడసాగాడు.*

*అప్పుడు భయంతో భగవంతుడిని ప్రార్థిస్తూ తాను క్షేమంగా చెట్టుపై నుండి క్రిందికి దిగితే ఐదుగురి బ్రాహ్మణులకు భోజన ప్రసాదాన్ని పెట్టెదనని మరియు మంచి దానాన్ని ఇస్తానని మనస్సులో అనుకొన్నాడు. నెమ్మది-నెమ్మదిగా చెట్టు దిగసాగాడు. సగం చెట్టు దిగాడు. అప్పుడు ఇద్దరు బ్రాహ్మణులకే భోజనం పెట్టిస్తానని మాట మార్చాడు. మరింత క్రిందికి రాగానే ఒక్కరికే భోజనం ఏర్పాటు అన్నాడు. పూర్తిగా చెట్టు దిగిన తదుపరి "బ్రహ్మ (దేవుడు) అందరిలో ఉన్నాడు – నాలో మరియు నా కుటుంబ సభ్యులందరిలో దేవుడు ఉన్నాడు. కావున అందరూ బ్రాహ్మణులే! ఈవిధంగా మేమంతా కలిసి నిత్యం ఏడుగురి బ్రాహ్మణుల భోజనం అనగా బ్రహ్మభోజనం సంకల్పం సహజంగా పూర్తి అవుతుంది – అనుకున్నాడు. ఆపదలలో ఉన్నప్పుడు, ఆపద తొలగితే మ్రొక్కు చెల్లిస్తానని మొక్కుకొని, తీర్చనిచో అది అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. దీనిని చెల్లించకపోవుట మాట తప్పుటతో సమానమే.*

*– యుగనిర్మాణ యోజన, సెప్టెంబర్ 2016*

*అనువాదం: ఎ. శారద*

**విజయానికి కారణం 99 శాతం కష్టానికి దక్కితే, ఒక శాతం అదృష్టానికి దక్కుతుంది**

21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 5

# అంతఃస్ఫురణ - భవిష్య జ్ఞానము

తెలుసుకొనుట, నేర్చుకొనుట అనే ప్రక్రియ ఇతరుల సాన్నిధ్యములోనే జరుగుతుంది. యాత్రలు, పర్యటనలు దీనిని కొంతవరకు పూర్తిచేస్తాయి. అయినప్పటికీ మనిషి అంతరాళము లలో నిహితమైన రహస్యమయ శక్తుల ద్వారా అంతఃస్ఫురణగా లభించే జ్ఞానాన్ని నిర్లక్ష్యము చేయకూడదు. దీనికి ప్రత్యక్షముగా ఏ ఆధారము కనిపించకపోయినా ప్రతిరోజు దినారంభములో సూర్యుడు క్రమముగా తూర్పుకనుమలలో ఉదయిస్తాడు, సాయంకాలము పశ్చిమాద్రిన అస్తమిస్తాడు అన్నది ఎంత సత్యమో ఈ అంతఃస్ఫురణతో వచ్చే జ్ఞానము కూడా అంతే సత్యము.

ఆరంభంలో అగ్నియొక్క ఆవిష్కారముకూడా అంతఃస్ఫురణ యొక్క వరదానమే! ఈ స్ఫురణ కలిగిన వ్యక్తి 'ఘర్షణ'ను ఉపయోగించి అగ్నిని కనిపెట్టాడు. దారము వడుకుట, దానితో బట్టలు నేయుట వీటన్నింటి జ్ఞానము – మనిషికి మొదట్లో అంతఃస్ఫురణ వలననే సంభవమై ఉంటుంది. భాష, లిపి, ఉచ్చారణ, అవిజ్ఞాతము యొక్క అసాధారణము, అభూత పూర్వము అని భావించబడే అనేక వైజ్ఞానిక శాఖలు, ఆవిష్కారాల శుభారంభము అంతఃస్ఫురణ ఆధారంగానే సంభవమయ్యింది. ఒకసారి ఆధారభూతమైన సిద్ధాంతము స్ఫురించాక దానికి మెరుగులు దిద్దుట, రకరకాలుగా మార్చుట అనేది సాధ్యమౌతుంది. కానీ ప్రత్యక్షమైన ఆధారమే లేనప్పుడు అనాయాసంగా ఒక వ్యక్తికి ఒక శక్తియొక్క రహస్యమయ నియమాలు స్ఫురించడానికి కారణము అంతఃస్ఫురణయే.

'ఇల్హాం', 'అపౌరుషేయము' అనే శబ్దాలు ధర్మగ్రంథాలలో శృతిఖండములో చెప్పబడ్డాయి. ఈ పదముల అర్థమేమిటంటే మనశ్శక్తి కలిగిన వ్యక్తుల ద్వారా ఈశ్వరీయ వాణి ప్రకటిత మైనది. **ఈ ప్రక్రియలో వారు పైగంబరులైనా, దేవదూతలైనా లేక అతీంద్రియ సామర్థ్యమును కలిగిన "మనీషి"లైనా వారిని వ్యక్తులుగా కాక ఒక ప్రచండ ఆలోచనాప్రవాహముయొక్క ప్రతీకలుగా గుర్తించాలి.** వారిద్వారా భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు తెలుపబడ్డాయి. ప్రతి ధర్మము, సముదాయాల లోను ఇటువంటి 'ఇల్హాం'ను రహస్యమయ అంతఃస్ఫురణగా గుర్తించాలి.

భవిష్యజ్ఞానము, ప్రోఫెసీ, పూర్వాభాసము ఈ వర్గానికి సంబంధించినవి. చెప్పినవిచెప్పినట్లు జరిగితే అవి నిరాధారము కాదని నమ్ముతాము. వాటి మూలములో ఉన్న సునిశ్చితమైన ఆధారము కచ్చితంగా ఉండి ఉంటుంది. భవిష్యత్కథనము యొక్క ఈ ఆధారము ఏ విద్యమీద ఆధారపడినా దానిని ఆశ్చర్యజనకము, అద్భుతము లేక దైవీప్రేరణగానే గుర్తిస్తారు. ఈనాడు వైజ్ఞానికులు కూడా వర్తమాన పరిస్థితులను అధ్యయనము చేసి భవిష్యత్తులో జరుగబోయేదానిని చాలా వరకు ఊహించవచ్చునని ఒప్పుకుంటున్నారు. ఈ దిశలో భవిష్య విజ్ఞానము (ఫ్యూచరాలజి) అనే ఒక శాఖకూడా ఆవిర్భవించినది. ఇది భవిష్యవాణి తంత్రం యొక్క ఒక అంగంగా గుర్తించడములో అతిశయోక్తి ఏమి లేదు.

ఈ సందర్భములో ప్రపంచములోని మూర్ధన్య రచయితల అనేక పుస్తకాలు వెలువడ్డాయి. హెచ్.జి. వెల్స్‌యొక్క 'షేప్ ఆఫ్ ది థింగ్స్ టు కమ్', 'టైమ్ మిషన్'; బి.ఎఫ్. స్కినర్‌యొక్క 'బాల్డన్ టూ', 'బ్రేవ్‌న్యూ వరల్డ్', '1984' మొదలగునవి. వీటిని చదివితే రచయిత స్వయముగా భవిష్యత్తును చూసి దానికి పుస్తకాకృతినిచ్చాడా అనిపిస్తుంది.

'ఫ్యూచరాలజీ' లేక భవిష్యవిజ్ఞానము ఇప్పుడు పూర్తిగా విజ్ఞానసమ్మతము. ఒకప్పుడు వైర్‌లెస్, మైక్రోచిప్స్, రోబో, కంప్యూటర్, అంతరిక్షములో తేలుట – ఇతర గ్రహాలకు రాకెట్లను పంపించుట మొదలగువాటిని ఊహలుగానే భావించే వారు. క్రమక్రమంగా కాలము గడిచిన కొలదీ ఇవన్నీ సంభవ మయ్యాయి. ఏ విద్వాంసులైతే కంప్యూటర్‌ని ఉపయోగించి లభించిన సమాచారమునుబట్టి భవిష్యత్తును గురించి వ్రాశారో, వారు వ్రాసిన ప్రకారము నేటి ఈ ఆలోచనలు, నిర్ధారణలు భవిష్యత్తులో జరిగితే ఆశ్చర్యపోవల్సిన అవసరమేమీలేదు. దీనికి కారణాలు వివరిస్తూ 'మనీషి' ఏమంటాడంటే ప్రవాహము ఎప్పుడూ ఒకేలాగా ఉండదు. దానిలో కాలమునుబట్టి హెచ్చు

**నిజంగా పనుంటూ చేశాక ఫలితం రాకుండా ఉండదు, ఇవాళ కాకపోతే రేపు**

తగ్గులు వస్తూ ఉంటాయి. గాలి ఒకసారి తుఫానుగా మారితే ఇంకొకసారి చక్రవాక రూపము ధరించవచ్చు. ఇటువంటి అంచనాలను దృష్టిలో ఉంచుకుని గుంథర్‌స్టంట్, ఫ్రిట్‌జాఫ్ కాప్రా, ఆల్విన్‌టాఫ్లర్ అనే రచయితలు వారి 'కమింగ్ ఆఫ్ ది గోల్డ్ ఏజ్', 'ది టర్నింగ్ పాయింట్' మరియు 'ఫ్యూచర్‌షాక్' అనే పుస్తకాలలో 21వ శతాబ్దపు ఆరంభమును విస్తృత పరివర్తన కాలముగా వర్ణిస్తూ రానున్న కాలములో సుఖ సమృద్ధులు, శాంతి పెరుగుతాయనే అంచనాలను వెల్లడిచేశారు.

ఈ సందర్భములను, తథ్యములను,భవిష్యవాణులను తెలియజేయుటలోని ఏకైక ఉద్దేశ్యము ఏమనగా రానున్న కాలము భయానకము కాదనీ, కష్టములతో నిండినది కాదనీ, సుఖమయ భవిష్యత్తనీ, విశ్వాసము కలుగజేయుటయేగాక నేటి వర్తమాన బాధాకర పరిస్థితులను చూసి ఊహించిన రీతిలో 21వ శతాబ్ది ఉండదు అని తెలియజేయుట. ఈ ఆశయొక్క మూలాధారము మానవునియొక్క అంతఃస్ఫురణ లేక భవిష్యత్తును ఊహించగలిగే దివ్యసామర్థ్యము. దీనిని ఏ వ్యక్తి అయినా తనలో జాగృతము చేసుకొనగలడు. నేటి భవిష్యత్తును గురించి వ్యక్తము చేయబడే ఉజ్జ్వల అవకాశాల యొక్క ఆధారము ఇక్కడే ఉన్నది. పరోక్షజగత్తులో జరుగుతున్న క్రియాకలాపాలు విస్తృతస్థాయిలో చేయబడుతున్న ప్రయత్నములు, పురుషార్థములు, ప్రత్యక్షముగా దృగ్గోచరము కాకపోయినను వాటి పరిణితి కచ్చితంగా సుఖప్రదమే.

## వైజ్ఞానిక ఆవిష్కారములు కూడా అంతఃస్ఫురణతో జరిగినవే

అనేకానేక ఆవిష్కారములపై దృష్టిసారించినచో వైజ్ఞానికుల అంతఃకరణములో వీటి స్వరూపము యొక్క రూపురేఖలు ఒక అంతర్బోధనగా వారికి స్ఫురించినదని తెలియుచున్నది. దాని పరిణితి ఒక చిన్న ఆవిష్కారముగా రూపుదిద్దుకున్నది. క్రమ క్రమంగా వానిలో మార్పులు, చేర్పుల ద్వారా నేటి విజ్ఞానము ఈ ప్రగతిశీలస్థితికి చేరుకున్నది. కొన్ని ఆవిష్కారముల గురించి తెలుసుకుంటే ఇది ఇంకా స్పష్టముగా అర్థమవుతుంది.

న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతమును తెలిపి విజ్ఞాన జగత్తులో ఒక విప్లవమును తీసుకొచ్చాడని అందరికి తెలుసు. ఒకరోజు ఆయన ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఒక యాపిల్ భూమిపై పడింది. ఈ సంఘటన ఆయన అంతఃప్రజ్ఞలో రకరకాల ఆలోచనలను కలుగజేసింది. ఈ పండు నేలమీద ఎందుకు పడింది? అని ఆలోచిస్తూ ఉంటే భూమికి చాలా ఎక్కువగా గురుత్వాకర్షణశక్తి ఉన్నది గనుక అది వస్తువులను తనవైపు ఆకర్షించుకుంటుంది అనే అంతర్బోధ కలిగింది.

కిశోరావస్థలో ఉన్న జేమ్స్‌వాట్ మరుగుతున్న నీటినుండి వచ్చే బాష్పము వల్ల గిన్నెమీద పెట్టిన మూత పైకి క్రిందికి కదులుట చూశాడు. ఈ సంఘటన ఆయన అంతఃసామర్థ్యమును నిద్రలేపింది. తద్వారా బాష్పశక్తియొక్క సిద్ధాంతము వెలువడి అనేక రైలుబండ్లను నడుపుటయేగాక ఒక పారిశ్రామిక విప్లవానికి బీజాలు పడ్డాయి.

ఫ్రెడరిక్ కెకులే బెంజీన్ సంరచనగురించి ఆలోచిస్తూ స్వప్నావస్థలోకి వెళ్ళాడు. ఆయన ఒక సర్పము కుండలీ ఆకృతిలో కూర్చుని ఉండి తన తోకను తనే కరుస్తున్నట్లు చూశాడు. తక్షణము మేల్కొని తాను చూసిన దృశ్యాన్ని చిత్రముగా గీచాడు. ఆశ్చర్యమేమిటంటే షట్కోణాకృతి గల బెంజీన్ వలయంగా దానిని గుర్తించాడు. ఆట్టోలేవీకి కూడా న్యూక్లియస్ స్నాయుసంధి కేంద్రకముల మధ్య విద్యుత్తు ప్రవహించడానికి కారణమైన రససమీకరణాల యొక్క అంతర్బోధ జరిగింది. వాటిని కాగితము మీద పెట్టగానే ఎసిటైల్ కోలిన్, కోలీన్ఎస్టరేస్ లాంటి అతి ముఖ్యమైన న్యూరోకెమికల్స్‌యొక్క ప్రారంభిక పరిశోధనలకు సంరచనల ఆధారము లభించినది.

నిజానికి దేనిని గురించి వైజ్ఞానికులు, మనీషీలు నిరంతరము ఆలోచిస్తూ ఉంటారో, అవి వారి అచేతన మనస్సు యొక్క గర్భంలో ముందే రూపుదాల్చుకుని ఉంటాయి. కొన్ని అంతర్బోధలుగా, కొన్ని స్వప్నములుగా, కొన్ని అంతఃస్ఫురణ లుగా వికసించిన చేతనత్వముగల 'మనీషు'ల మానసములో బహిర్గతమౌతాయి. అవి ఆవిష్కారములుగా లేక పూర్వాభాస ములుగా లేక భవిష్యవాణులుగా రూపుదాలుస్తాయి.

బెంజిమన్ ఫ్రాంక్లిన్ అనే అమెరికా వైజ్ఞానికుడు వర్షము కురుస్తున్నప్పుడు ఏర్పడిన మెఱుపులను చూసి ఈ తుఫానులో గాలిపటము ఎగురవేస్తే ఏమౌతుందో చూడాలనుకున్నాడు. తడిగా ఉన్న దారానికి తాళముచెవి తగిలించి నేలపై పెట్టాడు. ఆ ఇనుప తాళపుచెవినుండి విద్యుత్‌స్ఫుల్లింగాలు ఏర్పడటము చూసినప్పుడే వికసించిన ఆయన చేతనత్వములో పిడుగుల

**అవిశ్రాంతంగా శ్రమించాలి, అప్పుడే అనుకున్నది దక్కుతుంది**

నుంచి భవనాలను రక్షించే పరికరము విద్యుత్చ్ఛాలకము (లైట్నింగ్ కండక్టర్) యొక్క ఆవిష్కారము జరిగి పోయింది. ఇది 'మనీషి' యందు జాగృతమైన పూర్వాభాసము, అంతర్బోధ యొక్క చమత్కారము. ఏ వైజ్ఞానికవేత్త శ్రమకైనా, పురుషార్థమునకైనా ఈవిధమైన ప్రేరణ లభించుట సహజమే!

ప్రతి కల్పన, ప్రతి ఊహకందని సంఘటనలకు స్థూల జగత్తులో రూపమిచ్చుటకు దైవీచేతనత్వము ఎప్పుడు మానవీయ ప్రజ్ఞనే ఉపయోగించుకుంటుందని చరిత్ర తెలుపుతోంది. రాజనీతిజ్ఞులకు, సంఘసంస్కర్తలకు, తత్త్వదర్శకులకు, ప్రకృతి రహస్యాన్వేషకులకు, రచయితలకు, కవులకు, సంగీతజ్ఞులకు వారి భవిష్యకార్యకలాపాలకు దీని ఆధారంగానే ప్రేరణ లభిస్తుంది. అసంభవాన్ని సంభవము చేయగలిగే ప్రేరణాశక్తి దైవీచేతనత్వమునుండే జన్మిస్తుంది. ఈజిప్టులోని పిరమిడ్లు, చైనాయొక్క గొప్పగోడ, పనామా-సూయజ్ కాలువలు, తాజ్ మహల్, పోలెండ్లో సముద్రంలో ఉన్న భూమిమీద పంటలు పండించడము లాంటి గొప్ప పనులు దైవీప్రేరణ వల్లనే సంభవ మయ్యాయి. సమాజము సక్రమముగా నడవడానికి ఏర్పర్చ బడిన వ్యవస్థ, పోస్టల్ వ్యవస్థ, నోట్లను ముద్రించుట ఇవన్నీ అంతర్ప్రజ్ఞ ప్రేరణ వల్లనే జరిగి ఉంటాయి. పరబ్రహ్మయొక్క దిశాబోధ వారికి లభించి ఉంటుంది. పైగంబరులుగా, దైవ దూతలుగా మనము కొలిచేవారందరు దైవం యొక్క విభూతులు పొందినవారే! వికసించిన వారి చేతనత్వము భవిష్యత్తునుకూడా దర్శించగలుగుతుంది.

ఆ అంతఃప్రేరణే, వికసించిన చేతనత్వమే నేడు భవిష్యత్తు గురించి మనకు చెప్పదలచుకున్నది. నేటి విపత్కర పరిస్థితులలో రెండురకాల వ్యతిరేక భవిష్యత్కథనాలు వినిపిస్తున్నాయి. 1. రానున్న సంవత్సరాలు, 21వ శతాబ్దపు పూర్వార్ధము, చాలా ప్రమాదాలు, కష్టాలతో కూడి ఉంటుంది. 2. ఈ సమయము ఉజ్జ్వల భవిష్యత్తుకు పునాది. వీరి ప్రకారము మానవ ప్రయత్నాల దిశ మార్చుకుంటే తప్పులు సరిదిద్దుకుంటే రానున్న విపత్తులనే కారుమేఘాలు తొలగిపోతాయి. మేఘాలు ఎంత దట్టంగా కమ్ముకున్నా, వాతావరణం ఎంత భయం కరముగా కనిపిస్తున్నా తీవ్ర ఝంఝామారుతము వాటిని క్షణాలలో చెల్లాచెదరు చేసి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చేస్తుంది. ఇదే మానవ పురుషార్థానికి కూడా వర్తిస్తుంది. పురుషార్థాన్ని ఉపయోగించి ఎలాంటి భవితవ్యతనయినా అనుకున్నట్లుగా మార్చుకోగలము.

ఈనాడు విశ్వమానవత (వరల్డ్ హ్యూమానిటి) ఉన్న కాలము పరివర్తనాకాలము- మారుతున్న కాలము. యుగ పరివర్తనములు ఇదివరకు కూడా చాలా జరిగాయి. వీటిని "సామూహికంగా వికసించబడిన చేతన" అని కూడా అనవచ్చును. అదుపుతప్పిన పరిస్థితులను సవరించడానికి, ప్రాణచైతన్యముగల ప్రతిభలను కూడగట్టి యుగధర్మము పాటించడానికి ప్రేరణను ఇస్తుంది. దీనినే అవతార ప్రవాహము అంటారు. ఈరోజులలో ఆ మహాకాలునియొక్క ప్రబల ప్రేరణలు యుగపరివర్తనకొరకు నూతన పరిస్థితులను నిర్మించడము చూడవచ్చును. కావల్సిందేమిటంటే సమయమును గుర్తించి మన వ్యక్తిగత ప్రయత్నాలన్నీకూడా దీనికొరకు వినియోగించగలగాలి. **పేరుతెచ్చుకొనుటకు మరియు అవతార ప్రక్రియతో కలిసి పనిచేయుటకు ఇదే సరియైన సమయము.**

*(సశేషం)*

## వంచన

*వ్యాపారం ఉద్యోగం వంటి వాటి ద్వారా మానవుడు పరిమితమైన ధనాన్ని ఆర్జించగలడు. ఉచిత సాధనాలు, ఉచితమైన కాలం, సంపద వీటిని విశ్వసించలేని వ్యక్తి సజ్జనత్వాన్ని విడనాడి ఆర్జనకు ఉపక్రమిస్తూ ఉంటాడు.*

*ఇద్దరు మోసగాళ్ళు వ్యాపార నిమిత్తం బయలు దేరుతారు. ఒకడు కుండలో కంఠం వరకు పేడ నింపి, మిగిలిన కాస్త భాగం నేతితో నింపి నెత్తిన పెట్టుకొంటాడు. రెండవ వ్యక్తి నకిలీ కత్తికి అసలైన పిడి, పెద్ద ఒర తగిలించి అమ్మటానికి బయలుదేరుతాడు. వీరిద్దరూ ఒకరినొకరు మోసగించుకొని ఒకరి సరుకు మరొకరికి అమ్మి వారి తెలివికి వారే సంతోషిస్తూ ఇల్లు చేరుకొన్నారు. ఇంటికి చేరిన తర్వాత జరిగినదేమిటో అర్థమై నెత్తినోరు మొత్తుకున్నారు. కష్టించకుండా లాభాలు పొంది, ఇతరులను వంచించాలని చూసే వారందరికి ఏదో ఒకనాడు ఇదేవిధంగా జరిగి తీరుతుంది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి**

సమయదానమే యుగధర్మము - 4

# సమయదానం - మహాదానం

దానం వలన పుణ్యం ప్రాప్తిస్తుంది. కానీ ఈ దానం శ్రద్ధతో కూడిన భావసంవేదనలతో, సత్ప్రయోజనముల కొరకు ఇవ్వవలసి ఉంటుంది. ఇలాకాక దానం దుష్ప్రవృత్తులతో జోడింపబడి ఉంటే దాని పరిణామం పాపంతో సమానమవుతుంది. దానం ఇచ్చేవారు, పుచ్చుకునేవారు అవమానం పాలవుతారు. అలాంటి దానం అనేక అనర్థాలకు దారితీయవచ్చు. అందువలన దానములు ఉత్కృష్టత, వివేకం కలగలిపి ఉండాలి. దానంతో జోడింపబడిన పుణ్యపరమార్థం అందరికీ శ్రేయస్కరం.

ఒక మహత్త్వపూర్ణమైన పనికి కావలసిన మొత్తం ధనం ఇవ్వగలిగేవారు చాలా అరుదుగా ఉంటారు. భామాశాహ్ వంటి ధనవంతునికి రాణాప్రతాప్ వంటి వారికి పెద్ద ధనరాశిని ఇవ్వగలిగే సామర్థ్యం ఉంటుంది. హరిశ్చంద్రుడు, కర్ణుడు వంటి వారిగా కావాలనుకుంటే కూడబెట్టిన సంపదతోపాటు ఉచ్చస్తరీయమైన వివేకము ఉదారత ఉండవలసినదే. ఇలాంటి సంయోగం చాలా అరుదుగా జరుగుతుంది. మూర్ఖంగా ప్రవర్తించేవారి సొమ్ము పరులపాలవుతుంది. చెడ్డపేరుతోపాటు దుష్పరిణామములు కలుగవచ్చు.

ధనం భౌతిక పురుషార్థం, సుయోగ సంయోగముల వలన లభించే ప్రతిఫలము. ఇలాంటి పరిస్థితి ప్రాప్తించుట ఈ రోజులలో అందరికి సాధ్యం కాదు. ఇలాంటి పరిస్థితిలో పుణ్యపరమార్థం కొరకు ధనము దానంగా ఇవ్వడం అంత ముఖ్యమైనది కాదని భావించి భగవంతుడు ఇంకొక రకమైన సంపదను అందరికి ఉదారంగా ఇచ్చాడు. అదే సమయం. సమయం యొక్క క్షణాలతో జీవన శృంఖల తయారవుతుంది. ఏదైన పని ఎంతో ఇష్టం అయితే తప్ప, ఆ పనిమీద ఎంతో అభిరుచి ఉంటే తప్ప ఈ సమయాన్ని ఉదారంగా ఉపయోగించలేము. ఒక్కొక్కసారి అది ఎంతో మంచి పని అయి ఉండవచ్చు. కానీ మనకు ఆ పని మీద ఇష్టం లేకపోవచ్చు. ఇష్టం లేని పని మొదలే కాదు ఒకవేళ మొదలుపెట్టినా మధ్యలోనే ఆగిపోతుంది.

దానాలు ఇవ్వడంలో ధనం తరువాత సమయం వస్తుంది. సమయదానం సర్వసాధారణమైనవారు కూడా ఇవ్వడం సులభమే. సమయదానం యొక్క సదుపయోగం జరుగుతున్నదా లేదా అనేది తేలికగా తెలుసుకోవచ్చు. సమయదానం గురించి ఆలోచనాపరులను సంప్రదించి మార్గదర్శనం కూడా పొందవచ్చు. స్వార్థపరులు కూడా దానిని ఎక్కువకాలం అనుచితంగా దురుపయోగం చెయ్యలేరు.

శ్రమతో వచ్చిన శ్వేదబిందువులను (చెమట) మణిముక్తములతో సమానమని చెప్తారు. మహామానవుల సత్కర్మలు ఈ ఆధారంతోనే జరుగుతాయి. సమయదానంతోపాటు శ్రద్ధ ఉండాలి. లేకపోతే చేసే పనులు వేరుగా ఉంటాయి.

మహామనీషుల సాధన 'సమయం' అనే తపఃశిలపైనే సంభవమయింది. వారు ఆలోచించినది, వారు సృజించిన వాటి వెనుక వారి తన్మయత్వంతో కూడిన సమయసాధన ఉన్నది. వైజ్ఞానికులు–ఆవిష్కర్తలు తమ మనస్సును, సమయాన్ని నిర్ధారిత లక్ష్యం వైపు ప్రముఖంగా కేంద్రీకరించకపోతే సాధించుతామనే ఆశ కూడా ఉండదు. లోకసేవకులు తమ సమయదాన సహాయంతో ఒకదానిని మించిన మరొక పనిని చేసి చూపించారు. ధనం లేకపోయినా పరవాలేదు కానీ సమయం యొక్క సహాయంతో సాధనములు పెద్దగా లేనప్పటికీ పెద్ద పెద్ద పనులు చేసినవారు అనేకమంది ఉన్నారు.

భారతీయ పురాతన చరిత్రపై దృష్టి పెట్టినట్లయితే దాని మూలంలో ఒక తథ్యం గోచరిస్తుంది. సాధు బ్రాహ్మణ పురోహితుల వర్గం తమ కనీస అవసరాలు తీరాక మిగిలిన సమయమంతా పరిపూర్ణ అభిరుచితో లోకమంగళ సామాజిక అవసరాల కొరకు ఉపయోగించేవారు. వారు సేవాసాధనతో జనుల మనస్సును గెలుచుకున్నారు. వ్యక్తులలో ఉన్న ప్రతిభ ఈ ఆధారంపైనే ప్రసుప్తి నుండి విరాట్ రూపముగా, జాగృత కర్మనిష్ఠగా పరిణితి చెందింది, సర్వతోముఖ ప్రగతి యొక్క వాతావరణం తయారయింది. సత్యయుగం యొక్క సమున్నత వాతావరణం తయారయ్యేందుకు గల ప్రముఖ కారణం ఇదే.

అనాచారములను ఆపడానికి రాజదండం కూడా పని

**కష్టంగా కనిపించేవన్నీ అసాధ్యం కావు**

చేస్తుంది. కానీ సద్భావముల సంవర్ధన కొరకు ధర్మతంత్రం యొక్క భావసంవేదనలే సమర్ధవంతంగా పనిచేస్తాయి. సుఖ శాంతులు భావసంవేదనలతోనే లభ్యమవుతాయి. అభ్యుదయం, వికాసముల ఆధారము కూడా సద్భావములే. భారతీయ పరివ్రాజకులు విశ్వం యొక్క నలుమూలలకు కష్టసాధ్యమైన యాత్రలు చేసి అక్కడి వెనుకబడినతనాన్ని తీసివేయడానికి, సర్వతోముఖ ఔన్నత్యానికి ప్రయత్నించి గారడిలాంటి పరివర్తన చేసి చూపించారు. దేశవ్యాప్తంగా ఆదర్శవాదం, ఉత్కృష్టత అక్షయంగా చేయడం ఈ సాధు బ్రాహ్మణవర్గం యొక్క ముఖ్య కార్యక్రమంగా ఉండేది. అందుకే వీరిని భూసురులుగా దేవమానవుల పంక్తిన నిలిపారు.

వానప్రస్థం భారతీయ ధర్మతంత్రంలో ఒక అనివార్య పక్షము. ప్రాపంచిక ప్రయోజనముల కొరకు జీవితంలో సగభాగం వెచ్చించిన తరువాత మిగిలిన సగభాగం లోకమంగళ కార్యక్రమాలలో వెచ్చించడం ఆవశ్యకమని భావించేవారు. గృహస్థు యొక్క బాధ్యతలు తేలికగా ఉండేవి. బుద్ధిమంతులెవరు మోయలేనంతగా బాధ్యతలను పెంచుకునేవారు కాదు. గృహస్థ జీవనంలో తక్కువ సంతానంతో తృప్తిపడేవారు, అది కూడా గృహస్థ జీవనంలో ప్రారంభంలో జరిగేటట్లు చూసుకునేవారు. అందువలన నడివయస్సులోనే ఇంటి బాధ్యతల నుండి బయటపడేవారు. పిల్లలను ఎవరి కాళ్ళమీద వారు నిలబడేటట్లు చేయడం, సుసంస్కార మార్గదర్శనం వరకే పెద్దల కర్తవ్యంగా భావించేవారు. మరణించేముందు పిల్లలకు ధనం వదలి వెళ్ళాలని ఎవరు అనుకునేవారు కాదు. ఆర్జించగల వ్యక్తులందరు కలసిమెలసి అసమర్థుల, వికసించని వ్యక్తుల పోషణ బాధ్యత స్వీకరించేవారు. ప్రతి ఇంటి నుండి ఒక వ్యక్తిని లోకమంగళ కార్యక్రమాలకు పూర్తిగా సమర్పించేవారు. ఇలా చెయ్యడం గొప్పగా భావించేవారు రాజపుత్రులు (రాజపుత్). ప్రతి ఇంటి నుంచి ఒకరిని సైన్యంలో పనిచేసేందుకు పంపించేవారు. సిక్కులలో ప్రతి ఇంటి నుంచి ఒకరిని గురుకార్యముల కొరకు పంపించవలసి వచ్చేది. ఇంటిలో ఆ వ్యక్తి చేయవలసిన పనులను మిగిలినవారు పంచుకునేవారు. ఇలాంటి మహా పరంపర వలననే భరతభూమి స్వర్గాదపి గరీయసి అయింది. ఇక్కడి పౌరులు దేవమానవులుగా ప్రపంచమంతట ప్రసిద్ధి గాంచారు. ఈ దేవమానవుల సాధనలే జ్ఞానక్షేత్రంలో జగద్గురువుగా, విజ్ఞానక్షేత్రంలో చక్రవర్తిగా, శాసనవ్యవస్థ క్షేత్రంలో స్వర్ణ సంపదలకు యజమాని అయ్యేటట్టు చేశాయి.

ఆ పురాతన పరంపరలను ఏదో విధముగా జీవింప చేయగలిగితే సత్యయుగం తప్పక తిరిగివస్తుంది, దుర్బుద్ధి యొక్క దావానలంలో తగలబడుతున్న ప్రపంచంలో తిరిగి సత్యయుగ వాతావరణంలో శ్వాసతీసుకోగలిగే మంచి అవకాశములు హస్తగతమవుతాయి.

ఈరోజులలో అసలుకు నకిలి తయారుచేసే పనిలో ప్రావీణ్యత సంపాదించాడు. బొమ్మల దుకాణంలో అన్నిరకాల బొమ్మలను కొద్ది ఖర్చుతో కొనవచ్చు. ఇంతేకాదు మట్టితో చేసిన ఏ దేవత నమూనా అయినా ఎటువంటి కష్టం లేకుండా కొనవచ్చు. అయినప్పటికి అసలుకు నకిలీకి ఉన్న తేడా మనుష్యులు అర్థం చేసుకోగలరు. ఆవు బొమ్మ పాలు ఎక్కడ ఇస్తుంది? ఏనుగు బొమ్మ మీద కూర్చుని ఎక్కడికి సవారి చేయగలరు? కోడిబొమ్మ గ్రుడ్లను పెడుతుందా?

ప్రపంచంలో సుఖం సమున్నతంగా ఉండే సత్యయుగ వాతావరణం తయారుచేయగల దేవమానవుల విషయంలో కూడా ఇదే మాట వర్తిస్తుంది. ఈ రోజులలో దేశంలో ఉన్నటు వంటి ధర్మోపదేశకుల సంఖ్య సుమారు 60 లక్షలు. ధర్మ ప్రచారకుల ముసుగులో అనుదానములు, సన్మానములు పొందేవారు ఇంతమంది ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇంతమంది ధర్మోపదేశకులు ఉంటే విశ్వం అభ్యుదయం యొక్క చరమదశవరకు వెళ్ళగలిగేది. కానీ అంతా తల్లక్రిందులయింది. ఎవరైతే దేశం యొక్క, విశ్వం యొక్క భారం ఎత్తుకోవాలో వారే విశ్వానికి బరువు అయ్యారు.

ఇక్కడ దానధర్మముల వివేచన చేస్తూ సర్వసులభమైన సమయదానం యొక్క చర్చ జరుగుతున్నది. ఈ చర్చకు ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నాము. లోకమంగళం కొరకు సమయ దానం యొక్క ప్రాచీన పరంపరను ఏవిధంగా పునర్జీవింప చేయడం సంభమవుతుంది? ఉజ్జ్వల భవిష్యత్తు యొక్క సంరచనలో ప్రముఖ భూమికను నిర్వహించగలిగే సమర్థులు ఈ మహా కార్యంలో కార్యార్థులు అయి, ఈ ప్రాచీన పరంపరంలో క్రొత్త ఉల్లాసముల ఆవేశముల పంట పండించగలరా?

ఎప్పుడు మనిషి అంతరాళముల లోతులలో ఆదర్శములపై అవిశ్రాంతముగా నడిచేందుకు తియ్యతియ్యని బాధ కలుగు తుందో అప్పుడే నిజమైన సమయదానం సాధ్యమవుతుంది.

**దేనినైనా అసాధ్యం అనుకుంటే దానిని ఎప్పటికీ సాధించలేవు**

అటువంటివారు ప్రాణప్రియ లక్ష్యం వైపు నడిచేందుకు, కలతచెంది వ్యాకులపడుతూ బాణం వలె దూసుకుపోతారు. ప్రలోభాలు, అవరోధాలు అతని మార్గములో వస్తే రావచ్చు కానీ వాటిని పట్టించుకోకపోవడం వలన అవి అతనిని ఏమి చేయలేవు. ఈ ఇబ్బందులు దోమలు కుట్టినట్లు కొంచెం విసిగించవచ్చు కానీ అతని మార్గమును మరల్చలేవు.

పూర్వ సంచిత కుసంస్కారములు, పేరాశ, సమాజంలో ఉన్నటువంటి అలవాట్లు – ఇవన్నీ కలసి మనిషిని ఏవిధముగా అయినా సరే బాగా డబ్బు సంపాయించు, బాగా అనుభవించు, ఆనందించు, సుఖసాధనములు ఏర్పరుచుకో, స్వార్థమే అన్నింటి కన్నా ముఖ్యమైనది. నీ వీలు, నీ సంతోషం గురించే ఆలోచించు, దీనివలన ఇతరులకు ఇబ్బంది కలిగినా పరవాలేదు. ఇతరులు ఎలాపోతే మనకు ఏమిటి? అని చెప్తాయి. సగటు మనిషి ఈవిధంగానే ఆలోచిస్తాడు, ఇలా ఉండటమే తెలివైన పని అని భావిస్తాడు. కొద్దో గొప్పో ఇతరులను మోసగిస్తూ తాను హాయిగా ఉండేటట్లు చూసుకుంటాడు.

కానీ ఇదంతా ఒక ప్రహసనం, అభినయనం వంటిది. స్టేజి మీద కౌశలం ప్రదర్శించి తరువాత నీటి బుడగవలె పగిలిపోతుంది. మోసం ఎంతో కాలం దాగదు, రేపోమాపో అందరికీ తెలుస్తుంది. ఇలాంటి వేషాలు ఆలోచనాపరుల దృష్టిలో హాస్యస్పదంగా ఉంటాయి. ఈ డబ్బు ప్రధానయుగంలో ఎవరితో ఏమయినా చెప్పించవచ్చు, చేయించవచ్చు, వ్రాయించ వచ్చు, కానీ ఈ గూడుపుఠాని ప్రస్తుత ప్రపంచాన్ని ఎక్కువ కాలం మోసగించలేదు. ఈ ఆటలలో ఇసుకతో భవంతులు నిర్మించవచ్చు. కానీ కొన్ని క్షణములలోనే అవి కూలిపోతాయి. రాబోయే రోజులలో అటువంటి భవంతులు కట్టడం తరువాత కూలడం చూడవచ్చు. ఇటువంటివారు నవ్వులపాలవుతారు. దగ్గరవారు, స్నేహితులు ముఖం త్రిప్పుకుని దూరంగా పోతారు. మోసగాడిని మించిన దురదృష్టవంతుడు ఉండడు. అతని కష్టకాలంలో పలికేవాడు ఎవడూ ఉండడు.

ఇక్కడ మహత్త్వపూర్ణమైన, నిస్వార్థపూరకమైన, ఉపయోగ కరమైన ప్రేరణ ఇచ్చే కార్యక్రమాల గురించిన చర్చ జరుగు తున్నది. ఎవరికి ఆదర్శముల కొరకు తపన ఉన్నదో, వారు తమ ఆదర్శముల కొరకు తమ సాధనములను, కౌశల్యాన్ని, ప్రతిభను ఆనందంగా వెచ్చిస్తారు. ప్రపంచ ఇతిహాసములో ఆదర్శముల కొరకు తమ సర్వస్వమును ధారపోసినవారు మాత్రమే సఫలీకృతమయ్యారు. వీరి ప్రయాస మధ్యలో ఆగదు, దారి తప్పదు. ఇటువంటివారే శ్రేయస్సుకు అధికారులవుతారు. మహాదానులని వీరినే అంటారు.

– *అనువాదం:* ముక్కామల రత్నాకర్

## మనల్ని మనం తెలుసుకుందాం

*ఒక నక్షత్రం ఆకాశం నుండి భూమి మీద పడింది. భూమి అడిగింది. "నీవు ఇంత ఎత్తు నుండి క్రిందకెందుకొచ్చావు? నక్షత్రం అంది – "దేవీ... అంత ఎత్తు నుండి నాకు నీవు మెరుస్తూ ఎంతో సుందరంగా కనిపించావు. నిన్ను పొందుటకు నేను నిరంతరం తపస్సు చేస్తున్నాను. నేడు ఆరోజు వచ్చింది." పృథ్వి అంది – "ఆకాశంలో నీవు కూడా ఎంతో మెరుస్తూ ఉంటావు. కానీ ఇక్కడ నీవు నల్లగా – కురూపిగా కనిపిస్తున్నావు." నక్షత్రం అంది కదా – "దూరం నుండి నీవు ఎంతో సుందరంగా కనిపించావు. నిన్ను కలిస్తే నేను కూడా ఇంతే సుందరంగా మారిపోతానని" అనుకున్నాను. ఆశ్చర్యంతో భూమి ఇలా అంది – "నేను నిజంగా ఇంత సుందరంగా నీకు కనిపిస్తున్నానా? అంటూ పృథ్వి తనను తాను చూసుకొంటే – నల్లటి చీకటితో కప్పబడి ఉన్నట్లు తెలుసుకొంది. మౌనంగా ఉండిపోయింది. అప్పుడు నక్షత్రం అంటుంది – "అయితే నాకు ఇప్పుడు విషయం అర్థమైంది. దూరం నుండి నన్ను నీవు మెరుస్తున్నట్లుగా చూశావు... అలాగే నేను నిన్ను చూశాను. అందువల్ల మనమిరువురం మెరుస్తున్నట్లుగానే ఉన్నామని ఎందుకు అనుకోకూడదు. అర్థం చేసుకోవలసిన విషయమిది. ఇరువురిని చూసిన కారుచీకటి తన కురూపితనంతో అక్కడి నుండి పారిపోవటం మంచిదని వెళ్ళిపోయింది. భ్రమనంతటిని తెలుసుకోవటంలోనే ఉంది. అందుచేత మనం మనల్ని తెలుసుకోవాలి.*

*– అఖండజ్యోతి, జనవరి 2011*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ముందంజలో ఉండటం వెనుక రహస్యం ఏమంటే ముందంజలో ఉండాలనే తపన**

## దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర-2

# యజ్ఞమయ జీవనం

మన మహర్షులు గాయత్రిని భారతీయ సంస్కృతికి తల్లిగాను, యజ్ఞాన్ని తండ్రిగాను వర్ణించారు. అవి రెండూ విడదీయరాని జంట. గాయత్రీ అనుష్ఠానాన్ని సంకల్పబద్ధంగా నిర్వహిస్తారు. ఆ అనుష్ఠానం సంపూర్ణం కావాలంటే చివర యజ్ఞం చేయాలి. పరమపూజ్య గురుదేవులు 24 లక్షల జపాన్ని 24 మహాపురశ్చరణలు పూర్తిచేశారు. దానికొరకు 1946లో 108 కుండాలతో విరాట్ పూర్ణాహుతి యజ్ఞం నిర్వహించారు. ఆ తరువాత 1948లో 1008 కుండాలతో గాయత్రీ మహాయజ్ఞం చేసి ఆ అనుష్ఠానాన్ని పూర్తిచేశారు. గాయత్రి సత్‌జ్ఞానానికీ, సద్బుద్ధికీ మూర్తియైన దేవి. ఆమె సత్కర్మకు దేవత. శతపథ బ్రాహ్మణంలో "వ్యష్టిగతం, సమష్టిగతం అయిన జగత్తు వ్యవస్థను ఏర్పాటుచేసి దానిలో సామంజస్యాన్ని నిర్మాణం చేసే శక్తి గాయత్రి" అని తెలిపారు. యజ్ఞమన్న శబ్దం యజ అనే ధాతువుతో ఏర్పడింది. దాని అర్థం పాణిని ధాతు పాఠావళిని అనుసరించి దేవపూజ (వ్యక్తిత్వంలో దైవీశక్తులను నింపుకోవడం) సంగతీకరణం (అనగా సంఘబద్ధం, సంఘటనాత్మకం అయిన ఆదర్శవాదం) దానం (పరమార్థ పరాయణత్వం, సదాశయం).

భారతీయ సంస్కృతిలో, వైదిక సాహిత్యంలో యజ్ఞ వివరణ ఎంతో అధికంగా ఉంది. దానిని గమనిస్తే యజ్ఞమే వేదాలకు, ఆర్షవాఙ్మయానికి పర్యాయపదమని తోస్తుంది. యజ్ఞ స్వరూపాన్ని అర్థం చేసుకోవాలంటే దానిలోని మర్మం ముందు మనకు తెలియాలి. గీతాకారుడు భగవద్గీత 3వ అధ్యాయంలో 9వ శ్లోకంలో ఈవిధంగా చెప్పాడు.

**యజ్ఞార్థాత్ కర్మణోஉన్యత్ర లోకోஉయం కర్మ బంధనః**
**తదర్థం కర్మకౌంతేయ ముక్తసంగః సమాచర ॥**

అనగా "యజ్ఞం నిమిత్తం చేయబడే కర్మలలో కాక ఇతర కర్మలలో మునిగిన మనుష్య సముదాయం కర్మబంధనాలలో బంధింపబడుతుంది. కావున ఓ అర్జునా! నీవు ఆసక్తిలేనివాడివై ఆ యజ్ఞం నిమిత్తమై కర్తవ్యంగా కర్మను చేయుము." మనుష్యుడు తాను చేసే కర్మలనన్నింటిని యజ్ఞం నిమిత్తమే చేయాలి. త్యాగంతో చేయాలి. తదితర కర్మ మనిషిని బంధనాలతో బంధిస్తుంది. జన్మజన్మాంతరాల వరకు ఆ కర్మల ఫలితం ప్రారబ్ధం రూపంలో వెన్నంటి వస్తుంది. గీత 3వ అధ్యాయం లోని 10వ శ్లోకం నుండి 16వ శ్లోకం వరకు ఇదే విషయం వివరింపబడింది.

**సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః**
**అనేన ప్రసవిష్యధ్వమేష వోஉస్త్విష్టకామధుక్ ॥**

**దేవాన్‌భావయతానేన తే దేవా భావయంతు వః**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥**

**ఇష్టాన్ భాగాన్‌హివో దేవా దాస్యంతే యజ్ఞభావితాః**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవసః ॥**

**యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః**
**భుఞ్జతే త్వఘం పాపాయే పచంత్యాతకారణాత్ ॥**

**అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥**

**కర్మబ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవం**
**తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥**

**ఏవం ప్రవర్తితం చక్రం నాను వర్తయతీహ యః**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి**

అనగా సృష్టి ప్రారంభంలో ప్రజాపతి బ్రహ్మ యజ్ఞంతో పాటు ప్రజలను సృష్టించి వారితో "ఈ యజ్ఞం ద్వారా మీరు ముందు ముందు వృద్ధి పొందండి. ఈ యజ్ఞమే మీరు కోరుకున్న కోరికలను ఫలింపచేస్తుంది. యజ్ఞం ద్వారా దేవతలు అభివృద్ధి చెందుతున్నట్లుగా చేయండి. దానివలన ఆ దేవతలు మిమ్మల్ని వృద్ధిపొందింపచేస్తారు. ఈవిధంగా పరస్పర సంవర్ధన వలన మీరు పరమ శ్రేయస్సును పొందండి. యజ్ఞం ద్వారా వృద్ధి చెందిన దేవతలు మీకు అభీష్టాలను, భోగాలను ఇస్తారు. ఆ విధంగా దేవతలిచ్చిన భోగాలను పొంది వాటిని మరల దేవతలకు ఈయకుండా తమకోసమే వండుకునేవారు దొంగలు. యజ్ఞంలో శేషించిన అన్నాన్ని తినేవారు సమస్త పాపాల నుండి

**"రేపు చేద్దాం" అనుకుంటే జీవితంలో సాధించదలచుకున్న వాటి నుండి దూరం అవుతారు**

విముక్తులవుతారు. అయితే తమకోసమే వండుకునేవారు పాపాలలోకెల్లా పాపాన్ని భుజిస్తారు. అన్నం వలన శరీరం పుడుతుంది. మేఘాల వలన వర్షం కురుస్తుంది. దానివలన అన్నం పుడుతుంది. యజ్ఞం వలన మేఘం ఏర్పడుతుంది. కర్మ వలన యజ్ఞం ఉత్పన్నమవుతుంది. కర్మ బ్రహ్మ నుంచి పుడుతుంది. ఆ బ్రహ్మ అక్షరం నుండి (నశించనిది) ఉత్పన్న మవుతుంది. కావున సర్వవ్యాప్తియైన బ్రహ్మ యజ్ఞంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఈలోకంలో ఈ చక్రాన్ని అనుసరించని వారు ఓ పార్థా! పాపమయ జీవితాన్ని గడిపే వ్యర్థజీవను లవుతారు. గీత 4వ అధ్యాయంలో శ్రీకృష్ణుడు అర్జునునికి యజ్ఞ క్రియ, యజ్ఞంలో వాడే సామాగ్రి, యజ్ఞకర్త, యజ్ఞగ్రహీత, యజ్ఞలక్ష్యం, ఉద్దేశ్యం అన్నీ ఆ బ్రహ్మయే అని వివరించారు. (గీత 4/24) అందులో యజ్ఞంలోని అగ్ని భౌతికమైన అగ్నికాదని, బ్రహ్మాగ్ని అని తెలిపారు. ఓర్పే అగ్ని. శుద్ధమైన ఇంద్రియాల క్రియయే అగ్ని. ప్రాణాయామం ద్వారా నియమితమైన ప్రాణశక్తియే అగ్ని. ఆత్మజ్ఞానమే శ్రేష్ఠమైన అగ్ని. యజ్ఞశిష్టమైన అన్నం అమృతం. ఇది పొందినవాడు సనాతన బ్రహ్మను పొందుతాడు. యజ్ఞమే ప్రపంచ విధానం. అటువంటి యజ్ఞాన్ని చేయనివానికి ఇహ లోకమే లేదు. పరలోకం అసలే లేదు. అన్ని యజ్ఞాలు బ్రహ్మాగ్నిలో అర్పింపబడతాయి. (4/32 గీత).

ద్రవ్యయజ్ఞం అన్నింటికన్నా క్రిందిస్థాయిది. జ్ఞానయజ్ఞం ఉత్తమోత్తమమైనది. ఆధ్యాత్మికజ్ఞానంలో బ్రహ్మజ్ఞానమే అన్ని జ్ఞానాలకు చిట్టచివరిది.

**శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞఃపరంతప**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥**

వాస్తవానికి వాసనల ఆధిపత్యాన్ని తగ్గించి ఉన్నతస్థాయి శక్తులను నిర్మించుకుని యజ్ఞం కోసం కర్మలను చేస్తూ మనం జ్ఞానాన్ని పొందుతాం. ఆ వెంటనే భగవత్ప్రాప్తి అన్న పరమ శాంతిని లేక లక్ష్యాన్ని సాధిస్తాం. (జ్ఞానం లబ్ధ్వా శాంతిమచిరేణ అధిగచ్ఛతి) ఇదే యజ్ఞంలోని మర్మం. మన భావాలు యజ్ఞ లక్ష్యంతో మమేకం కాకపోతే, ఇతర కర్మకాండ అప్రధానమే అవుతుంది.

గాయత్రి, యజ్ఞం ఒకదానికొకటి పూరకాలు. గాయత్రి వలన దేవత్వం లభిస్తుంది. యజ్ఞంవలన ద్విజత్వం లభిస్తుంది. (మహాయజ్ఞైశ్చయజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః) ద్విజత్వ మనగా నూతన జన్మ. అంటే వ్యక్తిత్వంలో సంపూర్ణమైన మార్పు. యజ్ఞం వలన వ్యక్తికి ఒక విధమైన కాయకల్పచికిత్స జరుగు తుంది. యజ్ఞప్రక్రియవలన సూక్ష్మచేతనాశక్తి విజృంభిస్తుంది.

గాయత్రి, యజ్ఞం రెండూ సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం, అథర్వ వేదముల సమన్వయరూపం. అవి రెండూ విడదీయరానివి. సామవేదంలో యజ్ఞకర్మకాండ కాక సూక్ష్మతలోని మహిమను తెలిపారు. ఇందులో స్థూలమైన హవిస్సులో సూక్ష్మ, భావనాత్మక భూమిపై సూక్ష్మశబ్దశక్తితో నిండిన మానవ హవిస్సును ప్రయోగిస్తారు. తైత్తిరీయ బ్రాహ్మణంలో శాస్త్రకారులు ఈ సూక్ష్మీకరణకు ఎంతో మహత్తు కలిగిన ఫలశృతిని తెలిపారు. గాయత్రీ యజ్ఞం మహత్తును వైజ్ఞానికంగా ప్రతిపాదించారు. యజ్ఞం అన్నది ఒక సూక్ష్మ స్థాయికి చెందిన వైజ్ఞానిక విషయం. జడపదార్థ విజ్ఞానం అందరికీ తెలిసిందే. భౌతిక విజ్ఞానం నేడు 5వ తరగతిలోనే చదువుతున్నారు. ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని యజ్ఞంతో ప్రారంభించి తెలుసుకోవాలి. యజ్ఞంలో భౌతిక విజ్ఞానానికి తోడు జడపదార్థ సూక్ష్మీకరణం సమ్మిళితమై ఉన్నది.

యజ్ఞమన్న సూక్ష్మప్రక్రియ ప్రతిపాదనను యజుర్వేదంలోని ఈ ఋక్కులో చూడవచ్చు.

"యజమానః స్వర్గలోకం యాతి". అనగా యజ్ఞమువలన యజమానునికి (గొప్ప ఆత్మకు) స్వర్గలోకం (అమృతత్త్వము) లభించును. నిజానికి జీవుని శుభాశుభకర్మలు, గుణకర్మ స్వభావాలు వికసించడం వలన ఆత్మకు ఫలోపభోగం కలుగు తుంది. అగ్నిలో యజనం చేయబడిందా లేదా? స్థూల కర్మ కాండ చేయబడిందా లేదా? అన్నవాటిమీదకాక, యజ్ఞకర్త వ్యక్తిత్వం, యజ్ఞ ప్రయోజనము, వాడే సాధనాల యోగ్యత, సామూహికంగా యజ్ఞం చేయడం ద్వారా కలిగే విశాల భావములు లేనంతవరకు యజ్ఞం సక్రమంగా జరిగినట్లు కాదు. ఈ మాట మంత్రాలకు కూడా వర్తిస్తుంది. ముద్రాపకుల చేత ముద్రింప బడిన పుస్తకాలలోనివే మంత్రాలు. వాటిని సంస్కృతాక్షరాలు తెలిసిన వారెవరైనా చదువవచ్చు. కానీ సిద్ధ మంత్రాలను పలకాలంటే సిద్ధి పొందిన వ్యక్తిత్వముగల ఉద్గాత కావాలి. అప్పుడే ఆ మంత్రాలలో ప్రభావం పడుతుంది. ఈ విషయంలో శాలమని, వరమని శాస్త్రాలలో వర్ణనలున్నాయి.

**మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకోవాలి**

ఉద్గాతయే కాక బ్రహ్మ, అథర్వుడు, హోత అన్నవారితో కూడిన ఒక బృందం సమర్థులైనవారితో ఏర్పడాలి. దానివలన సూక్ష్మీకృతమైన ప్రభావం పుడుతుంది. శబ్దశక్తికి పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అనే నాలుగు రూపాలు ఉన్నాయి. అయితే మంత్రప్రవక్తకు రెండు విధాలయిన యోగ్యతలుండాలి. అవి తపస్సు ద్వారా పరిశుద్ధమైన శరీరం, శబ్దశక్తితో నిండిన వ్యక్తిత్వం.

పెద్ద యజ్ఞాలలో ఒక్కొక్కరు ముగ్గురేసి సహాయకులను నియమించుకునే అవకాశం పైన పేర్కొన్న నలుగురికీ ఉంటుంది. యజ్ఞానికి ప్రధాన సంరక్షకుడు, అధ్యక్షుడు, అధిష్ఠాత బ్రహ్మ. అతనిని అధ్వర్యుడని కూడా పిలుస్తారు. ఈ వరుసలో అంగిరస వంశస్థులయిన బ్రహ్మగణానికి ఎక్కువ గౌరవం ఇస్తారు. అతని జీవితం బ్రహ్మనిష్ఠతో నిండి ఉంటుంది. యజ్ఞాన్ని సక్రమంగా పూర్తిచేయగల కౌశలం అతనిలో ఉంటుంది. అతనికి సహాయం చేసేవారిని బ్రహ్మవర్చస్ అని, అగ్నీంద్రుడని, హోత అని పిలిచేవారు. ఉద్గాత అనగా దేవతలను స్తుతి చేసే మంత్రాలను పఠించేవాడు. యజ్ఞానికి ప్రధాన పురోహితుడిని హోత అంటారు. అతడు తెలిపినట్లుగా యజ్ఞంలోని వివిధ కార్యకలాపాలను నిర్వహించేవానికి అధ్వర్యుడని పేరు. బ్రహ్మ, ఉద్గాతలు ప్రజాపతి ముఖమునుంచి, హోత, అధ్వర్యులు బాహువుల నుంచి జన్మించినట్లు తెలుపబడింది. అధ్వర్యునికి సహాయకులు ప్రతిప్రస్థాత, నేష్టా, ఉన్నేత. ఉద్గాతకు సహాయకులు ప్రస్తోత, ప్రతిహర్తా, సుబ్రహ్మణ్యం. హోతకు సహాయకులు ప్రశస్తా, అచ్ఛావా, గ్రావస్తోత. ఉద్గాత సామగానం లోను, హోత ఋగ్వేదంలోను విద్వాంసులై ఉంటారు. నిజానికి యజ్ఞంలో వాక్‌శక్తికి, మంత్రశక్తికి ప్రసిద్ధులైన ప్రయోక్తలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది.

యజ్ఞంలో వాడే అగ్నికి, మామూలు నిప్పుకు భేదం ఉన్నది. యజ్ఞం చేతనా జగత్తులోని విజ్ఞానములోని ఒక అంగం. ఈ విజ్ఞానం ఇతర విజ్ఞానముల కన్న గొప్పస్థాయి కలది. అగ్నిని పూజించడం యజ్ఞోపచారాలలో ముఖ్యమైనదే. అయితే యజ్ఞమంటే అదేకాదు. యజ్ఞం ద్వారా పరోక్షంతో సంపర్కం ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. వేదంలో విశ్వానికి నాభిస్థానమేది అన్న ప్రశ్నకు ఋషి జవాబు చెప్తూ "అయం యజ్ఞో భువనస్య నాభిః" అన్నారు. అంటే ఈ బ్రహ్మాండానికి కేంద్రస్థానం, ఆధారం యజ్ఞం. మామూలు నిప్పు వంటిది కాదు ఈ అగ్నిహోత్ర ప్రక్రియ. ఋషులు మూడు విధాలయిన అగ్నులను గురించి తెలిపినారు. మొదటిది పావకాగ్ని. ఇది ఇంట్లో పొయ్యిలో వెలిగే నిప్పు, వంట వంటి లౌకిక ప్రయోజనాలకు పనికివచ్చే నిప్పిది. రెండవది పవమానాగ్ని. ఇది మానవ శరీరంలో ఉండే అగ్ని. తిన్న తిండి అరగటం నుండి వ్యక్తికి గతిశీలతను కల్పించేవరకు గల అనేక ప్రయోజనాలకు ఈ అగ్ని పనికివస్తుంది. తపస్సు, సంయమనంల ద్వారా దీని ప్రభావాన్ని పెంచవచ్చు. మూడవది శుచి అన్న అగ్ని. దీని ద్వారా అదృశ్యజగత్తు మనకు అనుకూలంగా మారునట్లు చేసుకొనవచ్చు. ఈ అగ్ని వాతావరణాన్ని ప్రభావితం చేసి విశ్వవ్యవస్థను సక్రమంగా ఉంచుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే యజ్ఞాగ్ని మూడు క్షేత్రాలకు సంబంధించిన శక్తులను విజృంభింపచేసి విశ్వాన్ని నియమించగల శక్తి. ఆ అగ్ని ద్వారా పావక, పవమాన, శుచి అగ్నులకు భూమిక ఏర్పడుతుంది. అధ్యాత్మక్షేత్రంలోని సమస్త కార్యకలాపాలు యజ్ఞతత్త్వ పరిధిలోనికి వస్తాయి. శ్రీమద్భగవద్గీత ఇలా అన్నది.

**ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞాసథాపరే**
**స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చయతయః సంశితవ్రతాః**

యజ్ఞాలు అనేక విధాలు: ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, యోగయజ్ఞం. స్వాధ్యాయ రూపంలో ఉండే జ్ఞానయజ్ఞం.

యజ్ఞాగ్నిని మరి మూడు విధాలుగా విభజించారు. వ్యక్తిగతమైన తేజస్సుకు ఆవహనీయాగ్ని స్థాపించాలి. కుటుంబ అభివృద్ధికి గార్హపత్యాగ్ని. అట్లే విశ్వకళ్యాణానికి, సమాజ ప్రగతికి దక్షిణాగ్నిని స్థాపించాలి. ఈ అగ్నిస్థాపన అన్నది వ్రతశీలతకు ప్రతీకం. మనుస్మృతి గార్హపత్యాగ్నిని తండ్రిగాను, దక్షిణాగ్నిని తల్లిగాను ఆవహనీయాగ్నిని గురువుగాను పేర్కొంది. యజ్ఞంలో అగ్నిని ప్రజ్వలింపజేసే పనికితోడు ఉన్నత భావాలు కూడా ఉండాలి. ఉన్నతమైన ప్రాణశక్తి తోడైతేనే అద్భుత ప్రభావం ఉత్పన్నమవుతుంది. యజ్ఞంలోని భావనాత్మక భాగం ఎంతో శక్తివంతంగా ఉండడం ప్రధానం. అప్పుడే యజ్ఞం ఆధ్యాత్మిక కార్యకలాపాలకు వెన్నెముక అవుతుంది.

– *అనువాదం: కె.బి. సోమయాజులు*

**బలహీనతలకు లొంగిపోకూడదు**

# ఎటువంటి అన్నమును స్వీకరిస్తామో అటువంటి మనస్సే ఏర్పడుతుంది

మనుష్యులు ఎలా ఆలోచిస్తారో అలానే చేస్తారు అనేది ఒక సత్యము. ఎవరి మనస్సులో చెడు ఆలోచనలు వస్తాయో వారు ఉదయం నుండి సాయంత్రం లోపుగా ఏదో ఒక చెడ్డ పని చేస్తారు. అది చిన్నది కావచ్చు, పెద్దది కావచ్చు. కర్మకు మొదటిరూపము ఆలోచనే. ఎవరు ఏమి చెయ్యబోతున్నారు అనేది వారి బుర్రలో తిరిగే ఆలోచనలను బట్టి గుర్తించవచ్చు.

ఏ పని సునాయాసంగా ఏమీ అయిపోదు. దాని మొదటి ఆధారము ముందుగా వారి మెదడులో మొలకెత్తి తిరుగుతూ ఉంటుంది. అది బాగా పక్వానికి వచ్చినప్పుడు ఆ గ్రుడ్డును పగల గొట్టుకొని ఆ ఆలోచనలన్నీ బైటకు వస్తాయి.

ఈనాడు ఎవరు ఎలా ఆలోచిస్తున్నారు అనే దానిపైనే వారు రాబోయే రోజుల్లో ఏం చేస్తారు, ఏం చెయ్యబోతున్నారు అనేది తెలుస్తుంది. ఆలోచనకు ఆహారముతో నేరుగా సంబంధముంటుంది. తామసికభోజనము చేసేవారి ఆలోచనా విధానము తామసికంగానే ఉంటుంది. సాత్విక ఆహారము వల్ల సాత్వికమైన ఆలోచనలకు పృష్ఠభూమి ఏర్పడుతుంది. మద్యమాంసాలను సేవించేవారు మెల్లి మెల్లిగా కఠినమైన ఆలోచనలకు బానిసలౌతారు. మత్తుమందు తీసుకునేవారికి వివేకము, దూరదృష్టి నశిస్తాయి. అదే సమయంలో సాత్వికమైన ఆహారము తీసుకునేవారి శరీరము రోగరహితముగా ఉండడమే కాక ఉత్తమ ఆలోచనలతో నిండి ఉంటుంది.

తమ భావిజీవితాన్ని ఎలా తయారుచేసుకోవాలి అనుకుంటే వారు ఆ స్థాయి సాహిత్యాన్నే చదువవలసి ఉంటుంది. కేవలం మనోరంజనం కోసమో, కాలక్షేపం కోసమో సాహిత్యాన్ని చదవ కూడదు. మనం చదివే సాహిత్యము చాలా ప్రభావాన్ని చూపుతుంది అనే విషయాన్ని తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. ఒక్కోసారి ఒక ఆలోచనను మరొక ఆలోచనతో ఖండించేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా ప్రతిపక్షము యొక్క ఆలోచనలు పెరుగుతుంటాయి. కానీ ఇక్కడే మనం చెడు ఆలోచనా శక్తి పెరగకుండా జాగ్రత్త పడాలి. ఆ శక్తి ఎక్కడుంటే అక్కడ అనేక ప్రమాదాలను తీసుకు వస్తుంది. దానివల్ల పరిస్థితులు తలక్రిందులవుతాయి. మంచి, చెడు ఆలోచనల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. చదివేప్పుడు ఆ రెండింటిని కలిపి చదివినప్పటికీ చెడు ఆలోచనల ప్రభావం చాలా తీవ్రంగా, మరింత ఎక్కువగా ఉంటుంది. సాంగత్యానికి సంబంధించిన అంశాలలో కూడా ఈ నియమమే వర్తిస్తుంది. మంచి, చెడు మనుషులందరు ఒకేసారి కలిసి కూర్చుని ఉన్నా చెడు చాలా త్వరగా ఎక్కువగా తన ప్రభావాన్ని చూపిస్తుంది.

ఇదే విధానము ఆహారమునకు కూడా ఒక అంశముగా పరిగణింపబడుతుంది. మిర్చిమసాలాలతో కూడి, బాగా నూనెలో వేయించిన ఆహారమును తినడం వల్ల అది మానవుని మనస్సును చంచలం చేస్తుంది. స్వభావం పైనా, ఆలోచనల పైనా భోజనం యొక్క ప్రభావం చాలా ఉంటుంది. ఇంకా చెప్పాలంటే స్వాధ్యాయము, సత్సంగముల కంటే భోజనమునకే పెద్దపీట వేయబడింది. (ఇక్కడే బలివైశ్వదేవము యొక్క ప్రాముఖ్యత ఏమిటో తెలుసు కోవాలి). తినకూడనివాటిని తినడం వల్ల పొట్ట, మెదడులపై వాటి ప్రతిక్రియ చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు మధువును సేవించిన తరువాత ఆ వ్యక్తి స్థితి ఎలా ఉంటుందో తెలుసుకుందాము. అతనికి చాలా తక్కువగా తినాలని లేదా చాలా ఎక్కువగా తినాలని కానీ అనిపిస్తుంది. అది సామాన్యమైన ఆకలికి ఉండే స్థితి కాదు. ఇలాంటప్పుడు ఆలోచనలు కూడా వికృతంగా మారుతుంటాయి. క్రోధం పెరిగి కామవాసనలు అసాధారణంగా విజృంభిస్తాయి. తన గురించి తనకు అసాధారణమైన ఆలోచనలు కానీ లేదా కుంటి, గ్రుడ్డివంటి దీనహీనస్థితి గురించిన ఆలోచనలు కానీ వస్తుంటాయి. అంతా కోల్పోయినట్లు లేదా అంతా తన చేతిలోనే ఉన్నట్లు అనిపిస్తుంది. ఇదంతా అతను సేవించిన మత్తు పదార్థము వల్ల జరుగుతుంటుంది. ఇదే విధంగా మిగిలిన ఆహార పదార్థముల విషయంలో కూడా జరుగుతుంటుంది. పదార్థా లన్నింటికి వాటి వాటి ప్రభావముంటుంది. పండ్లు, కూరలు వంటి ఆహారము వల్ల సాత్వికమైన ఆలోచనలు వస్తాయి.

దలియా (గోధుమరవ్వ), కిచిడీ, పెరుగు వంటి సత్వగుణ పదార్థాలను పరిమితమైన మోతాదులో భుజించడం వల్ల సదాచారము, పరోపకారము, సంతులిత జీవనవిధానము పాటించాలని అనిపిస్తుంది. పక్వాన్నము, మృష్టాన్నము అంటే విందుభోజనాలు వంటివి భుజించిన తరువాత స్వార్థభావన బాగా పెరుగుతుంది, గొప్పవాడు కావాలనే కోరిక కలుగుతుంది. ఆహారము, ఆలోచనల మధ్య ఒక సునిశ్చితమైన సంబంధము దృఢంగా ఉంది.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 1985*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**ఎన్నిసార్లు విఫలమైనా సరే ప్రయత్నం ఆపకూడదు**

అంతర్యాత్ర-5

# జాగ్రత్త - మనస్సు నిస్సహాయులను చేస్తుంది

సాధకుడు నిజంగా సమర్పణ చేసుకున్నట్లయితే సాధకునికి సాక్షీభావస్థితి అనే అనుభూతి కలిగి తన స్వస్వరూపంలో నిలిచి ఉండగలుగుతాడు. మరి సమర్పణ అనేది జరుగకపోతే? అనే ప్రశ్నకు సరైన సమాధానాన్ని పతంజలి మహర్షి సమాధి పాదమందలి నాలుగవ పాదంలో చెప్పారు.

వృత్తిసారూప్యమితరత్ర ॥ 1/4

సాక్షీస్థితి కాక మరి ఇతర స్థితులన్నింటిలోను మనస్సు వృత్తులతో తాదాత్మ్యస్థితిని కలిగి ఉంటుంది. ఈ వృత్తులు సాధకుని అంతశ్చేతనను తమకు నచ్చిన దిశగా త్రిప్పుతూ ఉంటాయి. సుఖదుఃఖాలకు సంబంధించిన కలలు కనేలా చేస్తాయి. ఒక్కోసారి నవ్విస్తాయి, మరోసారి ఏడిపిస్తాయి, ఇలా కోరికలనే గట్టిదారాలతో బంధించి వేస్తాయి. ఊహాలోకాల్లోకి తీసుకెళ్ళి కోరికలనే మత్తుపానీయాలను త్రాగించి స్పృహ పోయేలా చేస్తాయి.

సాక్షీభావస్థితి తప్పించి మిగిలిన స్థితులన్నీ ఇలానే ఉంటాయనేది సత్యం. ఈ సత్యం మన నిత్యజీవితంలో ఏదో ఒక సమయంలో తప్పక అనుభవంలోనికి వస్తుంది. ఇంకా తమాషా ఏమిటంటే మనలో చాలామంది ఈ కోరికలను తృప్తిపరచేందుకే సాధనలు చేస్తుంటారు. వీటి తీవ్రతను ఇంకా పెంచేందుకు జప-తపాలు, వ్రతాలు చేయడమనే ప్రక్రియ మొదలవుతుంది. ఇందులో ఫలితాలు అనుకూలంగా వస్తే ఆనందతాండవం, రాకపోతే దుఃఖంతో కన్నీరు పెట్టుకుంటుం టారు. వృత్తులు చేయించే ఈ చిందులాట మన జీవితమును గురించి ఒక సామాన్య పరిచయాన్ని అందిస్తుంది. ఇందులో సత్యమనేది ఉండదు కానీ కలలు మాత్రం అనేకంగా ఉంటాయి. ఈ వాస్తవానికి సంబంధించిన ఒక సంకేతము కూడా ఈ సూత్రములో ఇమిడి ఉంది.

పరమపూజ్య గురుదేవులు పతంజలి మహర్షి చాలా అద్భుతమైన వారని చెప్తుంటారు. వారు తపింపచెయ్యడాన్ని, సాధన చేయించడాన్ని చాలా నమ్ముతారు. కథలు, అవీ, ఇవీ చెప్పడం వంటివాటిని ఆయన ప్రోత్సహించరు. అలా చెప్పడంపై వారికి నమ్మకం లేదు. రకరకాలుగా చెప్పే మాయ మాటలు వారికి నచ్చవు. ఒక ప్రవచనంలో పరమ పూజ్య గురుదేవులు ఈ సూత్రమును గురించి చర్చిస్తూ 'ఇప్పుడు చూడండి, పతంజలి రెండే మాటల్లో సాధకుని ముందు విషయాన్ని చాలా స్పష్టంగా ఉంచేశారు. 1. సాక్షీభావమును పొంది నీ స్వస్వరూపంలో నిలిచి ఉండు, 2. వృత్తులతోపాటు కలిసిపోయి తిరుగాడుతూ ఉండు. ఈ రెండు మార్గాలు తప్ప మరి మూడవ మార్గమనేదే లేదు. అది నువ్వు తెలుసుకోగలిగితే తెలుసుకో, అంగీకరించగలిగితే అంగీకరించు, అంతే!'

పతంజలి సూత్రాలు సాధకుల కోసం పంపించిన టెలిగ్రాములు వంటివని గురుదేవులు చెప్తుండేవారు. ఒక్కోసారి ఒక్కోసూత్రం మొత్తం వాక్యమంత కూడా ఉండదు. అవి చాలా తక్కువ సారాంశాన్ని కలిగి ఉంటాయి. ఎవరైనా టెలిగ్రామ్ పంపాలనుకుంటే అనవసరమైన మాటలన్నీ కత్తిరించి అవసరమైనవే పంపిస్తారు. అసలు టెలిగ్రాం ఉద్దేశ్యం అదే కదా! ఈ సూత్రములు కూడా అలాగే ఉంటాయి. అతి తక్కువ శబ్దాలతో మొత్తం సందేశాన్ని చెప్పగలగాలి. టెలిగ్రాం స్థానంలో ఉత్తరం వ్రాస్తే కనుక కనీసం పది వాక్యాలైనా వ్రాయందే విషయం పూర్తి కాదు. అదే టెలిగ్రాం ద్వారా అయితే ఈ పది శబ్దాలతోనే మరికాస్త ఎక్కువగానే అర్థమయ్యేలా వివరించ వచ్చును. అంతేకాదు, అది సూటిగా గుండెకు గ్రుచ్చుకునేంత సారాంశాన్ని కలిగి ఉంటుంది.

ఈ సందర్భంలోనే గురుదేవులు మాట్లాడుతూ మార్గదర్శక సత్తా కూడా చాలా సూటిగా స్పష్టమైన భాషలో చాలా కొద్ది శబ్దాలతోనే చెప్పారు. సాధన చెయ్యాలి అంటే ఇంద్రియ సుఖాల నుండి వెనక్కు తిరగాలి. పూర్తిగా ఎండిపోయినట్లుండే జీవితాన్ని జీవించాలి. ఇలా చెప్తూ ఆయన కొంచెం ఆగి మరల ఇలా చెప్పారు. అలా ఎండిపోయినట్లుండే జీవితంలో అనంతమైన ఆనందం ఇమిడి ఉంది అని తరువాత అర్థమైంది. పతంజలి మహర్షి విషయం కూడా ఇంతే! ఆయన మనల్ని ఎండి, పండి పోయిన శ్మశాన భూమిని తలపించే చోటికి తీసుకువెళ్తారు. అయితే మరుభూమికి కూడా దాని సౌందర్యం దానికుంటుంది. అక్కడ చెట్లు, నదులు ఉండవు కానీ విశాలంగా కనిపిస్తుంది.

బలహీనత అనే బంధాన్ని త్రెంచుకోవాలి

దానిని అడవితో మటుకు పోల్చలేము. అడవి సౌందర్యం అడవికుంటుంది, నదులకు వాటి అందాలు వాటికుంటాయి. మరుభూమి కూడా అనంతంగానే ఉంటుంది. కానీ ఈ త్రోవన నడవాలంటే చాలా సాహసం కావాలి. పతంజలి యొక్క ప్రతిసూత్రం సాధకుల సాహసానికి సవాలు విసురుతుంది. అతని వివేకాన్ని సావధానపరిచేందుకు చేసే హెచ్చరికవలె ఉంటుంది.

పతంజలి మహర్షి చాలా స్పష్టంగా ఇలా చెప్తారు – మీకు, మాకు మానవులందరికీ కష్టాలు, అలసట, చింత, పెడత్రోవ, కుంగుబాటు, దుఃఖము, పీడ, దిగులులాంటి వాటి నుండి సంపూర్ణంగా విముక్తి కావాలి అనుకుంటే కనుక సాక్షీభావమును అలవరచుకోవడం మినహా మరోమార్గం లేదు. ఎందుకంటే మిగిలిన స్థితులన్నింటిలోను మనస్సు, వృత్తులతో మమేకమైపోయి ఉంటుంది. మానవ స్వభావమే అటువంటిది. ఇది ఏ ఒక్క వ్యక్తికో సంబంధించినది కాదు, మానవులందరి గురించి చెప్పబడింది. మానవ ప్రకృతి నిర్మాణానికి ఇది ఒక గుర్తింపు వంటిది. సామాన్యంగా సాక్షీభావ స్థితిలో తప్ప మిగిలిన ఏ స్థితిలోనైనా ఉంటాము.

ఆలోచనలతో మనం ఎప్పుడు కలిసిపోతామో తెలీదు. ఆలోచనలనే మేఘాలతో కలిసిపోయే మనం చాలాసార్లు తెల్లని మేఘాలతోను, మరికొన్నిసార్లు వర్షం లేని ఖాళీ మేఘాలతోను కలిసి ప్రయాణం చేస్తుంటాము. అలాంటి స్థితిలో ఆకాశము యొక్క నిర్మలత్వము పోతుంది. మన ఆత్మస్వరూపమనే అంతరిక్షము నిర్మలతను కోల్పోతుంది. మనం వాటితో కలిసి పోతాము కనుకనే ఆ ఆలోచనామేఘాలు మనల్ని కమ్మేస్తాయి.

ఆకలేస్తున్నట్లుంది అనే ధ్యాస రాగానే మనస్సులో ఆలోచన మెరుస్తుంది. దానితో పొట్టకు ఆకలేస్తున్నట్లుందే అనే ఆలోచన మొదలవుతుంది. ఇంక అంతే మరుక్షణమే దానితో మనం తాదాత్మ్యతను సాధించుకుంటాము. అది మక్కువతో మనల్ని చుట్టుకుపోతుంది. ఇక మనం ఆకలి అనే పదం ఉచ్చరించడం మొదలుపెడ్తాము. మనస్సులో ఆకలి అనే ఆలోచన లేశమాత్రం రాగానే మనం దానితో తాదాత్మ్యతను సాధించుకొని నాకు ఆకలిగా ఉందే అని నిర్ణయానికి రావడం చివరి స్థితి. అదే తాదాత్మ్యత అంటే.

అలాగని యోగులకు, జ్ఞానులకు, సిద్ధులకు, సాధకులకు ఆకలి అనిపించదని కాదు. ఆకలి వారికీ తెలుస్తుంది. బుద్ధుడికి ఆకలి తెలుస్తుంది, పతంజలికి ఆకలి తెలుస్తుంది. కానీ పతంజలి నాకు ఆకలిగా ఉంది అని అనరు. వారు శరీరానికి ఆకలిగా ఉంది, నా పొట్ట ఆకలిని అనుభూతి చెందుతున్నది అంటారు. బుద్ధభగవానుడు ఆకలి పొట్టలో ఉన్నది అంటారు. యోగి పుంగవులు దానిని సాక్షిగా మాత్రమే చూస్తుంటారు. కానీ మనం తాదాత్మ్యతను పెంచుకొని, ఆ ఆలోచనలతో మనం మమేకం చెందుతాము.

మారుతున్న ఆలోచనలు, వృత్తులతోపాటుగా మన తాదాత్మ్యత కూడా మారుతూ ఉంటుంది. ఒకసారి మనం ఒకదానితోను, మరొకసారి రెండవదానితోను, ఇలా మూడు, నాలుగు అంటూ వృత్తులతో మమేకమవుతూ ఉంటాము. ఈ తాదాత్మ్యస్థితియే ప్రపంచాన్ని తయారుచేస్తున్నది. ఇంకా చెప్పాలంటే ఇదే ప్రపంచం. మనం ఒకవేళ తాదాత్మ్యస్థితిలోనే ఉంటే కనుక ప్రపంచంలోనే ఉన్నట్టుగా తెలుసుకోవాలి. వీటన్నింటితో ఉన్న తాదాత్మ్యతను దాటుకుని ముందుకు రాగలిగితే మనం ముక్తులమైనట్లే. యోగులు అనుభవించే పరమసిద్ధి, ప్రబోధకుల చివరిస్థితి ఇదే. ఇదే నిర్వాణం, ఇదే కైవల్యం. దాని కొరకు ప్రతిక్షణం ఎదురుచూడవలసిన అవసరం లేదు. మనం చెయ్యవలసినదల్లా వృత్తులతో మనకున్న సంబంధాన్ని త్రెంచుకోవడం.

– *అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**

**యుగశక్తి**  **గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి!!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**ఇతరుల బరువుని నువ్వు ఎప్పుడు ఎత్తుతావో నీ బరువు ఎవరో ఒక గురువు ఎత్తుతాడు**

శిష్య సంజీవని-2

# అన్నింటికన్నా ముందు శిష్యుడు తన మహత్త్వాకాంక్షలను వదిలివెయ్యాలి

'శిష్య సంజీవనీ' శిష్యులకు ప్రాణమును ప్రసాదించే ఔషధము. హృదయము లోపల శిష్యుడు కావాలనే నిజమైన కోరిక, సద్గురువు పట్ల తన సర్వస్వమును అర్పించటములోనే తన యొక్క ఉనికి వెతుక్కోవాలనే తపన ఉన్న వ్యక్తులకే శిష్యుడు అంటే నేర్చుకొనవలెననే కోరిక ఉండటముతోపాటు వినయముతో అణకువగా ఉండటము కూడా ఎంతో అవసరము' అన్న విషయమును కూడా గుర్తుంచుకోవాలి. 'జ్ఞానము' అహంకారము కన్నా ఎక్కువ విలువైనదని తెలుసుకొని శిష్యత్వ సాధన కోసం తమ సర్వస్వమును త్యాగము చెయ్యటానికీ, తమను తాము సమర్పణ చేసుకొనటానికీ ఎవరైతే సిద్ధపడతారో వారే ఇందుకు అర్హులు. శిష్యత్వమనగా ఒక లోతైన వినమ్రత! తనను తాను వినమ్రముగా (అణకువగా) మలచుకొని హృదయమునకు అర్హతను చేకూర్చుకున్నవాడే శిష్యుడు.

మనకు ఎంతగా దాహం వేస్తున్నప్పటికీ పారుతూ ఉన్న జలప్రవాహము ఒక్క గంతు వేసి మన చేతులలోకి రాదు. అంటే నీటి ప్రవాహమునకు మన మీద కోపమున్నట్లుగా మనము భావించకూడదు. నిజానికి నీరు ప్రతిక్షణం, ప్రతి ఒక్కరి దాహమును తీర్చటానికే సిద్ధముగా ఉంటుంది. అయితే ఇందుకోసము మనము కూడా ప్రయత్నించవలసి ఉంటుంది. వంగి, దోసిలి పట్టి నదిని స్పృశించవలసి ఉంటుంది. అప్పుడు నీటి ప్రవాహము తనంత తానే మన చేతులలోనికి వచ్చేస్తుంది. అదేవిధముగా వినయముతో ఒదిగి ఉండటానికి సిద్ధమైనవారికే ఈ శిష్యసంజీవనీ సూత్రములు ప్రకటించబడ్డాయి. కేవలము దాహముతో ఉన్నంత మాత్రమున సరిపోదు, వంగి దోసిలి పడితేనే నీరు మనకు ప్రాప్తిస్తుంది.

శిష్యుని హృదయములో సద్గురువు చరణములపై నన్ను నేను సమర్పించుకోవాలి అన్న ఒకే ఒక్క భావము అంకురించి, పల్లవించి, పుష్పించినట్లయితే అందుకు ఎలాంటి అభ్యంతరము లేదు, కానీ జీవితము యొక్క రహస్యము నాకు అర్థము కావాలి అన్న కోరిక అతనిలో కలగాలి. అలాగే సద్గురువు చరణ కమలముల పైని ధూళిని కావాలి అని ఆలోచించినంత మాత్రమున సరిపోదు. ఆయన కృపతో జీవితము యొక్క అసలైన అర్థము, ప్రయోజనము ఏమిటి? అందులోని రుచి ఏమిటో నాకు అవగతము కావాలి. అసలు నేనెవరు? ఎందుకు ఇలా జన్మించాను?' అని కూడా శిష్యుడు ఆలోచించాలి. అటువంటి సజల భావపూరితమైన శ్రద్ధ కలిగిన శిష్యులకే శిష్యసంజీవనీలోని ఈ సూత్రములు చెప్పబడుతున్నాయి. ఇందులోని ప్రతి ఒక్క సూత్రము క్రొత్తగా వస్తున్న శిష్యులకు, పూర్వ శిష్యపరంపరలనే గొప్ప విభూతుల ద్వారా నిర్దేశించబడిన మాటలు. వీనిని సంపూర్ణముగా అనుసరించడమే శిష్యత్వ సాధన యొక్క లోతులలోనికి ప్రవేశించడము.

ఎవరైతే ఈ మహాసాధనను ఆచరించటానికి సిద్ధమవుతారో వారికి శిష్య సంజీవనీ యొక్క ప్రథమ సూత్రము 'శిష్యులైన వారికి మహత్త్వాకాంక్షలు (గొప్ప గొప్ప కోరికలు) ఉండటమనేది మొట్టమొదటి శాపము. మహత్త్వాకాంక్షలు సాధనామార్గములో ముందుకు సాగుతున్నవారిని మోహితులను చేసి పథ విహీనులను కావిస్తాయి. సత్కర్మల ద్వారా లభించే పుణ్యమును ఇవి సమాప్తము గావిస్తాయి. బుద్ధిమంతులు, ఎంతో సమర్థులు, మహాతపస్వులు అయిన వ్యక్తులు కూడా దీని వలలో చిక్కుకుని తమ తమ అత్యున్నత స్థితుల నుండి దిగజారిపోతుంటారు. మహత్త్వాకాంక్షలు ఎంతో సమ్మోహనమైనవి, ఆకర్షణీయమైనవి అయినప్పటికీ వాటి ఫలాలను తినేటప్పుడు నోటిలో దుమ్ము ధూళిని నింపుతాయి. మృత్యువు, ద్రోహము వలెనే దీని నుండి స్వార్థము కోసము, స్వ-విస్తృతి (తన అభివృద్ధి) కోసము చేసే పనుల యొక్క ఫలితములు కేవలము నిరాశనే మిగుల్చుతాయి. మహత్త్వాకాంక్ష అనేది ఒకవిధముగా చెప్పాలంటే సాధనకు మహావినాశనమును తెచ్చిపెడుతుంది.

'శిష్యత్వమును' స్థిరముగా విజయవంతముగా సాధన చేసినవారందరి యొక్క అనుభవముల సారమిది, మహత్త్వాకాంక్షలకు-శిష్యత్వమునకు ఎక్కడా పొంతన కుదరదు. శిష్యుడు కావటానికి తనను తాను దహింపజేసుకోవాలి. ద్రవింప జేసుకోవాలి. శూన్యముగా మిగిలిపోయేంతవరకు సమస్తమును

**పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ ఉండదు**

త్యాగము చెయ్యాలి. అప్పుడే పాత్రత లభిస్తుంది. ఆ పాత్రతను సద్గురువు యొక్క వరదానములతో పరిపూర్ణము చేసుకోగలము. మహత్త్వాకాంక్ష అనేది ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఇంకా ఏదో కావాలనే కోరిక, అల్పమైన తమ కోర్కెలను నెరవేర్చుకోవాలనే వెఱ్ఱితనము మహత్త్వాకాంక్షలలో గోచరమవుతాయి. మహత్త్వాకాంక్షియైన వ్యక్తి ఎప్పుడూ తన అల్పమైన కోర్కెలతోనే చుట్టివేయబడి ఉంటాడు. మహత్త్వాకాంక్షలో దాగి ఉన్న సత్యమును మనోవైజ్ఞానికులు గనుక విశ్లేషించినట్లైతే 'ఒక వ్యక్తి ఎంత ఎక్కువగా ఆత్మహీనతా భావముతో బాధపడుతుంటాడో అంతగా అతడు మహత్త్వాకాంక్షల యొక్క పాశముతో బంధించబడతాడు' అని స్పష్టమవు తుంది. ఇటువంటి మనిషి సర్వదా ఇతరుల నుండి సంపద, వైభవము, పదవి ఆరోగ్యము మొదలైనవాటిని చూసి ఆశపడుతుంటాడు. అతడికి ప్రతి నిమిషము 'వారిలాగైతే బాగుండును, వీరిలాగైతే బాగుండును' అని అనిపిస్తుంటుంది. ఈవిధమైన తాపత్రయము అతడిని ఆత్మవిముఖుడిని గావిస్తుంటుంది. ఇటువంటి మనఃస్థితిలో తనకు లభించగలిగిన అవకాశములను తెలుసుకొనటముగానీ, అన్వేషించటముగానీ, వాటిని సాకారము చేసుకోవాలనే స్పృహకానీ అతడికి ఉండదు.

అందుచేతనే ప్రతి సద్గురువు తన శిష్యునికి మొట్టమొదట మహత్త్వాకాంక్షలను (గొప్ప గొప్ప కోరికలు) తొలగించుకొమ్మని ఆదేశిస్తాడు. 'నువ్వు ఎవ్వరిలాగానో కావాలనే ఆలోచనను కూడా విరమించుకోవల్సిందిగా నిర్దేశిస్తాడు. 'భగవంతుడు నీకు ఎందుకు జన్మనిచ్చాడో ముందర దానిని తెలుసుకొనటమే నీ ప్రథమ కర్తవ్యము' అని కూడా శిష్యునికి బోధిస్తాడు.

'ప్రతి ఒక్క మనిషి భగవంతుని యొక్క సనాతనమైన అంశయే' అన్న సత్యమును అనుభూతి చెందగలగాలి. అందు కోసము వేరెవరినో అనుకరించవలసిన అవసరము లేదు. ఆత్మతత్త్వమనేది ఎల్లప్పుడు నీలోపలే ఉన్నది. మనము చెయ్యవలసినదల్లా దానిని తెలుసుకొనటమే!

ఆత్మతత్త్వమును అవగాహన చేసుకొనటానికిగానీ, నీ స్వస్వరూపమును అనుభూతి చెందటము కోసము గానీ క్రొత్తగా జోడించవలసినది ఏమీ లేదు కానీ కొంచెము తొలగించుకోవలసినది ఉంటుంది. మీలో పేరుకుపోయున్న కుసంస్కారముల, దుష్ప్రవృత్తుల యొక్క చెత్తాచెదారమును పూర్తిగా నిర్మూలించుకోవాలి. చెత్తకుప్పలో వజ్రం పడున్నది. చెత్తను తొలగించి వజ్రమును బయటకు తీయాలి. ఇందుకోసము వేరొకరిని అనుకరించవలసిన పనిలేదు, ఏదో ఒక గొప్ప ఆకాంక్షను పెంచుకోవలసిన అవసరము లేదు. మహత్త్వాకాంక్షల వలన తనను తాను ఇతరులతో పోల్చుకొనటము తద్వారా దుఃఖము, ఈర్ష్య, హింస మొదలైనవి ఉత్పన్నమవ్వటం జరుగుతుంది. మనిషి లోపలుండే కాంక్షల యొక్క నిష్పత్తికి అనుగుణముగా అతనిలో దుఃఖము, అశాంతి జన్మిస్తాయి. జర్మనీదేశ తత్త్వవేత్త శ్లేయర్ 'మహత్త్వాకాంక్ష' అనేది ఒక భయంకరమైన జబ్బు. మానవజాతికీ, మానవీయ నాగరికతకు ఈ జబ్బు వల్ల కలిగినంత నష్టము మరే ఇతర కారణముల వల్లా సంభవించ లేదు. మానవుడు దీనికి ఎంత త్వరగా దూరమైతే అంత మంచిది. సత్యసాధనను జీవనలక్ష్యముగా ఏర్పరచుకున్న వ్యక్తి దీనిని ఏవిధముగాను తన దరికి చేరనీయకుండా చూసుకుంటే మేలు కలుగుతుంది' అని తెలియజేస్తున్నాడు.

మహత్త్వాకాంక్షల చేత జీవితము మలినమైన వ్యక్తి ఎప్పటికీ శిష్యుడు కాలేడు. అటువంటి వ్యక్తికి సద్గురువు కృప ఏనాటికీ లభించదు. అందుచేత శిష్యత్వ సాధన చెయ్యదలచుకున్న వ్యక్తికి గొప్ప గొప్ప గురుభక్తులు మహత్త్వాకాంక్షలను వదిలివెయ్యమని సూచిస్తున్నారు. మరొకరితో తమను తాము పోల్చుకునే ప్రవృత్తిని కూడా తొలగించుకోవాలి. 'సద్గురువుకు తమను తాము ఏవిధముగా సంపూర్ణ సమర్పణ చేసుకొనగలము' అన్న ఒక్క అంశము మీదనే శ్రద్ధ వహించాలి. మన జీవితము కాంక్షారహితమైనప్పుడు దయామయుడైన సద్గురువు దీనికి భగవచ్ఛక్తిని ప్రకటీకృతము చెయ్యగలడు.

ఆత్మతత్త్వము యొక్క దివ్యత్వముతో నిండిన జీవితము తనంత తానే పరిమళభరితమవుతుంది. సకల దైవీతత్త్వములు స్వయముగా మన ఉనికిలో సాకారమవుతాయి (ప్రత్యక్షమవుతాయి). ఇందుకు కావలసినదల్లా శిష్యసంజీవనీ యొక్క ప్రథమ సూత్రమును హృదయంగమము చేసుకొనటమే! ఈ ప్రథమ సూత్రమును హృదయము ఎంతగా మననము చేసుకొనగలిగితే రెండవ సూత్రము కోసము మన చేతనత్వము అంతగా సిద్ధము కాగలదు.

– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి
శ్రీమతి లక్ష్మీరాజగోపాలు

**దేహబలం కన్నా బుద్ధిబలం గొప్పది**

బోధ కథ

# స్నేహమనే సిరాతో సద్గుణాల రచన

ఒక ప్రౌఢ వయస్సున్న వ్యక్తి మేజాబల్లకు అటువైపు కూర్చున్న కార్యనిర్వాహక సమితి సదస్యులలో ఉన్న ఒకరికి టైపు చేసి ఉన్న ఒక పేపరుని చేతికిచ్చాడు చదవమని. దానిని చదివిన వ్యక్తి చేతులు వణకసాగాయి. ఏదో ఒక పాముని తన చేతిలో పట్టుకున్నట్లు కంపించాడు. అతడు మెల్లగా ఆ టైపు చేసిన కాయితాన్ని వేరొకరికి అందించాడు. ఆవిధంగా ఒకరి తరువాత ఒకరు ఆ పేపరుని అందరు చదివారు. అందరూ మాటలుడిగినట్లు స్తబ్దులయ్యారు. గొంతులో అతి కష్టంతో ఉమ్మ మింగి, తేరుకొని "ఏంటిది?" అని అడిగారు.

"అది నా రాజీనామా, చదివారు కదా!" "అవును ఎందుకని? మా వ్యవహారంతో మీకేదైనా నచ్చక కోపమొచ్చి రాజీనామా చేస్తున్నారా లేక ఇతరులెవరైనా తప్పు చేసినందుకా?"

"లేదు! మీరంతా ఎంతో మృదుస్వభావులు. మీ ప్రవర్తనకు నేనెంతో కృతజ్ఞుడిని. మీ సహాయ-సహకారాలతో నాకెంతో గౌరవం లభించింది. "మరెందుకని రాజీనామ చేయదలచు కున్నారు? ఎంతోమంది ఉద్యోగం దొరకక తంటాలు పడుతుంటే, తమరు ఇంత గౌరవప్రదమైన పోస్ట్-గ్రాడ్యుయేట్ కాలేజీకి ప్రిన్సిపల్ పదవిని పొంది కూడా ఎందుకు రాజీనామా చేయదలచుకున్నారు? ఇంతకు మించిన గొప్ప ఇతర ఉద్యోగమేదైనా లభించిందా?" "బహుశా అదే అయి ఉండి ఉంటుంది. ఇంతకన్నా ఎక్కువ వేతనం లభించేటప్పుడు, తక్కువ వేతనం లభించే పని వదలటం మంచిదే కదా?" ఈవిధంగా అందరు అనుకోవటంతో, వారిలో నుండి ఒక వ్యక్తి అడిగాడు. "ఏ పదవిని స్వీకరించబోతున్నారు?" ప్రజాసేవ పదవి! అందరు ఆకాశం నుండి ఒక్కసారిగా భూమి మీద పడినట్లు అనుభూతికి లోనయ్యారు!

వీరందరి ఆశ్చర్యాన్ని గమనించి ఆయనిలా అన్నారు - "ఈ సమయంలో మన దేశంతోపాటు మన సమాజం గురించి, ఈ రెండింటి భాగ్యాన్ని సరిక్రొత్త కాయితం మీద, సరిక్రొత్త కలంతో, కొత్త సిరా నింపి వ్రాయబడబోతుంది. ఇటువంటి విలక్షణ సమయంలో ఎవరైనా తమ బాధ్యతను విడనాడి ప్రక్కకు తప్పుకొంటే అంతకు మించిన అభాగ్యులు మరెవరు ఉందరు. యుగపురుషుడు మానవీయ పీడతో దుఃఖిస్తున్నాడు. ఏడుస్తూ తన 'జోలెను' అందరి ఎదుట పరుస్తున్నాడు. ఇల్లిల్లు తిరిగి పెద్దగా అరుస్తున్నాడు. ఓ... ధనవంతులారా! నాకు కూడా మీ సంపాదనలో నుండి కొంతభాగం ఇవ్వండి! మానవులారా! మీ అమూల్య సమయంలోని కొద్ది సమయాన్ని 'నాకివ్వండి!'

ధనం, సమయంతోపాటు సాధనము - ప్రాణము కలిస్తేనే ఏదైనా సాధించగలము. ఈ మాటలు విన్నవారంతా చకితులు అయ్యారు. వారిలో నుండి ఒక వ్యక్తి కొంచెం సంకోచిస్తూ - "తమరు నౌకరీ చేస్తూనే మీరు కోరుకున్నట్లు కొంత ధనాన్ని, సమయంలోని కొంత భాగాన్ని ఇవ్వవచ్చు కదా.

ఓహ్! మీరు ఆయన పడే బాధను గుర్తించలేకపోతున్నారు! ఆయన ఒకసారి హరిశ్చంద్ర నాటకాన్ని చూసిన పిదప, తనను తాను దేశం కొరకు అమ్ముడుపోయాడు! స్వయంగా అమ్ముడవటమే కాక తన పరివారాన్ని కూడా అమ్మివేసి ఆయన అనుభవించే బాధను మీరు గుర్తించుట లేదు. భగవంతుడు అనుమతిస్తే నేనిప్పటి వరకు సంపాదించిన దానినే కాకుండా, నేను కూడా స్వయంగా ఆయన పాదాలకు అర్పణం చేయాలనే శపథం తీసుకున్నాను. ఇప్పటి నుండి నా సామర్థ్యంలోని ప్రతి కణం, సమయంలోని ప్రతి క్షణం సమాజం కొరకు ఆ మహాపురుషుని ఆజ్ఞానుసారం ఖర్చు చేయాలనుకొంటున్నాను! ఇదేదో భావోద్రేకంతో కూడిన మాటలు కాదు.

ఇది విన్నవారంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆ తరువాత అంతా ఏకకంఠంతో "మేమంతా క్షమించమని వేడుకుంటున్నాము "వాస్వానీజీ" తమరి ఈ త్యాగం మా అందరికీ ఎంతో గర్వ కారణం. అందువల్ల నేటి నుండి మేమందరం కూడా మా ధనం, మా సమయం యథాశక్తి సమాజం కొరకు వెచ్చించ దలచుకున్నాము."

సమాజం కొరకు తన సర్వస్వాన్ని అర్పించిన ఈ మహా పురుషుని పూర్తి పేరు "శ్రీ థాపర్‌దాస్ లీలారామ్ వాస్వానీ! తన సేవాపరాయణత్వ పనులు నెరవేర్చుచున్న కారణంగా ఈయన పేరును తరువాత కాలంలో "సాధు వాస్వానీ" గా ప్రజలు పిలుచుకోసాగారు. వీరు 25-11-1879 నాదు సింధు ప్రాంతంలోని హైదరాబాద్ జిల్లాలో జన్మించారు. పేదవారైన

**చేపట్టిన పని పూర్తయ్యేదాకా విశ్రాంతి తీసుకోకూడదు**

వీరి తండ్రి వియోగానంతరం వీరు ఎమ్.ఎ. (ఫిలాసఫీ) లో ప్రథమునిగా ఉత్తీర్ణుడైన తరువాత లాహోర్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ తరువాత కాలంలో అదే కాలేజీ ప్రిన్సిపల్ పదవిని పొందారు.

ఆరోజుల్లో దేశంలో ఆమూలాగ్ర మార్పు కొరకు మహాత్మాగాంధీగారు సుడిగాలి తుఫాను పర్యటన చేస్తున్నారు. దేశంలోని యువకులంతా వారితోపాటు తిరగటమే కాక, ఆ ఆందోళనలో మహిళలు కూడా పాల్గొని చాలా తీవ్రంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ "మత్తువదులు, లేచి నిలబడు, స్వాతంత్ర్య సమరంలో దూకు" అంటూ బ్రిటిష్ గవర్నమెంట్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు. ఇటువంటి సమయంలో కలసిరాకపోతే అటువంటివారి జీవితం వ్యర్థమని, ఈ సమరంలో పాల్గొనేవారే అత్యంత శ్రేష్ఠులని పిలుస్తున్న పిలుపులు వాస్వానిగారిని కుదిపివేశాయి. ఆయనకెదురుగా దుఃఖంతో దైన్యస్థితిలో, బాధలను అనుభవిస్తున్న భరతమాత చిత్రం తిరగసాగింది. ఆయనలోని ఆత్మదేవత ఆయనను చివాట్లు పెట్టుట ప్రారంభించింది! "నీవే గనక నిజమైన శిక్షకుడవైతే, మానవత్వ భావనల గొంతును కోయుచున్న ఈ సమయంలో నీవు అడ్డుకోనట్లైతే నీవేమి శిక్షకుడవు? దర్శనశాస్త్రంలో నిష్ణాతుడవైన నీవు ఈ సమయంలో హాయిగా నిద్రపోతున్నావు, ఇంతకుమించిన తప్పు ఇంకేముంటుంది?" అని ఆయన ఆత్మ ఘోషించసాగింది.

'చాలు... ఇక చాలు' అనే ఛీత్కారం ఆయనలో లేచింది! పశ్చాత్తాపంతో కన్నీరు ప్రవహించసాగింది. ఆయనలోని అంతరాత్మ విలపిస్తూ లేచింది. దానితో ఆయనిలా అనసాగాడు – "నాలో రేగిన ఈ అగ్నిజ్వాలను ఎన్నటికి ఆరనివ్వనని శపథం చేస్తున్నాను!" దాని పరిణామ ఫలితంగానే ఆయన తన ప్రిన్సిపల్ పదవికి రాజీనామా సమర్పించి, సమాజం కొరకు తన సర్వస్వాన్ని అర్పించుటకు సంకల్పం తీసుకున్నారు.

గాంధీజీ సలహా ప్రకారం "క్రొత్త సమాజం కొరకు క్రొత్త మానవ నిర్మాణం స్థాపించు" అనే పిలుపు మేరకు అనేక శిక్షణ సంస్థానాలను స్థాపించుట జరిగింది. ఈ సంస్థ శాఖలు మొత్తం 'సింధ్' ప్రాంతమంతా విస్తరించాయి. దేశ విభజన తరువాత ఆయన బొంబాయి సంస్థానం యొక్క పనిని ప్రారంభించాడు. ఏమా పని? ఒకే పని అది. ఒక క్రొత్త మానవ నిర్మాణపు పని! తన స్వంత జీవితంలో అతి చిన్న పనిని కూడా ఎంతో తన్మయత్వంతో, ప్రభావం చూపే పద్ధతిలో చేయుటను చూసి చకితులయ్యేవారు. తమ ప్రయత్నాలను దూర–దూరాల వరకు విస్తరించుట కొరకు ఆయన తన కలం ద్వారా, తన మాట ద్వారా చెప్పదలచుకొన్నది వినిపించేవాడు. 'మీరా' పేరు మీద ఒక పత్రిక నడుపుట ద్వారా గొప్ప ప్రజాస్వామ్యవాదిగా పేరు గడించాడు.

ఒకసారి ఎవరో ఆయనను ఒక ప్రశ్నవేశాడు – "తమరు ప్రతిసారి 'మానవ నిర్మాణం' అనే విషయం గురించి అంటూ ఉంటారు. మరి అటువంటి 'మానవ నిర్మాణం' ఎలా జరుగుతుంది? అని! ఆ ప్రశ్నకు, జవాబుగా ఆయన మరొక ప్రశ్నను సంధిస్తూ – "నీవు ఎప్పుడైనా 'రబ్బర్‌స్టాంపు' చూశావా?" "చూశాను" "ఎలా తయారవుతుంది?" రబ్బరుని కరిగించి, దాని మీద కోరిన అక్షరాలను చెక్కుతారు? "ఆ తరువాత?" "ఇంకేముంది?" దానికి సిరా రాసి ఎక్కడ అదిమి ముద్రవేస్తే అక్కడ దాని ముద్ర కనబడుతుంది. అంతే!" ఆ విధంగా మానవ నిర్మాణం కూడా తయారవుతుందని తెలుసుకో! ఒక్కటొక్కటిగా మానవీయ సద్గుణాలు ఆలోచన, చరిత్ర, వ్యవహారంలో వికసిస్తాయి. అవి ఇంత తేలిగ్గా వికసించవు! కష్టం సహించవలసి ఉంటుంది. తితీక్షను సహించాలి. వీటికి మరో పేరు "తపస్సు", స్వయంగా అన్ని సద్గుణాలు బాగా అందమైన రీతిలో వికసించగానే, రెండవదాని దగ్గరకు వెళ్ళు! అది సిరాగా పనిచేస్తుంది. స్నేహం, ఆత్మీయతా భావం లేకపోతే ఇది సంభవం కాదు! స్నేహపు 'సిరా' ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, సద్గుణాల రచన అంతే స్వచ్ఛంగా ఉంటుంది. ఇతరుల్లో కొద్ది ప్రయత్నంతో వారిలోని సద్‌గుణాలు స్వచ్ఛంగా వికసింపచేయటమే మానవీయ నిర్మాణపు విధానం!"

వినేవారి అనుమానం తీరింది. ఆయన తన జీవితమంతా ఈ ప్రయత్నాలలోనే పూర్తి తత్పరతతో నిండిపోయాడు. తన కాలంలో ఆయన దేశంలోని అనేకులను ప్రజాసేవకులుగా మలచుట జరిగింది. మహాత్మాగాంధీజీ హాస్యంగా అంటూ ఉండేవారు – "వాస్వానీగారు మనకొరకు రూపాయలను ముద్రించే మిషన్ వంటివారు" నిజంగానే ఆయనొక మిషనే. నూటికి నూరుశాతం స్వచ్ఛమైన వ్యక్తిత్వం గల మనిషి. "భారత వాసులందరు తమ బాధ్యతలను మరవకుండా నెరవేర్చగలరనే ఆశతో" ఆయన లోకాన్ని వీడిపోయారు. సమాజపు సమయాను కూలమైన ఆవశ్యకతలను పూర్తిచేయుట కొరకు మనమంతా మన సర్వస్వాన్ని వినియోగించే పనిలో నిమగ్నమవుదాం!

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1990*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**గమ్యం చేరేదాక విశ్రమించకూడదు**

హనుమాన్ జయంతి ప్రత్యేకం

# రామకార్యం కాకుండా విశ్రాంతి ఎలా?



*అతులితబలధామం హేమశైలాభదేహం*
*దనుజవనకుశానుం జ్ఞానినామగ్రగణ్యం*
*సకలగుణనిధానం వానరాణమధీశం*
*రఘుపతిప్రియభక్తం వాతజాతం నమామి*

**భావం:** బలానికి నివాసమైనవాడు, బంగారు పర్వతం (సుమేరు) వంటి కాంతి కలిగిన శరీరం కలవాడు, దైత్యవనాన్ని నాశనం చేసే అగ్ని స్వరూపమైనవాడు, జ్ఞానులలో అగ్రగణ్యుడు, సకల గుణాలు కలిగినవాడు, వానరులలో శ్రేష్ఠుడు, రఘునందనుని ప్రియభక్తుడు, పవనకుమారుడు అయిన శ్రీ హనుమంతునకు నేను ప్రణామం చేస్తున్నాను.

ఆంజనేయస్వామికున్న బహుముఖ ప్రజ్ఞ మరెవరికీ లేదు. భక్తి, జ్ఞాన, సేవలలో అగ్రగణ్యుడు. దానితో పాటు సరళంగా, నిరభిమానంగా, కృపతో, వ్యవహార కుశలతతోపాటు సర్వశక్తి మంతుడు. నిజానికి ఆయనకు ఎన్నో రూపాలు. విద్వాంసుడైన బ్రాహ్మణుడి రూపంలో 'జ్ఞానినాం అగ్రగణ్యం' అనిపించు కున్నాడు. క్షత్రియ బ్రాహ్మణుడిగా చేతిలో గద పట్టుకుని ఉంటాడు. 'హనుమంతుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులందరి రూపంలోను కనిపిస్తాడు, అంటే అతను అందరి వాడు' అని శ్రీరాముడే స్వయంగా అన్నాడు.

"ప్రభు! మీరు నన్ను బ్రాహ్మణుడన్నారు, క్షత్రియుడన్నారు. వైశ్యుడని కూడా ఎందుకన్నారు? నాలో మీకు ఏ వ్యాపారగుణం కనిపించింది?" అని ఆంజనేయుడే స్వయంగా రాముడ్ని అడిగాడు. "ప్రియ హనుమా! వైశ్యులు ఎదుటివారిని ఋణగ్రస్తుల్ని చేస్తారు. నువ్వు నాకు ఎంత సేవ చేశావో ఆ ఋణం తీర్చడం సాధ్యమా" అన్నాడట శ్రీరాముడు.

*సును సుత తోహి ఉరిన్ మై నాహీ*
*దేఖేవూ కరి బిచార్ మన్ మాహీ*

(రామచరిత మానస్, సుం.కా. 31/5)

హనుమంతుడు ఎంతో అమాయక స్వభావం కలిగినవాడు. ఆ అమాయక స్వరూపం (సిందూర రూపం)తోనే అన్ని చోట్ల పూజించబడతాడు. ఒకసారి సీతమ్మ సింధూరం ధరిస్తుండగా చూసిన హనుమ "అమ్మ ఇదెందుకు పెట్టుకుంటారు?" అని అడిగాడు. "ఇది సౌభాగ్యానికి ప్రతీక" అంది ఆవిడ. "దీనితో ఏమొస్తుంది" అని ఎదురు ప్రశ్నించాడు హనుమ. "దీనితో శ్రీరాములవారు ప్రసన్నంగా ఉంటారు అన్నది. ఆవిడ మాట పూర్తిగా వినకముందే ఆయన ఆ సింధూరాన్ని తన శరీరం నిండా రాసేసుకున్నాడు. అప్పట్నుంచి ఆయన్ని ఆ రూపంలోనే పూజిస్తున్నారు.

*విద్యావాన్ గునీ అతి చాతుర్*
*రామకాజు కరిబే కో ఆతుర్*

హనుమంతుడు విద్వాంసుడు, గుణవంతుడు, ఎంతో ప్రతిభావంతుడు. రామకార్యం చేయడానికి ఎల్లప్పుడు ఆత్రుతతో, ఉత్సాహంతో ఉండేవాడు. నేటి పోటీ ప్రపంచంలో మనమంతా కూడా ఈ మూడు గుణాలను (విద్వత్తు, గుణము, ప్రతిభ) ధారణ చేయాలి. అందుకే శ్రీరాముడు ప్రతిభతో చేయవలసిన పనులన్నీ హనుమతోనే చేయించాడు.

రామాయణంలో ఎంతో తెలివి ఉపయోగించిన పాత్రలు రెండున్నాయి. ఒకటి మంథర, రెండు హనుమ. శ్రీరాముడి నుండి దూరం చేసే తెలివిని మనం కుటిల తెలివి అంటున్నాం, అదే శ్రీరామునితో కలిపేదాన్ని భక్తి అంటున్నాం. సీతమ్మను వెతకడానికి హనుమంతుడు లంకకు వెళుతున్నప్పుడు ఆయన ఎన్నో సందర్భాల్లో కనబరిచిన ప్రతిభ సుందరాకాండలో చూడవచ్చు.

*జలనిధి రఘుపతి దూత బిచారీ*
*తై మైనాక్ హోహి శ్రమహారీ*

(రామచరిత మానస్, సు.కా. చౌ 5)

సముద్రుడు ఆయనను రాముడి దూతగా భావించి, మైనాకునితో ఆయన అలసటను దూరం చేయమన్నాడు. అనగా విశ్రాంతిని ఇవ్వమన్నాడు.

*హనుమాన్ తేహి పరసాకర్ పుని కీన్హి ప్రణామ్*
*రామ కాజు కీన్హే బిను మోహి కహా బిశ్రామ్*

హనుమంతుడు మైనాకుడిని తాకి, ప్రణామము చేసి, "సోదరా! శ్రీరాముని కార్యము పూర్తి కాకుండా నాకు విశ్రాంతి ఎలా?" అన్నాడు.

**అతిథులు వస్తే ఆప్యాయంగా స్వాగతం పలకాలి**

ఇక్కడ ఆయన ప్రతిభను చూపించాడు. తిరస్కరించకుండా, మర్యాదగా తాకి ఊరుకున్నాడు. మైనాకపర్వతం సుఖ సమృద్ధు లకు ప్రతీక. హనుమంతుడు సుఖ సమృద్ధులను తిరస్కరించ లేదు. వాటిని తాకాడు, కానీ తన పనిని మరిచిపోలేదు.

చాలాసార్లు వైరాగ్యం, సరళ స్వభావాన్ని కోరుకునేవారు సుఖ సమృద్ధులను ఇచ్చే సాధనలను శత్రుత్వంతో చూస్తారు. దేనిని ఎక్కువగా తిరస్కరిస్తే మనసు దాని మీదకే మళ్ళడం మనిషి స్వభావం. ఈవిధంగా మనస్సులో ఆసక్తి కలుగుతుంది. హనుమంతుడు మైనాకపర్వతాన్ని తాకడంలో అర్థం ఏమిటంటే, వివేకంతో సుఖసమృద్ధుల సాధనాలను ఉపయోగించడం. ఇక్కడ మనం నేర్చుకోవలసినది, సౌకర్యాలను ఉపయోగించుకోవాలి, వాటి భోగంలో మునిగిపోకూడదు అని.

ముందుకు సాగిపోతున్న హనుమంతుడి దారిని సురస అనే రాక్షసి అడ్డుకుంటుంది. హనుమంతుణ్ని తినడానికి ఆ రాక్షసి నోరు పెద్దగా తెరిస్తే, ఆయన తన శరీరాన్ని అంతకన్నా పెద్దగా పెంచాడు. సురస తన నోటిని మరింత పెంచింది. అప్పుడు హనుమంతుడు టక్కున అతి చిన్నగా మారి, సురస నోటిలో దూరి, తక్షణం బయటకు వచ్చేశాడు.

ఇది చూసి మనం నేర్చుకోవలసినది ఏమిటంటే జీవితంలో ఎవరినైనా జయించాలంటే, వారికన్నా పెద్దగా అవడం సమాధానం కాదు. చిన్నగా మారడం అంటే నమ్రతతో ఉండాలి, అదే ఎప్పటికీ విజయాన్ని ఇస్తుంది. హనుమంతుడు తలచుకుంటే సురసతో యుద్ధం చేసి ఉండచ్చు. దాన్ని ఓడించ వచ్చు. కాని ఇప్పుడు లక్ష్యం యుద్ధం కాదు. యుద్ధం చేస్తే సమయం, శక్తి అన్నీ వృధా అవుతాయి. సీతమ్మను వెతకడం మీదనే ఇప్పుడు ధ్యాసపెట్టాలి. మనం చాలాసార్లు మన లక్ష్యాన్ని మరచిపోయి కొట్టుకోవడం, తిట్టుకోవడంలో గడిపేస్తాం. ఈవిధంగా గొప్పతనాన్ని, పెద్దరికాన్ని నిరూపించుకోవడంలో పడి లక్ష్యాన్ని ఎలాగూ మర్చిపోతాం, ఇతరుల దృష్టిలో గొప్ప వారిమి కూడా కాలేము. హృదయాలను గెలవడంలో, వాటిపై రాజ్యం చేయడంలోనే గొప్పతనం ఉంటుంది.

ఆ తరువాత హనుమంతుని దారికి సింహిక అనే రాక్షసి అడ్డుపడింది. దానిని చంపేశాడు. ఎందుకంటే అది ఈర్ష్యకు ప్రతీక. అది ఎగురుతున్నవారి నీడను పట్టుకుని వారిని తినేసేది. ఈర్ష్యను పోషించకూడదు, చంపేసేయాలన్నది హనుమంతుని అభిప్రాయం. ఈర్ష్యతో రగిలిపోయేవారు ఎప్పుడూ తమ శక్తి నంతటినీ ఇతరులతో గొడవపడడానికే వెచ్చిస్తారు. పోరాడుతూనే ఉంటారు. మనిషి పోరాడదలచుకుంటే తన భాగ్యంతో పోరాడాలి, దాన్ని మెరుగుపరుచుకోవాలి. భాగ్యం మారక పోవచ్చు, కాని దాన్ని ఎదుర్కునే స్థాయికి ఎదగడానికి వర్తమాన పరిస్థితులను మార్చుకునే ప్రయత్నం చేయవచ్చు.

సముద్రాన్ని దాటి లంకకు చేరినప్పుడు లంకను రక్షించే రాక్షసి లంకిణి ద్వారం దగ్గర ఎదురైంది. అతి చిన్న రూపంతో ఉన్న హనుమంతుడిని కూడా గుర్తుపట్టి బలవంతంగా అతన్ని లోపలికి వెళ్ళకుండా ఆపింది. అప్పుడు ఆయన పిడికిలి బిగించి ఆమెను గుద్దగానే, నేలరాలింది.

లంకిణి లంకకు రక్షకురాలు. కానీ ఆమె రావణాసురుడి వంటి నీచుని సేవకురాలు. ఒక తప్పుడు వ్యవస్థను రక్షించే రక్షకుడిపై తప్పకుండా దాడి చేయాలి. ఇక్కడ హనుమంతుడు ప్రదర్శించిన శౌర్యం అద్వితీయం. ఆయన చూపించిన ప్రతిభ కూడా మనందరికీ ప్రేరణాప్రదమైనది. అందుకే ఆయన్ని అతి ప్రతిభావంతుడు అన్నారు.

హనుమంతుడి గురించి “రామ కాజ కరిబే కో ఆతుర్” అంటారు గోస్వామి తులసీదాసు. రామకార్యం చేయడానికి ఎప్పుడూ ఆతృతతో ఉంటాడు, బద్ధకించడు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయడు. రామకార్యం చేయడం అంటే మరో అర్థం ఆయన్ని సుఖపెట్టడం, ఆయనను ప్రసన్నంగా ఉంచడం. మనం ప్రేమించినవారిని సుఖపెట్టడానికి పని చేస్తాం, ఊరికే పని పూర్తి చేయడం కోసం మాత్రమే కాదు. అటువంటి పని చేసేటప్పుడు సంతోషం కలుగుతుంది, ఉత్సాహంగా ఉంటుంది, చేసినందుకు తృప్తిగా ఉంటుంది. అదే మన పనివల్ల వారికి బాధ కలిగితే మనకూ బాధగా ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ సంతోషపెట్టే పనులే చేయాలి, అదే విజయానికి మార్గం.

పరమభక్తి సాగరుడు, పరమ శక్తిశాలి, శ్రీరాముని పరమ సేవకుడు అయిన హనుమంతుని పావన జయంతి నాడు ఆయన అద్భుతమైన, అద్వితీయమైన వ్యక్తిత్వాన్ని మనమంతా ఆదర్శంగా తీసుకుని వారి ఆరాధన చేద్దాం.


– *అఖండజ్యోతి, ఏప్రిల్ 2015*

అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి, శ్రీమతి స్వప్న*

**అతిథిని గౌరవించడం మన కర్తవ్యం**

## మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-1

# అమ్మ



అమ్మ యొక్క స్నేహిల స్మరణతో మనందరి మనః ప్రాణాలు విలక్షణ పులకింతతో నిండుతాయి. అనేక అనుభూతులు, అగణిత స్మృతులు, అసంఖ్య భావనలు అంతఃకరణ ప్రాంగణంలో అనాయాసంగా వర్షిస్తాయి. మధురస్మృతుల సఘన మేఘాలు మళ్లీ మళ్లీ అంతర్గగనంలో కమ్ముకుని అమ్మ ప్రేమ యొక్క జీవన-జలము దప్పికగొన్న, ఎండిపోయిన ప్రాణముల మీద వర్షిస్తుంది. మన అమ్మ ఎక్కడో సుదూర లోకాలలో కాదు, మన దగ్గరే చాలా దగ్గరే ఉందన్న భావము కలుగుతుంది. ఆమె కొంగు మనల్ని స్పృశిస్తుంది. ఆమె ఆశీస్సుల నీడలో మనందరి జీవితము సురక్షితంగా ఉన్నది.

అమ్మా! నీవు తప్ప పిల్లలమైన మాకు ఇంకెవరున్నారు? అప్పుడు ఇప్పుడు, సమయ-అసమయాలలో మేము నిన్ను మాత్రమే పిలుస్తాము. జీవితములో ఎదుర్కొన్న ప్రతి దెబ్బ, ప్రతి దుఃఖము, ప్రతి నొప్పిలో హే మాతా! మాకు కేవలము నువ్వే గుర్తుకువస్తావు. కన్నీళ్లతోను, బాధలతోను వికలమైన మా జీవితాలకు నీ యొక్క నిరంతర స్మృతి మాత్రమే ఔషధి. మాలోని లోటుపాట్లు, మూర్ఖత్వాలు, తప్పులన్నింటినీ కూడా చూసి చూడకుండా వదిలేసి మమ్మల్ని నీ దరికి చేర్చుకుంటావు.

అమ్మా! నీ క్షమాగుణము అపారము. దానికి సీమ లేదు, షరతు లేదు. క్షమయే నీ స్వభావము. పువ్వు నుంచి సుగంధము, దీపము నుంచి వెలుతురు ఎలా ప్రవహిస్తాయో; నీనుంచి క్షమ అలా ప్రవహిస్తుంది. అమ్మా! సృష్టి యొక్క ప్రతి స్థూల, సూక్ష్మ విధానాలలో, ప్రతి చిన్న పెద్ద తప్పుకి లేక అపరాధానికి ఏదో ఒక శిక్ష తప్పనిసరిగా ఉంటుంది. సృజేత యొక్క కఠోరకర్మ విధానంతో అందరు బంధింపబడి ఉన్నారు. చివరకి స్వయంగా సృజేత కూడా కర్మఫలం యొక్క హస్తరేఖలను స్వీకరిస్తాడు. కానీ హే క్షమామయి! నీయొక్క క్షమాశక్తితో జీవితములోని మహాపాతకాలు కూడా క్షణంలో నశిస్తాయి. ఇది సృష్టి యొక్క సమస్త విధానాల కంటే అనేక రెట్లు సమర్థవంతమైనది.

'అమ్మా!' ఈ మహామంత్రమే మా ప్రాణము. 'అమ్మా! అమ్మా!' అని జపిస్తూనే నీయొక్క కృపాకిరణాల వృష్టి మామీద కురిసింది. జీవితములో అలౌకిక అనుభూతుల యొక్క అనేక అవకాశములు లభించాయి. నీ యొక్క లీలాకథ పుణ్యస్మరణ కూడా దీనిలో ఒకటి. అమ్మా! ఇప్పుడు మాపై దయ చూపించు. ఈ పుణ్యకథ నీ యొక్క అమిత ప్రభావముతో నీ పిల్ల లందరికీ నీపై అవిరళభక్తి యొక్క వరదాన మిస్తూ మాతృతత్త్వ బోధ ఇచ్చుగాక!

### అన్ని సంవేదనల మూలము - మాతృతత్త్వము

మాతృతత్త్వము జీవితానికి, ప్రపంచానికి, సమస్త సంవేదనలకి మూలతత్త్వము. సృష్టి యొక్క అన్ని సంవేదనలు మాతృత్వసారము వలన అంకురితమవుతాయి. సృష్టిలోని అన్ని అవకాశములు ఇక్కడనుంచే ప్రకటీకృతమౌతాయి. జగత్తు విస్తరించడానికి కారణము ఈ పూర్ణత్వములోని ఒక్క అంశ మాత్రమే. ఈ సత్యమునే వైదిక ఋషులు "ఏకాంశేన స్థితి జగత్" అని తెలిపారు. ఇదే సృష్టి యొక్క అర్థము. దీనినుంచే జీవితము యొక్క వివిధ రూపాలు జన్మిస్తాయి. దార్శనికులు దీనినే జీవితము మరియు జగత్తు యొక్క అన్ని అనివార్య తత్త్వములను ధారణ మరియు పోషణ చేసే "మూలప్రకృతి" అన్నారు. ఇదే ఋగ్వేదంలో వర్ణించబడిన ఆదిమాత. 'అదితి' స్వయముగా 'అనాది, అనంతము మరియు అవిభాజ్యము' అయినప్పటికి అన్ని లోకాలకు జన్మ మరియు జీవితమును ఇస్తున్నది. చివరికి అన్నీ ఇందులోనే విలీనమైపోతాయి. విశ్వ బ్రహ్మాండమును సంచాలితము చేసే ఆదిశక్తే ఈ మాతృ తత్త్వమును ప్రపంచానికి పరిచయము చేస్తుంది.

అన్ని యోగసాధనల పరాకాష్ఠే ఈ మాతృతత్త్వము యొక్క అవగాహన. యోగము యొక్క విభిన్న తత్త్వములు, విధి విధానములు, అనుశాసనములు ఈ పరమపూర్ణతను తెలుసు

**తమ అవసరాల కంటే ఇతరుల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు ధన్యులు**

కొనుటకు, పొందుటకు ఏర్పడినవే. చిత్తవృత్తి నిరోధముతో మాతృతత్త్వము యొక్క చిత్‌శక్తి ప్రకాశితమై ఆవిర్భవిస్తుంది. దీనిలోనే సాధకులకు తమ స్వరూపము అవగాహన అగుటయే గాక అనేకానేక యోగవిభూతులు లభిస్తాయి. సాధకుల సాధన మరియు సిద్ధి యొక్క ఆధారభూమి ఇదే. ఇదే యోగుల యొక్క కుండలినీశక్తి. దీని యొక్క జాగరణతో యోగ సాధకులలో మహాశక్తి యొక్క అభివ్యక్తికి అనేక మార్గాలు తెరవబడతాయి. మాతృతత్త్వము యొక్క అనుగ్రహముతోనే యోగసాధకుడు సమర్థుడు అవుతాడు. అనేకానేక సిద్ధులు మరియు విభూతులు అతనికి హస్తగతమవుతాయి. అతనిలో కైవల్యప్రభ ప్రకాశిస్తుంది.

మాతృతత్త్వము యొక్క సంపూర్ణత యోగగమ్యము, జ్ఞానగమ్యము మరియు ధ్యానగమ్యము అయినప్పటికి దానియొక్క సామాన్య పరిచయము జీవికి పుట్టుకతోనే వస్తుంది. ప్రతిప్రాణి మాతృతత్త్వము యొక్క సజల భావానుభూతులలోనే జీవనము పొందుతుంది. అతని తల్లే అతనికి అన్నీ. అతని హృదయము నుండి వెలువడే మొదటి పిలుపే 'అమ్మ'. పెదవుల నుంచి వెలువడే మొదటి శబ్దమే 'అమ్మ'. అన్ని సంబంధాలు, అన్ని బంధుత్వాలు, అన్ని సంవేదనలు మాతృతత్త్వము చుట్టూరా తమ అస్తిత్వమును అల్లుకుంటాయి. అన్నింటికి కేంద్రము అమ్మయే. ఎవరు తల్లికి దగ్గరివారో వారితోనే ఘనిష్ఠతను అనుభూతి చెందుతారు. తల్లి యొక్క సంవేదన విస్తారములో జీవన సంవేదనలు విస్తారము పొందుతాయి. జన్మించిన కాలంలో ఈ ఒక్క జీవన సత్యమే తన సంపూర్ణ తీవ్రతలో పూర్తి అస్తిత్వము స్పందిస్తుంది. ప్రతి శిశువు యొక్క జీవితము మాతృమయము, అన్నీ అర్థము చేసుకోవటానికి మనము కష్టపడక్కర్లేదు. మాతృతత్త్వమే అతని కొరకు సుఖము, సురక్ష, ఆనందము మరియు ప్రేమ. ఇవన్నీ మాతృతత్త్వము యొక్క పర్యాయపదములు.

ఈ భావానుభూతులు స్థిరముగా ఉండవు. జీవన చేతనత్వము బహిర్ముఖమౌతున్నకొద్ది నెమ్మదినెమ్మదిగా ఇవి విలీనమైపోతాయి. అహంతా (నేను) సుదృఢము అవగానే తల్లి గర్భములో తన జీవితాన్ని గట్టిగా కట్టివేసి ఉన్న సంబంధ, సంవేదనలు బలహీనమైపోతాయి. నేను అనబడే అహంకారము జన్మ నిచ్చిన తల్లి నుంచి దూరము పెంచుతుంది. జీవాత్మ యొక్క అంశ తనని తాను పరమపూర్ణము అని దంభము పెంచుకుంటుంది. విస్మృతి యొక్క ఆ చేతనత్వము వల్ల జీవన చేతనత్వము పూర్తిగా చుట్టబడిపోతుంది. "విద్యాః సమస్తాస్తవ దేవి బేధాః స్త్రియాః సమస్తాః సకలాం జగత్సు" అనగా 'ఓ మాతా! ప్రపంచంలోని సమస్త విద్యలు మరియు ప్రపంచంలోని స్త్రీలందరు నీ స్వరూపములే' అనే సూత్రము మరచిపోతారు. మాతృతత్త్వమునకు దూరమైన జీవనము తెలియని చీకట్లలో దారితప్పి వెతుకులాడుతూ ఉంటుంది.

ఈ చీకటి నుంచి బయటపడటానికి ఒకే ఒక ఉపాయ మున్నది. అది మాతృతత్త్వము పట్ల అవిరళమైన అనురాగము. ఇదే మహాయోగసాధనకు ప్రారంభదశ. జీవితాన్ని పూర్ణత్వము వైపు ఇదే తీసుకువెళుతుంది. మరియు పరాకాష్ఠగా పూర్తి వరదానాన్నిస్తుంది. వైదికఋషుల నుండి శ్రీఅరవిందుల వరకూ ఈ మార్గాన్నే అనుసరించారు. ఈ మార్గమును అనుసరించే వారంతా పూర్ణత్వము యొక్క వరదానంతో లాభాన్వితు లయ్యారు. ఋగ్వేదములోని అనేక మంత్రాలతో పాటు అరవిందుల మంత్రకావ్యమైన 'సావిత్రి'లోని అనేకానేక పంక్తులు ఈ సమాధి సత్యం యొక్క సాక్షులు. శ్రీఅరవిందులు తమ మంత్రకావ్యమైన 'సావిత్రి' యొక్క మూడవ పర్వమును 'భగవతీ శ్రీమాతా పర్వము' అని పేర్కొన్నారు. దీనిలోని మాతృత్వము యొక్క అత్యంత గూఢమైన మరియు అనుభూతిపరమైన వివరణ ఉన్నది.

పరమపూజ్య గురుదేవులు అనేకచోట్ల ఇలా అన్నారు. "మాతృతత్త్వ సాధన మాత్రమే జీవితమును సంస్కారవంతము చేసి వికసింపచేస్తుంది" (పేజీ-5). దీనివల్లే జీవితము సమర్థ వంతము, శక్తివంతము అవుతుంది. దీనిగురించి చెప్తూ అప్పు డప్పుడు ఆయన కొన్ని ముఖ్యమైన విషయములను తెలిపారు. ఆయన ఇలా అన్నారు. 'కాలప్రవాహములో సామాన్యము మరియు అసామాన్య క్షణములు ప్రవాహితమవుతూ ఉంటాయి. సామాన్య క్షణాలలో మానవుడు మాతృతత్త్వాన్ని కోరుకుంటాడు. తల్లియొక్క పరమపూర్ణత అవగాహన చేసుకునేందుకు యోగసాధనలో నిమగ్నమౌతాడు. ధ్యానము మరియు జ్ఞానసాధనలు చేస్తూ ఆదిమాతను తన జీవితానికి పూర్ణత్వము యొక్క వరదాన మిమ్మని ప్రార్థన చేస్తాడు."

అసామాన్య క్షణాలలో తన గర్భము నుంచి జీవితమును - జగత్తును ప్రసవించే మాతృమూర్తే స్వయముగా యత్న

**ఇతరుల కష్టసుఖాలలో పాలుపంచుకోవాలి**

శీలము అవుతుంది. సృష్టిని సుసంస్కారితము చేయుటకు ఆమే స్వయముగా యుగశక్తి రూపంలో అవతరిస్తుంది. దారితప్పిన తన సంతానానికి దారి చూపుటకు వస్తుంది. ఆమె యొక్క దైవీ చేతనత్వము మానవ చేతనత్వము ద్వారా అభివ్యక్తము అవుతుంది. మహాదేవి స్వయముగా మానవ శరీరధారియై తన యొక్క అనేకమంది బిడ్డలను ప్రేమతో లాలిస్తుంది. ఆదిశక్తి యుగశక్తి రూపము ధరించి సన్మార్గాన్ని చూపిస్తుంది. జగన్మాతకు ఎవరి యొక్క ఆదేశములతోను పనిలేదు. తానే స్వయంగా జీవించి జీవిత తత్త్వమును, సత్యమును బోధిస్తుంది. తన పిల్లల చేయి పట్టుకుని జీవితమును, జీవించేకళను నేర్పుతుంది.

సృష్టియొక్క చరిత్రలో ఈ క్షణములు చాలా మహిమాన్విత మైనవి. అగణితమైన ఆర్తుల పిలుపుకు సమాధానముగా కరుణామయి మాత అవతరించుటకు సంకల్పిస్తుంది. ఆది జనని తన లీలాభూమిగా ఎన్నుకున్న ఆ దేశము, భూమి యొక్క ఆ ప్రాంతము ఎంతో ధన్యమైనవి. ఏదో రూపముగా ఆమె యొక్క స్వజనులు మరియు పరిజనులుగా దగ్గరైన వ్యక్తులు కూడా చాలా పుణ్యశీలురు. భక్తితో పెల్లుబుకుతున్న హృదయాలతో తమ శ్రద్ధాభక్తులను తల్లి చరణాల మీద పోసి మాతృతత్త్వము యొక్క అర్చన, వందన చేసే వ్యక్తులు వీరందరి కంటే చాలా ధన్యులు. వీరేకాక ఆ దివ్యజనని లీలాగాథలను స్మరణ, చింతన చేస్తూ అవగాహన చేసుకుంటూ, ఆమె యొక్క జ్యోతిర్మయి చేతనత్వముతో ఏకాత్మ సాధన చేసేవారు కూడా చాలా అదృష్టవంతులే.

సాధన యొక్క ఈ భావపూర్ణ స్వరములకు స్పందించుట కొరకేకదా భావమయి మాతాభగవతి అవతరించేది. అందులకే మాతృతత్త్వముయొక్క విశుద్ధ చేతన ఘనీభూతమై స్థూల రూపంలో ఆవిర్భవిస్తుంది. మానవుని జన్మజన్మాంతరాల ఆధ్యాత్మిక కోరికలకు జవాబు ఇవ్వటానికే మాతృతత్త్వము యొక్క దివ్యజ్యోతి జన్మిస్తుంది. దానియొక్క కాంతితో లోకముల యొక్క బాహ్య ఆవరణయే కాక ప్రాణుల యొక్క అంతః కరణము కూడా ప్రకాశవంతమవుతంది.

యుగశక్తి యొక్క అవతరణ వల్ల వాతావరణములో అలౌకిక సుగంధము వ్యాపిస్తుంది. జాగృతాత్మలు తమ అంతః కరణాలలో అత్యంత అద్భుత స్పందనలను అనుభవిస్తాయి. ఆదిశక్తి దివ్యజ్యోతి జన్మమహోత్సవము చేసుకొనుటకు ఋషులు, దేవతలు, సిద్ధగణాలు సక్రియులౌతారు. సృష్టి యొక్క సమస్త దివ్యశక్తులలో ఒక విలక్షణ చేతనత్వము వ్యాప్తి చెందుతుంది. ఆదిశక్తియైన మాతాజీ యొక్క అవతరణ కాలములో ఈవిధమైన పరిస్థితులు ఏర్పడినవి.

*– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ*

## మనిషి అంటే మూడు లక్షణాలుండాలి

*ఒక ఫకీరు ప్రతిరోజు పగటి పూట రెండు చేతుల్లో రెండు వెలుగుతున్న దివ్వెలను పట్టుకొని బజార్ల వెంట తిరుగుతూ ప్రతి దుకాణం ఎదుట కొంతసేపు నిలబడి ముందుకు సాగిపోయేవాడు. ఇది చూసి ఒక వ్యక్తి "బాబా నీవు పగటిపూట దివ్వెలను చేతబట్టి ఏమి వెతుకుతున్నావు. నీకు ఏమి కావాలి?" అని ప్రశ్నించాడు. దానికి ఫకీరు "నేను మానవులను వెదుకుతున్నానయ్యా! ఇంతపెద్ద సమూహాలలో ఎంతగా గాలించినా ఒక్క మానవుడు కూడా లభించటం లేదని" బదులు పలికాడు. ఆ వ్యక్తి ఆశ్చర్యంతో "నీకు మనుష్యులంటే తెలియటం లేదా, ఈ చుట్టూ ఉన్నవారు మనుషులు కాకపోతే ఎవరు? అని కుతూహలంతో అడిగాడు. దానికి ఫకీరు కన్నులు మూసికొని "మనిషి అంటే-1 ఇంద్రియాలకు దాసుడు కాక, ఇంద్రియాలకు అధిపతియై, వాటిని శాసించగల శాసనకర్త 2) క్రోధాగ్నిలో పడి తాను మండుతూ ఆ అగ్ని కణాలతో ఇతరులను నశింపచేసే ప్రయత్నం ఏనాడు చేయనివాడు 3) కామ వాసనలు లేనివాడు. ఈ మూడు లక్షణాలు లేని శరీరధారులందరు మృగములు, నరపశువులు" అంటూ ఫకీరు మానవుని పరిభాషను ఆ వ్యక్తి ద్వారా సమాజానికి తెలియజేశాడు. ఈ జనారణ్యంలో ఈనాడు పై లక్షణాలు గల మానవుల ఆవశ్యకత ఎంతగానో ఉన్నది. పశుస్థాయి నుండి నరుల స్థాయికి చేరటానికి పై మూడు లక్షణాలను అలవరచుకొనే సాధన చేయగల సాధకులుగా ప్రతి ఒక్కరు తయారుకావాలి.*


– ప్రజ్ఞాపురాణం నుండి

## పిరికితనం చాలాప్రమాదకరమైనది

### పూజ్య గురుదేవుల అమృతవాణి

# యజ్ఞం యొక్క తాత్త్విక దర్శనం

*అనేకానేకమైన రహస్య విషయములను అత్యంత సరళముగా, సహజముగా సామాన్యజనుల ముందు ప్రస్తుతీకరించడము పరమపూజ్య గురుదేవుల యొక్క అమృతవాణిలోని ప్రత్యేకత. యజ్ఞములోని తత్త్వదర్శనమును తెలియజేస్తూ 'ఆత్మను సంస్కరించుకొనుట, ప్రజాహితము కోసమే జీవించుట-అనేదే యజ్ఞీయ జీవనమునకు అర్థము.' సమాజము నుండి స్వల్పముగా స్వీకరిస్తూ, అధికముగా తిరిగి ఇవ్వడమనే భావనను ఎవరైతే జీవితములో జోడించుకుంటారో వారిదే యజ్ఞమయ జీవితము అనబడుతుంది. యజ్ఞము అంటేనే త్యాగము, బలిదానము. ఈ మార్గమును అనుసరించి జీవించేవారు యజ్ఞీయ జీవనమునకు ప్రతీకలుగా చెప్పబడతారు. మనకు జీవితమును ప్రసాదించిన అమ్మ మొదలుకొని మన శరీరములోని జీవన ప్రక్రియలన్నింటినీ సంతులనం గావించే జీర్ణాశయం వరకు... అన్నీ యజ్ఞమును దర్శింపజేసే జీవంతమైన ఉదాహరణలే! అని అన్నారు. రండి! గురువర్యుల అమృతవాణిని మరింత హృదయంగమం చేసుకుందాం!*



### యజ్ఞము ఒక తత్త్వము, ఒక దర్శనము

ఆఫ్రికాదేశములో ఈనాడు మన యజ్ఞము రెండవరోజు సుసంపన్నమైనది. ప్రస్తుతము నా చేతిలో ఉన్న లౌడ్‌స్పీకర్ ద్వారా నేను మాట్లాడుతున్న మాటలను ఎంతో దూరం వరకు కూర్చున్న మీరందరు వినగలుగుతున్నారు. ఇది లేకపోతే మీకు నా మాటలు వినపడక, విసుగు పుట్టి ఇళ్ళకు వెళ్ళిపోవాలనుకునేవారు. కాబట్టి ఈ లౌడ్‌స్పీకర్ అనే యంత్రమును తయారుచేసినవారికి మనము ఎంతో ఋణపడి ఉన్నాము. ఇదొక్కటే కాదు. కళ్ళజోడు, కలము, వార్తాపత్రిక.... మనము ఉపయోగించుకునే ప్రతి ఒక్క వస్తువును ఎవరో ఒకరు తయారుచేశారు. అలాంటి వారందరికీ మనమందరము ఋణపడినవాళ్ళమే. ఆ ఋణం తీర్చుకొనటానికి మనము కూడా సమాజమునకు ఏదో విధముగా పనిచెయ్యాలి.

'యజ్ఞము' అనేది ఒక ఫిలాసఫీ. యజ్ఞము అనేది ఒక కర్మకాండ. కర్మకాండ అంటే ఇక్కడ అర్థం-మన వద్దనున్న వస్తువులు లేదా పదార్థములు లేదా ధనం అన్నింటినీ మనము మాత్రమే ఉపయోగించుకోకుండా ఇతరులకు కూడా పంచి పెట్టడం.

### ఒంటరిగా తినటం మంచిది కాదు

ఒక్కడే సంపాదించుకుని, తానొక్కడే భుజించేవాడు 'దొంగ' అని భగవద్గీతలో నిర్వచించబడినది. 'తైర్దత్తాన ప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః' అనగా తాను సంపాదించినదంతా తానే భుజించేవాడు పాపమును భుజించినట్లే!' అని అర్థం.

పిల్లలు ఇంట్లో ఉన్న నెయ్యితో మిఠాయిలు చేసిపెట్టమనీ, అన్నంలో వేయమనీ అడుగుతారు. కానీ పెద్దవాళ్ళు అదే నెయ్యిలో కొంత భాగం యజ్ఞం చెయ్యటానికి వాడుకుందామని నిర్ణయిస్తారు. ఇద్దరి ఆలోచనలు సరియైనవే. పిల్లలకు ఇంకా పూర్తిగా తెలియని వయస్సు కాబట్టి వారికి సమాజము పట్ల మనకున్న బాధ్యతను చక్కగా అర్థమయ్యేలా పెద్దలు చెప్పవలసి ఉన్నది. 'భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్' అని గీతావాక్యం. అంటే **ఇతరులకు పెట్టకుండా తాను మాత్రమే భుజించేవాడు దొంగతో సమానము** అని అర్థం. ఈ ప్రపంచమంతా మన కుటుంబమే. మనకున్న దానిని అందరికీ పంచిపెట్టాలి. మనము హోమములో వేసిన నెయ్యి కాలిపోలేదు. ఏ పదార్థము నశించదు. రూపమును మార్చుకుంటుందే తప్ప పదార్థము నశించదు, ఎక్కడికీ పోదు అన్నది విజ్ఞానశాస్త్రం యొక్క సిద్ధాంతం. ఘన- ద్రవ-వాయు రూపములలోకి పదార్థములు రూపాంతరము చెందుతాయి.

**పిరికితనం ఎదుగుదలను ఆపేస్తుంది**

కాబట్టి మనము హోమములో సమర్పించిన నెయ్యి వాయువుగా మారి భూమండలమంతా వాయు రూపములో వ్యాపిస్తుంది.

## సమాజమును చక్కగా వ్యవస్థీకరించేది యజ్ఞము

హోమములో సమర్పించబడ్డ నెయ్యి గాలిలో వ్యాపించి కోట్లాదిమంది మనుషులలో ప్రతివారినీ చేరుకుంటుంది. ఇందులో ఒక సిద్ధాంతముంది. మనము ఈరోజు కొంత సంపాదించుకుంటున్నాము అంటే అందులో సంఘములోని ప్రతి ఒక్కరి పాత్ర ఉంటుంది. కాబట్టి మనము వారందరికీ ఋణపడి ఉంటాము. అందుచేత తిరిగి వారి ఋణమును తీర్చుకొనవలసిన బాధ్యత మనపై ఉన్నది. సమాజమును చక్కగా వ్యవస్థీకరించటమనే పద్ధతిని యజ్ఞం మనకు నేర్పుతుంది. మనిషి మనుగడ సాగించాలంటే సాటిమనిషి నుండి తప్పక సాయం తీసుకోవలసి వస్తుంది. కానీ తిరిగి సాయం చెయ్యటము మర్చిపోకూడదు. ఏదైనా తీసుకుని మన దగ్గరే ఉంచుకుంటే కష్టములు తప్పవు. దీనికొక చిన్న ఉదాహరణ చెప్తాము. మనము గాలి పీలుస్తాము, తిరిగి వదులుతాము. వదిలిపెట్టకుండా లోపలే ఉంచుకుంటే ఏమవుతుంది? శ్వాస నిలిచిపోయి మరణం సంభవిస్తుంది. అవునా? అలాగే ఆహారమును తీసుకుంటాము. అది జీర్ణమైన పిదప వ్యర్థాలను విసర్జిస్తాం. విసర్జించకుండా లోపలే ఉంచేసుకుంటే పొట్ట ఉబ్బి కడుపునొప్పి వచ్చి పరిస్థితి తల్లక్రిందులవుతుంది. గతిచక్రములను ఆపకండి. వాటిని కదులుతూనే ఉండనివ్వండి. 'మా సంపాదన మీద ఎవ్వరికీ హక్కు లేదు. ఇందులోనుండి ఎవ్వరికీ ఇసుమంతైనా ఇవ్వము. అంతా మేమే అనుభవిస్తాము' అని మీరు భావించినట్లైతే మీరు మనిషిగా కర్తవ్యమును నిర్వహించనట్లే. యజ్ఞము ద్వారా మనము పొందవలసిన శిక్షణ ఇదే.

## యజ్ఞము విశ్వశాంతికి మాధ్యమము అవుతుంది

ప్రస్తుత కాలములో మానవుల హృదయములలోను, భావనలలోను దైవత్వము తొలగిపోతున్నది. దానిని పునః ప్రతిష్ఠించవలసి ఉన్నది. యజ్ఞం ద్వారా మనకు ఇవ్వబడు తున్న శిక్షణ ఇదే. యజ్ఞమును మాధ్యమముగా తీసుకొని విశ్వమంతటా శాంతిని స్థాపింపజేయటానికి లక్షలాదిమంది వ్యక్తులు రాత్రిపగలు శ్రమిస్తున్నారు.

యజ్ఞ ప్రభావం వలన శరీరము ఆరోగ్యవంతమవుతుంది. ఎల్లోపతి, నేచురోపతి, క్రోమోపతి వంటి అనేకానేక వైద్య విధానముల కన్నా 'యజ్ఞోపతి' అనబడే ఈ యజ్ఞ విధానము అత్యంత ప్రభావవంతమైనదిగా గుర్తించబడింది. యజ్ఞధూమం గాలిలో కలసి మనిషి లోపలికి వెళ్ళి వేలాదిమంది వ్యక్తులకు బయటకు ఏమాత్రము తెలియనటువంటి చికిత్స చేస్తుంది.

## అన్నింటికన్నా శ్రేష్ఠమైనది యజ్ఞీయ చికిత్స

యజ్ఞోపతి ద్వారా మనము వనమూలికలతో తయారు చెయ్యబడిన ఇంజక్షన్‌ను చేస్తున్నాము. నిద్రపోతున్న వ్యక్తికైనా సరే ఈ హోమధూమమును ముక్కు ద్వారా లోపలికి పంపించి నట్లైతే ఎంత తీవ్రమైన జ్వరమున్నా క్షణములలో తగ్గిపోతుంది. ఇంత గొప్ప ఇంజక్షన్‌ను ఏ ఆసుపత్రివాళ్ళు తయారుచెయ్య గలరు? క్రిమికీటకాలు, జంతువులు, పశుపక్ష్యాదులు మొదలు కొని మానవుల వరకు సకల జీవరాశులకు అత్యుత్తమ ఔషధముగా పనిచేస్తుంది ఈ హోమధూమము. ఇందుకోసము మనకు ఖర్చయ్యేది చాలా స్వల్పము. పైగా ఇందులో మనము నష్టపోయేదేముంది? ఇందులో తప్పు విషయమేమైనా ఉన్నదా? మనిషిని దేవతగా మార్చగలిగే మా తత్త్వదర్శనము, విజ్ఞానము ఇదే.

మనలో చాలామందికి బయటకు కనిపించని మానసిక రోగములు ఎన్నో ఉంటాయి. భార్య పొరపాటున కూరలో ఉప్పు తక్కువ వేసింది. అంతే పట్టరాని కోపముతో భర్త అన్నం ఉన్న పళ్ళెముతో భార్య నెత్తిన మోదాడు. తలమీద తీవ్రమైన గాయమైంది. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించవలసి వచ్చింది. పిల్లలు గోడుగోడున ఏడుస్తుంటారు. భార్య పుట్టింటి వారికి సమాచారము తెలిసి 'మా పిల్లను చంపటానికే నీకిచ్చి పెండ్లిచేశామా?' అంటూ ఈసారి ఇలా జరిగితే మా అమ్మాయిని మేము మా ఇంటికి తీసుకుపోతాం. నీ బాధలు నువ్వు పడు' అని హెచ్చరికలు జారీచేస్తారు. గొడవలు, కొట్లాటలు, మాటకు మాట, తగాదాలు... చిన్న చిన్న విషయములకు కోపం తెచ్చుకొని మనిషి నానాటికీ పిచ్చివాడైపోతున్నాడు. మానసిక వ్యథకు గురవుతున్నాడు. ఈరకమైన వ్యథకు మందులు ఎక్కడున్నాయి? మనకు ముక్కు మీదనే కోపం ఉంటుంది. దానికితోడు ఎవరైనా ఏదైనా చెప్తే అగ్గిమీద గుగ్గిలమైపోతాము. పిల్లవాడు పరీక్షలో తప్పాడు. ఇంట్లోవాళ్ళు కోపంతో ఏమంటారో అన్నభయంతో పిల్లవాడు రైలు క్రింద తలపెట్టి చావును కొని

**ఎల్లప్పుడు ధైర్యంగా ఉండాలి**

తెచ్చుకుంటాడు. అంతేకాదు కన్నవారికి శోకం మిగులుస్తాడు. ఇవన్నీ మానసిక అసంతులనం వల్ల జరుగుతున్నాయి. శారీరిక వ్యాధులకు మందులున్నాయి. మరి మానసికవ్యాధులకు?

మనము చేసే యజ్ఞము ద్వారా హోమకుండములో మానసిక వ్యాధులకు మందు తయారవుతుంది. యజ్ఞకుండంలో నుండి వెలువడే వాయువును ఒకసారి పీల్చి చూడండి. ఎంత ఆహ్లాదముగా ఉంటుందో. మీకు క్రోధం వచ్చినా, మనస్సు అశాంతిగా ఉన్నా, ఉద్విగ్నత చోటుచేసుకున్నా, మనస్సు చింతా క్రాంతమైనా... ఎలాంటి ఇబ్బందిగాని, అసౌకర్యంగాని ఉంటే హోమధూమమును లోపలికి పీల్చుకుంటే చాలు సమస్యల నుండి త్వరితమే నివారణ లభిస్తుంది. మీరు ఇంట్లోనే చిన్న అతిచిన్నదైన హోమకుండమును పెట్టుకోండి. గాయత్రీ మంత్రముతో 5 ఆహుతులు అందులో వెయ్యండి చాలు. మీరూ, మీ చుట్టూ ఉన్నవారు కూడా సుఖశాంతులను పొంద గలుగుతారు.

## యజ్ఞము యొక్క అద్భుతమైన శక్తి

గాయత్రీమంత్రమునకు శక్తి ఉన్నది. యజ్ఞమునకు శక్తి ఉన్నది. మంత్రశక్తి ఒక యంత్రము వంటిది. గాయత్రీ మంత్రము అనే ఈ యంత్రము చలించేటప్పుడు ఎలాంటి ప్రకంపనలు ఉత్పన్నమవుతున్నాయో, తద్వారా ఎంత శక్తి ఉత్పన్నమవుతుందో బహుశః ప్రజలకు ఈరోజు తెలియక పోవచ్చు. కానీ మానవశరీరము లోపల ఉండే యంత్రము ఒక స్వయంచాలిత భట్టి వంటిది. అందులో ఉత్పన్నమయ్యే శక్తి ఎంతో ప్రభావవంతమైనది. ఆ శక్తిని ఉపశమింపజెయ్య గల్గినది ఒక్క మంత్రవిద్య మాత్రమే అన్న విషయమును భవిష్యత్తులో విజ్ఞానశాస్త్రము అంగీకరిస్తుంది. ఈ మంత్రవిద్యకు తగిన సామర్థ్యమును చేకూర్చి శక్తివంతం గావించగల్గేది 'యజ్ఞము' అనే డైనమో మాత్రమే. స్వయముగా మంత్రములు శక్తివంతమైనవే! మనము చిన్నగా మాట్లాడిన మాటలు లౌడ్‌స్పీకర్ అనే యంత్ర సహాయముతో బిగ్గరగా వినిపింపజేసినట్లైతే వేదమంత్రముల యొక్క శక్తి 'హవనకుండం' అనబడే డైనమో, బ్యాటరీల సహాయముతో కొన్ని రెట్లు అధికమవుతుంది. ఈ శక్తి అత్యంత సూక్ష్మరూపముతో గాలిలో వ్యాప్తిచెంది, ఆకాశమంతటా నిండుతుంది. యజ్ఞమునకు అంతటి శక్తి ఉన్నది.

**'సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః'** (3/10) అని గీతావాక్యం. అనగా ప్రజాపతి యజ్ఞముతోపాటు మానవులను సృష్టించాడు అని అర్థము. మీరు ఒంటరిగా పుట్టలేదు. యజ్ఞముతోపాటే మీరు జన్మించారు. ఎలా? ఎముకలు, రక్తము, మాంసము, ధాతువులు... అన్నింటినీ ఆ చిన్న బిందువు మీద చేరుస్తూ 9 నెలల పాటు తనలోని శక్తిని కరిగించి ఆ చిన్న బిందువును పెంచి పోషిస్తుంది. పాపము ఆ తల్లికి ఎంతో నొప్పి కలుగుతుంది. కష్టం కలుగుతుంది. ప్రసవవేదనతో కేకలు వేస్తుంది. అయినా తన రక్తమాంసములను ధారపోసి ఆ శిశువును భూమిమీదకు తీసుకొస్తుంది. ఇదంతా తల్లి త్యాగముతో చేసే యజ్ఞమే కదా!

మనలో ఎవరికైనా, ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ఒక 50 గ్రాముల రక్తము ఎక్కించవలసివస్తే ఎవరో మనకు రక్తదానం చేస్తారు. మనము వారికి తగ్గ ధనమును చెల్లించటమే కాదు, వారికి ఎంతో ఋణపడి ఉంటాము. మరి అలాంటిది తల్లి తన శరీరములో నుండి 9 నెలలపాటు చివరి చుక్క వరకూ మొత్తం రక్తమును, మాంసమును, ఎముకలనన్నింటినీ మనకందిస్తుంది. ఇది త్యాగం కాదా? దీన్ని యజ్ఞం అనరా?

## యజ్ఞము అంటేనే త్యాగము-బలిదానము

త్యాగము, సేవ, బలిదానముల కోసమే యజ్ఞము జరుప బడుతుంది. తల్లియొక్క త్యాగము, బలిదానముల వలన 'మానవజన్మ' ఉత్పన్నమవుతుంది. అరుణవర్ణ రక్తమును తెల్లని పాలగా మార్చి 9 నుండి 10 నెలలపాటు కోపంతో, విసుగుతో లేకుండా ప్రేమతో బిడ్డను హృదయమునకు హత్తుకుని, ఆ పాలను త్రాగించి పోషిస్తుంది తల్లి. తన స్తన్యమును ఇవ్వటం వల్ల ఆ తల్లి ముఖములోని యౌవనకాంతి తరిగిపోతుంది. చర్మము వదులై సాగిపోవటంతోపాటు వన్నె తగ్గుతుంది. కళ్ళు లోపలికి పీక్కుపోతాయి. ఇంత జరిగినా సరే త్యాగమూర్తియైన తల్లి తన బిడ్డకు అమృతం వంటి తన పాలనిచ్చి పోషిస్తుంది. ఈరోజు మీరు ఎమ్మేలో ఉత్తీర్ణులై, గొప్ప ఉద్యోగస్థులై ఘనంగా జీవిస్తున్నారంటే అది కేవలము తల్లి ప్రేమ వల్లనే. పసిబిడ్డగా ఉన్నప్పుడు బట్టలు తడిపితే తల్లి అలాగే ఆ తడిలోనే పడుకునేది. నిన్నుమాత్రం వెచ్చని బట్టలతో చుట్టి నిద్రపుచ్చేది. మాటి మాటికి బట్టలు పాడుచేస్తే ఏమాత్రము విసుగులేకుండా ఆ బట్టలను శుభ్రం చేసేది. పెరిగి పెద్దైన తరువాత కూడా

**సహకారంతోనే సామాజిక ప్రయోజనం సాధ్యమవుతుంది**

మీరు ఎంతగా విసిగించినా, తనుమటుకు మిమ్మల్ని సర్వదా ప్రేమిస్తూనే ఉండేది. తల్లి ప్రేమ లేకుండా పక్షి గ్రుడ్డు మనగలుగుతుంది. కానీ మానవుడు అమ్మ లేకుండా జీవించలేడు. తల్లి పొట్టలో నుండి బయటకు వచ్చిన కోడిగ్రుడ్డు జీవించే ఉంటుంది. కానీ మానవ శిశువు తల్లి సంరక్షణ లేకుండా జీవించడము అసాధ్యము. కాబట్టి మనము త్యాగమనబడే యజ్ఞము ద్వారా జన్మించాము. కనుక ఆ త్యాగమునకు తిరిగి ఋణం తీర్చుకొనుట మానవధర్మము.

### జీవితమునకు ఆధారము యజ్ఞమే

మానవ శరీరము యజ్ఞము ఆధారముగా జీవించి ఉంటుంది. ఎలా? చేతులు డబ్బును సంపాదిస్తాయి. ఆ డబ్బుతో అన్నం, పప్పు, కూరలు, అన్నింటినీ కొనగలము లేదా తయారుచేసుకొనగలము. కానీ చేతులు తినలేవుగా? ఆ ఆహారమును నోరు తింటుంది? నోరు ఆహారమును నమిలి నమిలి, లాలాజలముతో కలిపి పొట్ట లోపలికి తోస్తుంది, పొట్ట తనలోని ఆహారమును జీర్ణము చేసి రక్తముగా మార్చి శరీరభాగములకు పంపించి శరీరమునకు కావలసిన శక్తిని ఉత్పన్నము చేస్తుంది.

శరీరమనే యంత్రము ద్వారా మనము జన్మించాము. మనల్ని మనం సమాజమనే యంత్రం యొక్క భాగముగా భావించకపోతే ఈ గడియారము క్షణము కూడా పనిచెయ్యదు. ఈ యంత్రము తక్షణమే విఫలమవుతుంది. *(సశేషం)*

*– అఖండజ్యోతి, ఆగస్టు 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## తుగ్లక్

*ఢిల్లీ బాదుషా తుగ్లక్ విద్వాంసుడు, ఉదారుడు కూడా. ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహించాడు. కానీ రెండు దుర్గుణాలు అతడిని అప్రతిష్ఠ పాలు చేసి సర్వనాశనం చేశాయి. ఒకటి అహంకారం. తన ఆలోచన ఏదో తనదేగాని ఇతరుల ఆలోచన ఎంత గొప్పదైనా స్వీకరించేవాడు కాదు. రెండవ దుర్గుణం తొందరపాటు. ఇది చాలా ముప్పు తెచ్చిపెట్టేది. ఈ రెండింటి వల్లనే క్రొత్తరాజధాని దౌలతాబాద్‌ను నిర్మించి ఇబ్బందులు ఎదురవ్వగానే రద్దుచేసి వేశాడు. ఇలాగే ఒకసారి ముద్రలేని రాగి నాణాలు చెలామణి చేసి ప్రజలు నకిలీ ముద్రణ ప్రారంభించగానే ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినటంతో వాటిని ఖజానాలో జమచేసి వెండినాణాలుగా మార్పిడి చేయిస్తాడు. దీనివల్ల ఖజానా అంతా ఖాళీ అవ్వగా పన్నును నాలుగు రెట్లు పెంచటంతో ప్రజలు అతని రాజ్యాన్ని వదలి పారిపోతారు. విద్య, ఔదార్యం కొనియాడ దగినవే అయినా అహంకారం, తొందరపాటు ఎంత హానికరమైనవో ప్రజలు తుగ్లక్ క్రియాకలాపాల ద్వారా ప్రత్యక్షంగా అనుభవించారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## ముచకుందుడు

*దేవతలు, అసురల మధ్య ఘోర యుద్ధం జరగగా భోగులు, విలాసపరులు అయిన దేవతలు ఓడిపోయి పలాయనం చిత్తగించవలసి వచ్చింది. వారు ప్రజాపతి వద్దకు వెళ్ళి మొరపెట్టుకోగా సంయమనం లోపించటం వలన ఈ ఓటమి సంభవించిందని తెలిపి మానవుల మధ్య ఉన్న ముచకుందుని సేనాధిపతిగా తెచ్చుకోగలిగితే విజయం లభిస్తుందని ప్రజాపతి సలహా ఇస్తాడు. దేవతలు ప్రజాపతి సలహా పాటించి విజయాన్ని పొంది తమ విజయానికి కారకుడైన ముచకుందుడిని సగౌరవంగా స్వర్గానికి తోడ్కొని వస్తారు. ముచకుందుడు తన పరాక్రమానికి విఱ్ఱవీగుతూ దేవతల పట్ల అహంకారంతో ప్రవర్తించసాగాడు. ఇది తెలిసి వెంటనే దైత్యులు మళ్ళీ తిరగబడగా, ఈసారి ముచకుందుడు అహంకారం వల్ల తన పరాక్రమాన్ని, శ్రేష్ఠతను సమయానికి ప్రదర్శించలేక ఓడిపోతాడు. అప్పుడు కార్తికేయుడ్ని ఆహ్వానించి అసుర నాశనం గావించవలసి వచ్చింది. ప్రజాపతి ముచకుందుడిని పిలిచి, తిరిగి భూమి మీదకు పంపిస్తూ తపస్సు చేసి తిరిగి ఎప్పటిలా పూర్వ వైభవాన్ని పొందమని ఆజ్ఞాపిస్తాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**పెద్దలకు గౌరవం ఇవ్వాలి**

# విప్లవ శకం ఇక ఆగదు

***మునుపెన్నడు చవిచూడని క్రాంతివైపు మనదేశం పయనిస్తోంది. ప్రపంచంలోనే ఒక పెద్ద ప్రజాస్వామ్యంలోనే చాలా పెద్ద మార్పు వచ్చింది. నవంబరు 2016 తరువాత చాలా క్షేత్రాలలో విస్తారమైన మార్పు కనిపించింది. దీనిని పూజ్య గురుదేవులు మహాక్రాంతి అన్నారు. దీనికి ఎవరు నిమిత్తమాత్రులైనా, ఇక దీనిని ఆపడం ఎవరి తరము కాదు. 125 కోట్ల జనాభా గల ఈ దేశం నిద్రిస్తున్న రాక్షసుడు (శ్రీ అరవిందో). నిద్ర మేల్కోగానే ఒక మహాశక్తిగా మారుతూ కనిపిస్తుంది. గత రెండు సంచికలలో (జనవరి, ఫిబ్రవరి 2017) దీని గురించిన ఎన్నో కోణాల మీద దృష్టి సారించాము. సాధారణ పౌరుడి దైనందిన జీవితానికి సంబంధించిన ముఖ్యమైన అంశం కాబట్టి మన ఈ ఆధ్యాత్మిక పత్రిక ఈ మార్పుల గురించి పట్టించుకోకుండా ఉండలేదు. రాబోయే పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే మార్పులో భాగం అవడం సరైన పని. ఈ విషయాల గురించి మరింతగా ఈ సంచికలో తెలుసుకుందాం. రాజకీయ దృష్టితో కాకుండా నైతిక, బౌద్ధిక, సామాజిక, సాంస్కృతిక పునరుత్థానానికి చేసే ఈ మహాయాత్రలో సింహావలోకనం చేసుకుంటున్నాం. అప్పుడైనా మనిషికి ఒక దారి కనిపిస్తుందేమో!***



ఆర్థిక క్రాంతి (నోట్లరద్దు) వల్ల వచ్చిన మార్పు కళ్ళముందు ఉంది. నోట్ల రద్దు అవగానే ఉగ్రవాదానికి ఊపిరి బిగబట్టినట్లైంది. కాశ్మీరులో ఉగ్రవాదులకు డబ్బే ఆహారం. ఇప్పుడది దొరకట్లేదు. స్కూళ్ళను తగలబెట్టారు. సైనికుల మీద రాళ్ళు విసిరారు. ప్రతిరోజు సరిహద్దు అవల నుండి దాడులు జరిగేవి. అవన్నీ ఆగిపోయాయి. అనవసర ఖర్చులన్నీ తగ్గిపోయాయి. దేశంలో పేరుకు పోయిన నల్లధనం, ప్రచలనలో (circulation) ఉన్న నకిలీ ధనం ఎంతుందో అన్న లెక్కలు చూస్తే నాశనం అవుతున్న దేశానికి ఆక్సిజన్ అందినట్టు అనిపిస్తుంది. నాలుగు లక్షల కోట్లకన్నా ఎక్కువ ధనం పెద్ద నోట్ల రూపంలో ఉంది. అదంతా పెద్ద నగరాల్లో బినామీ పేర్లమీద కట్టిన పెద్ద పెద్ద భవంతుల్లో ఉంది. రాబోయేది మంచి కాలం, ఆ భవనాలు నల్లధనానికి నిల్వలుగా కాక సత్పాత్రులకు ఉపయోగపడతాయి అని అనిపిస్తోంది.

అనర్థమైన డబ్బు మీద అదుపు లేకపోతే వాటితో నేరాలు, నకిలీ హంగులు, విదేశీ కార్లు, లేనిపోని ఆర్భాటాలు మరియు దురాచారాలకు ఉపయోగపడుతుంది. దేశంలోని చిట్టచివరి పౌరుడి వరకు సద్వినియోగపడేందుకు తగినంత వరకు మాత్రమే డబ్బు అవసరం. అంతకుమించిన డబ్బు దేశాన్ని పురుగులా పట్టిపీడిస్తుంది. ధర్మప్రధానమైన డబ్బు మాత్రమే కళ్యాణకరమైనది, మోక్షదాయకమైనది. ఇప్పుడది అందరికీ అర్థం అవుతోంది. కంటి ముందు మబ్బులు తొలగిపోతే రాజకీయాల్లో అవినీతి, ఓట్లకి వాడిన నోట్ల భస్మాసుర రూపం కనిపిస్తుంది. ఈ ఆర్థిక క్రాంతి ఎంత అవసరమో ప్రజలు తమంతట తామే తెలుసుకుంటారు. రహస్యంగా ఉంచవలసిన అవసరం వచ్చింది కాబట్టి సామాన్యులతో సహా అందరు ఇబ్బంది పడ్డారు. కానీ ఇప్పుడు పరిస్థితి కుదుటపడింది. బ్యాంకుల నుండి, పోస్టాఫీసుల నుండి మీ ధనాన్ని సునాయాసంగానే తీసుకోవచ్చు. బ్యాంకుల సకారాత్మక, నకారాత్మక స్వరూపాలు చూడవచ్చాయి. త్వరలో అన్నీ సర్దుకుంటాయి.

ఇప్పుడు ప్రతి పౌరుడు కంప్యూటర్ దృష్టిలో ఉన్నాడు. ప్రతి ఒక్కరి ఆర్థిక లావాదేవీలు స్పష్టంగా తెలుస్తున్నాయి. డబ్బున్నా పనికిరాకుండాపోయినవారు హిరణ్యాక్ష, హిరణ్య కశ్యపులలాగా అరిచి మొత్తుకుంటున్నారు. ప్రసవం అప్పుడు నొప్పులు ఉంటాయి. కాని బిడ్డ పుట్టగానే ఆ బాలింతరాలు నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంటుంది. ఇప్పుడు మన పరిస్థితి అదే. ఆర్థిక సమానత్వం ఉన్న కొత్త దేశం పుట్టబోతోంది. దీన్ని కమ్యూనిజం అనుకోకూడదు. సామాజిక, బౌద్ధిక, నైతిక క్రాంతిగా ఈ సత్పరిణామాన్ని చూడాలి.

**జన్మలన్నింటిలోకి మానవజన్మ దుర్లభం**

## సామాజిక పక్షం

1. కట్నాలు, లాంఛనాలు, ఆడంబరాలతో జరిగే పెళ్ళిళ్ళు ఇక ఆగాలి. ప్రజలు పారదర్శకతను కోరుకుంటున్నారు. వీటికే కోట్లలో డబ్బు ఖర్చు అవుతోంది. నల్లడబ్బుతోనేగా హంగు, ఆర్భాటాలు చేయగలిగేది. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఇది ఆగాలి. కుక్కతోక ఎప్పటికైనా వంకరగానే ఉంటుంది. దాన్ని తిన్నగా చేయాలంటే సర్జరీ చేయాల్సిందే. ఎన్నో ఏళ్ళ అలవాట్లు ఇవి. మార్పు వచ్చి తీరుతుంది. ఎవరూ దీన్ని అడ్డుకోలేరు. ఇకపై అన్నీ ఆదర్శ వివాహాలే జరుగుతాయి. ఖరీదైన పెళ్ళిపత్రికలు, రిసెప్షన్లు, నాట్యాలు, ఫ్యాషన్లు, ఫార్మ్‌హౌజ్‌లు, ఫంక్షన్‌హాళ్ళు వంటివాటి దురుపయోగం జరగదు. గత యాభై ఏళ్ళలో మన సంస్థ లక్షన్నరకు పైగా ఆదర్శ వివాహాలు నామమాత్రపు ఖర్చుతో చేసింది. ఇప్పుడు ఇవి పెరుగుతాయి. మిగిలిన ధనం దేశంలో సామాజిక వికాసానికి ఉపయోగపడుతుంది. పెళ్ళిళ్ళల్లో, పార్టీలలో మద్యపానం, విందులు, వినోదాలు అనేవి చరిత్రగా మిగిలిపోతాయి. చదువుకున్న యువత ఆదర్శవివాహాలకే ఓటు వేస్తుంది. దీనికోసం గాయత్రీ పరివార్ సంఘర్షాత్మక, ప్రచారాత్మక ఆందోళన చేపడు తుంది. ఇప్పుడిది ఇంకా సులువు.

2. మద్యం, మత్తుపదార్థాలపై పెద్ద వేటు పడుతుంది. విచక్షణ పెరుగుతుంది, వీటి దురుపయోగం తగ్గుతుంది. మనిషి దుర్బల మనస్సు పారిపోవడం కోసం వెతుక్కునే దారి ఈ మద్యం. దీనివల్ల ఎన్ని దుర్ఘటనలు జరుగుతాయో అందరికీ తెలుసు. మత్తులో మనిషి తప్పుదోవపడతాడు. స్పృహ లేకుండా, జంతువులాగా ప్రవర్తిస్తాడు. వీటివల్ల వారి కుటుంబాలు నాశనం అవడంతోపాటు ఎందరో అమాయకపు ఆడపిల్లల జీవితాలు కూడా నాశనం అయ్యాయి. ఎందరో ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఈ మత్తు సమాజంలో చీకట్లు కమ్మేసి భీభత్సం సృష్టించింది. మద్య నిషేధం దేశంలో పూర్తిగా అమలు కావలసిన సమయం ఆసన్నమైంది. మద్యం, మత్తు పదార్థాలు, గుట్కా, డ్రగ్స్ అన్నింటి మీద వేటు పడింది. ఇకపై నిజాయితీగా సంపాయించిన డబ్బుతో ఇవన్నీ కుదరవు. చూస్తూ చూస్తూ మనుషుల అలవాట్లు మారతాయి. అన్ని నేరాలు, దుర్ఘటనలు, అపరాధాలకి మూలం ఈ మత్తు. కాపురాలు కూల్చే వీటిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి.

3. ఈ నల్లధనంతో గుండాగిరీ పెరిగింది. బయట శత్రువు లతో పోరాడవచ్చు, కాని ఈ లోపలి అసురుల మీద మనమే దాడి చేయాలి. 1990 తరువాత కలర్ టి.వి. కార్లతోపాటు ఎన్నో ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. కార్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. కొన్ని కుటుంబాలలో మనిషికి ఒక కారు చొప్పున కొన్నవాళ్ళు లేకపోలేదు. వాటిని ఇళ్ళల్లో పెట్టుకునే స్థలమే లేదు. ట్రాఫిక్ జామ్‌లు కాక మానవు. ఇప్పుడు కార్‌పూల్ (Car pool) యొక్క ఉపయోగం అందరూ తెలుసు కుంటున్నారు. వాతావరణ కాలుష్యం తగ్గడానికి ఇది చాలా అవసరం. అందరు వారి వారి కార్లను సమాజానికి ఉపయోగపడేలా ఇస్తుంటే మార్పు వచ్చినట్టు కనిపిస్తోంది. పెట్రోలు, డీజిలు వాడకం తగ్గి, ప్రభుత్వం మీద భారం కూడా తగ్గుతుంది. చాలామందికి తెలియని విషయం ఏంటంటే పెట్రోలియం ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం కోసం గో మాంసాన్ని ఎగుమతి చేయాల్సి వస్తోంది. ఇకపై ప్రాకృతిక వనరుల మీద ఆధారపడడం మంచిది. వీటిపై పరిశోధనలు కూడా మొదలయ్యాయి.

ఇళ్ళు 3 బి.హెచ్.కె., 4 బి.హెచ్.కె. ఉండాల్సిన అవసరం లేదు. చిన్నవాటితో కూడా సంతోషముగా ఉండవచ్చు. అనవసరమైన నగర వలసలు ఆగుతాయి. నీళ్ళు, కరెంటు వంటివి కూడా ఆదాచేయవచ్చు. ఇటువంటి విషయాల మీద కూడా ప్రభుత్వం గట్టి నిర్ణయాలు తీసుకోవాలి. అవసరమైతే శాసనసభలో బిల్లు పాస్ చేయించాలి. ఇట్లాంటి వాటివల్లనే ప్రభుత్వంలో, ప్రభుత్వేతర స్థాయిల్లో అవినీతి పెరుగుతోంది. అవినీతిపరుడు తన నల్లధనాన్ని ఈ ఆస్తులకే వినియోగిస్తాడు. ఆ తరవాత అది మట్టిపాలవ వలసిందే అని తెలుసుకోవాలి. అవినీతి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలి, కఠినమైన దండన విధించాలి.

4. గత రెండు దశాబ్దాలలో విద్యాసంస్థల్లో భారీ వృద్ధి కనిపిస్తోంది కానీ, విద్యలో ఉన్నతి మాత్రం కనిపించటం

**మృత్యువు అనివార్యం కానీ అది గుర్తుండదు**

లేదు. మన దేశంలో ప్రతిభకు లోటు లేదు. కాని విద్య మాత్రం డబ్బున్నవాళ్ళకే అందుతోంది. వారు ఎలా సంపాదించిన సరే. ఒక ఆర్థోపెడిక్ డాక్టరు సీటు కోసం కోటి రూపాయలు కాలేజీకి కట్టాలి. అది ఎక్కడ నుండి వస్తుంది. నల్లధనమే కదా. ఇప్పుడిక కుదరదు. ఇక ఈ ఎముకలు విరిచే దొంగ డాక్టర్లు ఏం చేయగలరు? వీరు, వీరి తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యం అందరూ మారాలి, మారక తప్పదు. విద్యను అందించే దుకాణాలు ఏం మార్పు తేగలవు? విద్య వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. కానీ అవినీతి పునాదుల మీద నిలబడే ఈ విద్యా విధానం ఏం వ్యక్తిత్వాన్ని రూపొందించగలదు?

మన దేశంలో ఉన్నతి లేకపోవడానికి కారణం ఇదే. ఐ.టి., ఇంజనీరింగ్ బూమ్ వచ్చింది, చాలామంది విదేశాలకు వెళ్ళిపోయారు, కాని విద్యలో నాణ్యత మాత్రం పెరగలేదు. ఇప్పటి లెక్కల ప్రకారం పదిలక్షల కన్నా ఎక్కువమంది ఇంజనీర్లు, ఎం.బి.ఎలు నిరుద్యోగులుగానో, అతి తక్కువ వేతనంతోనో బతుకుతున్నారు. ఇప్పుడు దృష్టికోణం మారాలి. విద్య, శిక్షణల సార్థక సమన్వయ రూపాన్ని అంగీకరించాలి. జీవన విధానం మారాలి. సామాజిక కార్యకర్తలుగా మారాలి. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం దీనికి ముందడుగు వేసింది. ఇలాంటివి దేశంలో ఏడు విశ్వవిద్యాలయాలు స్థాపించాలి. వాటి నుండి మహామానవులు, దేశభక్తులు, నిజాయితీపరులు తయారు అవ్వాలి. ఇప్పటివరకు ఆశాదాయకంగానే యాత్ర సాగింది, సకారాత్మక ఫలితాలు వచ్చాయి. ఈ కార్పొరేట్ విద్యావ్యవస్థ, వాటి భవనాలను కళాత్మకంగా ఉపయోగించుకునే విధానంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి.

విప్లవ శకం బయలుదేరింది. ఇది ఆగదు. నైతిక ఆధ్యాత్మిక ఆందోళన, బౌద్ధిక క్షేత్రంలో విప్లవం ఎలా రావాలి అన్న విషయాలు వచ్చే సంచికలో. *(సశేషం)*

– అఖండజ్యోతి, మార్చి 2017

*అనువాదం:* ఎం.వి.ప్రసాద్

## వెఱ్ఱి కోరిక

*ఒక సాలెవాని కదురు విరిగిపోగా కర్రకోసం అడవికి వెళ్తాడు. కనిపించిన ఎండిచెట్టుని కొట్టబోగా ఆ చెట్టుపై నివసించే యక్షుడు సాలెవానిని వారిస్తూ 'ఇది నా నివాసం, దీనిని కొట్టవద్దు – నీకేదైనా వరాన్ని ప్రసాదిస్తాను కోరుకోమంటాడు. సాలెవాడు తెగ ఆలోచించి, ఒక శిరస్సుకి బదులు రెండు శిరస్సులు, 2 చేతులకు బదులు 4 చేతులు కావాలని కోరినట్లయితే నాలుగు చేతులా ఎక్కువ నూలు వేసి రెండు తలల మీద పెట్టి దానిని మోసి, లాభసాటిగా వ్యాపారం చేసికోవచ్చునని భావించి 4 చేతులు 2 తలలు కావాలంటాడు. యక్షుడు తథాస్తు అంటాడు. కానీ గ్రామంలో అడుగు పెట్టగానే ఇతని వింత రూపాన్ని చూచి ప్రజలు భూతమని భావించి కర్రలతో రాళ్ళతో కొట్టి చంపివేస్తారు. సాధారణస్థాయికి చెందిన జీవితాలే సర్వావిధాల శ్రేయస్కరంకాని, అసాధారణమైన జీవితాలు అత్యాశ, దుఃఖానికి, పతనానికి హేతువవుతాయి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## దురహంకారం

*దర్పానికి, అహంకారానికి మారు పేరు దుర్యోధనుడు. పాండవులను వనవాసానికి పంపివేసినా కూడా దుర్యోధనునికి శాంతి లభించలేదు. తనను మించిన సర్వ సమర్థుడు లేడని నిరూపించుకోవాలనే అహంకారంతో పాండవులు నివసించే వన ప్రాంతానికి వెళ్ళటం జరిగింది. అహంకారులకు మర్యాద, సౌజన్యం వంటి లక్షణాలు బొత్తిగా కరువవ్వటంవల్ల వారు ఎవ్వరినైనా తమకంటే అల్పులని, హీనులని నిరూపించ ప్రయత్నిస్తారు. దుర్యోధనుడు కూడా ఇదే అహంకారంతో గంధర్వుల సరోవరాన్ని సోదర సమేతంగా మలినపరచ నారంభిస్తాడు. వారు ఎంత వారించినా వినిపించుకోడు. దానితో గంధర్వ రాజు కోపించి కౌరవులను బంధిస్తాడు. ఈ వార్త తెలిసి ధర్మరాజు అర్జునుడిని పంపి మిత్రుడైన గంధర్వరాజు ద్వారా కౌరవులను విడిపించే ఏర్పాటు చేస్తాడు. దుర్యోధనుడు నిరాశతో, సిగ్గుతో తలవంచుకోక తప్పలేదు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**లభించిన మానవజన్మను సార్థకం చేసుకోవాలి**

ఆయుర్వేద వైద్యం-26

# మెంతులు - ఒక విశిష్ట ఔషధము

మనదేశంలోని అన్ని ప్రాంతాలలో మెంతికూరను ప్రీతి పాత్రంగా సేవించుట పరిపాటి. మొలకెత్తిన మెంతి విత్తులను ఆరోగ్యాన్ని వృద్ధి చేసెడి కూరగా తయారుచేసి సేవించుట అనాది నుండి వచ్చుచున్నది. 'మెంతి' ఒక యాంటి ఆక్సిడెంట్ మరియు ప్రకృతి సిద్ధంగా ఉన్న యాంటి బయోటిక్ రక్తశుద్ధిని గావించెడి ఔషధం. ఇది 80 రకాలైన వాత సంబంధిత రోగాలను నియంత్రించెడి ఔషధిగా గుర్తింపు పొందినది. మధు మేహ రోగాన్ని నియంత్రించుటలో ఇది బహుళ ప్రయోజన కారి. మామిడికాయ మున్నగు ఊరగాయల పచ్చళ్ళలోని పులుపు ద్వారా ఏర్పడెడి ఎసిడిటి దోషాలను నియంత్రించెడి గుణం మెంతికి ఉన్నందున దీనిని ఊరగాయ పచ్చళ్ళలో అనాది కాలము నుండి వాడుచున్నారు. మెంతిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఇనుము, పొటాషియం, ఫాస్ఫరస్, క్యాల్షియం మున్నగు ఖనిజ లవణాలను పుష్కలంగా కలిగియున్నది. పిల్లలకు పాలిచ్చెడి తల్లుల, స్తనగ్రంథులను వికసింపజేసి పాల ఉత్పత్తికి దోహద పడును. రక్తపోటును నియంత్రించి హృద్రోగాల బారి నుండి మనుష్యుల రక్షిస్తుంది.

తీవ్ర క్యాన్సర్ వ్యాధిని నివారించుటలో సహాయాన్నందించ గలదు. శారీరక సౌందర్యాన్ని పెంచుతుంది. హానికారకమైన కొలెస్ట్రాల్‌ను నివారిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. పొట్టలో ఉత్పత్తి అయ్యెడి గ్యాస్ (గాలిని) నియంత్రించి, మంద గించిన జఠరాగ్నిని పెంపొందించుటలో తోడ్పడుతుంది. ఊబకాయాన్ని తగ్గించుటలో తోడ్పడుతుంది. అజీర్ణమునకు కారణాలైన గ్యాసు, ఉబ్బసము మున్నగువానిని నియంత్రి స్తుంది. మెంతి సేవనం ద్వారా సుఖ విరేచనము కాగలదు. మెంతి విత్తనాలను నీటిలో నానబెట్టి ఆ నీటిని మెంతులతో రుబ్బి రోగులకు త్రాగించిన రోగవిముక్తులయ్యెదరు. ఇది పొట్టలో క్రిములను నశింపజేసి, కఫాన్ని తగ్గిస్తుంది.

### మెంతి ద్వారా రోగ నివారణ:

**శారీరక సంధివాతముల నివారణ:** 1) 5 గ్రాముల మెంతి దానాను నీటితోపాటు ఉదయం, సాయంత్రం సేవించిన గుణకారి. 2) మెంతి ఆకులను గుజ్జుగా చేసి రొట్టెల పిండిలో కలిపి, నూనె లేకుండా వేయించి తినాలి. 3) మెంతులతో లడ్డూలను తయారు చేసికొని శీతాకాలములో నవంబరు నుండి ఫిబ్రవరి మాసము వరకు రోజూ తిన్నచో లాభకారి. 4) మెంతి ఆకులతో పచ్చడిని లేక మెంతి దానా (మెంతులను) మొలకెత్తించి వాని కూరను తిన్నచో లాభకారి. 5) 30 గ్రాముల మొలకెత్తిన మెంతులను రోజూ ఉదయం తిన్నచో గుణకారి.

**శీతాకాలములోని చలి మరియు ఇతర బాధల నివారణ:** ఉదయం సాయంత్రం గంట గంటకు అటుఇటు నడచుట చెయ్యాలి. రోజూ నూనెతో శరీరానికి మాలీసు చేసికొని, ఆసన ప్రాణాయామాలు చెయ్యాలి. చిరుధాన్యాలను మరియు ఇష్టమైన పండ్ల రసాన్ని మరియు ఫలాలను, ఆకుపచ్చని కూరలను అధికంగా తింటూ ఉండుట మంచిది. దీనివలన రక్తశుద్ధి జరుగుతుంది. కీళ్ళు బలపడతాయి. ఎముకలు బలహీనపడుట నివారింపబడుతుంది. నూతన కణాలు వృద్ధి అవుతాయి. కీళ్ళ నొప్పులు, సంధివాత నొప్పులు, రుమాటిసిజమ్ జటిలమైన రోగాలు - కావున అధిక కాలము జాగరూకత వహించాలి. తెలుపు రోగం నుండి రక్షణ కలుగుతుంది. వేడినీళ్ళతో స్నానం చేయుట ఉత్తమం.

**బాలింత తల్లులు తక్కువ పాలు పిల్లలకు ఇస్తున్నప్పుడు:** ఇట్టి తల్లులకు మెంతులతో చేసిన లడ్డూలను తినిపిస్తూ, ఆవుపాలను త్రాగిస్తూ, శతావరి చూర్ణాన్ని, తెల్ల జీలకర్రను 3-3 గ్రాములు సేవించినచో తల్లుల పాలు ఉత్పత్తి పెరుగుతుంది. మెంతులలోని డివోస్‌జెనిన్ పేరుగల తత్వం ఉండుటచే, ఇది పాల ఉత్పత్తిని పెంచుతుంది.

**కాళ్ళు చేతులు లాగుట (నొప్పులు):** నేతిలో మెంతులను వేయించి పిండిలాగా చేసి, దీనిని రొట్టెల పిండిలో బెల్లంతో బాగా కలిపి, చిన్న చిన్న లడ్డూలుగా తయారుచేసికొని, ఉదయం-సాయంత్రం 15 నుండి 20 దినాలపాటు ఒక్కొక్క లడ్డును తిన్నచో లాభాన్ని చేకూర్చుతుంది.

**అజీర్ణంతో కూడిన విరేచనాల నివారణకై:** 1) 5 గ్రాముల మెంతుల దానా చూర్ణాన్ని ఒక గ్రాము శొంఠి, పది గ్రాముల బెల్లం మరియు 200 గ్రాముల చిలికిన పెరుగులో కలిపి త్రాగినచో లాభం చేకూరుతుంది.

దేవమానవ స్థాయి పొందే ఆకాంక్షను పెంపొందించుకోవాలి

2) పది గ్రాముల మేథిదానా (గింజలను) బాగా నూరి 150 గ్రాముల పెరుగులో కలిపి రోజుకు 2 లేక 3 సార్లు సేవించిన పొట్ట శుభ్రపడుతుంది.

పత్యం రూపంలో కాచి చల్లార్చిన నీటిని నిమ్మకాయ రసంతో, బాగా పండిన అరటిపండు గుజ్జును చేర్చి, పెరుగు, సజ్జా గింజలు చూర్ణాన్ని, బిల్వ పత్రాల చూర్ణాన్ని చేసి పాత బియ్యంతో వండిన అన్నంతో సేవించాలి.

**స్త్రీల గర్భ సంబంధిత రోగముల నివారణకై:** 5 గ్రాముల మెంతుల చూర్ణాన్ని కొంచెం బెల్లం మరియు నేతితో కలిపి ఉదయం సాయంత్రం కొద్దిరోజులపాటు నిత్యము బాగా నమిలి తిన్నచో లాభకారి.

**అతి మూత్ర నివారణకై:** ఒక కప్పు మెంతిఆకుల తాజా రసాన్ని తీసికొని దానిలో 2 గ్రాముల దాల్చిన చెక్కను, 4 గ్రాముల పటిక బెల్లాన్ని కలిపి రోజూ సేవించిన లాభదాయకం.

**మొలల నివారణకై:** 1) ఒక్క చెంచా మెంతులు, ప్రతిరోజు ఉదయం-సాయంత్రం నీటితో బాగా నమలాలి. 2) 3 గ్రాముల మెంతుల చూర్ణాన్ని బెల్లంతో కలిపి నీటితో సేవించాలి. అట్లే మెంతి ఆకుల కూరను తిన్నా లాభకారిగానే ఉంటుంది.

**వడ దెబ్బ తగిలినప్పుడు నివారణకై:** వేసవికాలంలో సూర్య తాపానికిలోనై నీరు త్రాగనిచో ప్రాణాపాయానికి దారితీస్తుంది. ఎండిన మెంతి ఆకుల 5 గ్రాములు ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, 2 గంటల తదుపరి త్రాగినచో, వడదెబ్బ నుండి ఉపశమనం లభిస్తుంది. దీనికి తోడుగా పచ్చిమామిడికాయ రసాన్ని సేవించుట త్వరితగతిన నివారణ లభిస్తుంది.

**మధుమేహ వ్యాధి నివారణకై:** 20 గ్రాముల మేథి దానాను రాత్రి ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, ఉదయాన్నే రుబ్బి, వడపోసి త్రాగాలి. ఇది నిత్యం చెయ్యండి. మెంతి గింజలను మొలకెత్తించి 30 గ్రాములను రోజూ తింటూ ఉండాలి. మెంతికూర, మెంతిగింజల కూరను వారానికి 3-4 సార్లు సేవించాలి.

**హెచ్చరిక:** మధుమేహంతో బాధపడెడి రోగి బియ్యం, బంగాళా దుంపలు, మైదా, పంచదార, బెల్లం, అరటిపండ్లను తినరాదు.

**శరీరం వాపుల నివారణకై:** మెంతి లేత ఆకులను నూరి నులివెచ్చని స్థితిలో వాపులపై పూసిన సుగుణం కనిపిస్తుంది.

**రక్తమొలల నివారణకై:** 1) మెంతి గింజలను నూరి 15 గ్రాముల చూర్ణాన్ని 250గ్రాముల నీటిలో చేర్చి, పొయ్యిపై పొంగించాలి. మొత్తం నీరు సగం కాగానే, దింపి చల్లార్చి త్రాగిన రక్తం స్రవించుట నివారింపబడుతుంది. 2) 15 గ్రా॥ల మెంతులు చూర్ణం చేసి 250 గ్రా॥, పాలతో చేర్చి త్రాగినచో లాభకారి.

**జలుబు, పడిశం, దగ్గు మున్నగువాని నివారణకై:** 1) మెంతి కూరను చేసి తిన్నచో లాభకారి. 2) 10 గ్రాముల మెంతులు, చూర్ణం, ఒక చెంచా తేనె 2 గ్రాముల నిమ్మరసం కలిపి సేవించిన లాభకారి.

**హృదయ సంబంధిత రోగ నివారణకై:** మెంతులను నియమిత పరిమాణంలో తిన్నచో హానికారకమైన కొలెస్ట్రాల్ తగ్గి లాభం చేకూరుతుంది. మెంతులలోనున్న పొటాషియతత్వం, రక్త పోటును నియంత్రించి హృదయస్పందనను నియంత్రిస్తుంది.

**బాలల రోగాల నివారణకై:** మెంతి ఆకులను కొబ్బరిపాలలో కలిపి పేస్టులా తయారుచేసి బాలుర చర్మంపైన ఉంచిన లాభకారి. పిల్లలలో ఎదుగుదల లేక, పాలిపోయిన, మంద మతులుగానున్నచో ఇది పనిచేయును.

**స్త్రీల వ్యాధులైన నెలసరి బహిస్టులు క్రమం తప్పినప్పుడు:** మెంతులు తిన్నచో ఇవి క్రమాన్ని సంతరించుకుంటాయి. మెనోపాజ్ సమయమందు స్త్రీలలో వేడిపుట్టుట, నిస్పృహ నిరాశలకు లోనగుట, లావగుట, చిర్రుబుర్రులాడుట, విచార గ్రస్థులగుట, నిద్రలేమి మున్నగునవి పెచ్చరిల్లగా వీనిని నివారిస్తుంది.

**ప్రసవానంతరము:** గర్భాశయాన్ని శుభ్రపరచుటలోను, స్థనాల వృద్ధికొరకు మెంతిలడ్డూలు తిన్నచో లాభకారి.

**ప్రసవానంతరము జ్వరం తగిలినచో:** ప్రసవానంతరము బాలింతకు జ్వరం రావచ్చుననెడి భయం వెన్నాడుతూ ఉంటుంది. ఒక కిలో మెంతి సన్నవానిని పిండి చేసి అంత నెయ్యిని కలిపి మూడు లీటర్ల పాలను చేర్చి సన్నని సెగపై కాయాలి. తదుపరి 3 కిలోల పటిక బెల్లాన్ని పొడిచేసి దీనిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకు 20 గ్రాముల చొప్పున తినాలి. ప్రసూతి రోగాల నుండి సంరక్షింపబడెదరు. బలం చేకూరుతుంది.

**మేథితో ఆరోగ్య ప్రదాయమైన రొట్టెలు:** 1) మెంతి తాజా ఆకుల రసాన్ని రొట్టెల పిండిలో కలిపి రొట్టెలను చేసి తినాలి. 2)మెంతి లేత ఆకులను నూరి, గుజ్జుగా తయారుచేసి పిండిలో కలిపి బలవర్థకమైన, ఇష్టమైన రొట్టెలను చేసి తినాలి. రుచికై వామును, జీలకర్రను, ధనియాలను, సేంధ్వా లవణాన్ని మిరియాలను పిండికి చేర్చాలి. రక్తన్ని శుద్ధి చేసి, అరుచిని తొలగించి, నులి పురుగుల నశింపజేస్తుంది.

**సమయమే జీవితం**

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-9)

## సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ శృంఖల

మంగళగిరి పట్టణములో జనవరి 2018లో జరుగనున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞములోని ప్రయాజలో భాగంగా గాయత్రీ పరివార్, మంగళగిరిశాఖ, గుంటూరు జిల్లావారు 36' × 32' పొడవు-వెడల్పుతో అనగా 1152 చ.అడుగుల విస్తీర్ణం గల తాటియాకుల కుటీరాన్ని నిర్మించారు. ఈ కుటీరానికి "గౌతమ మహర్షి అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ పర్ణశాల" అని నామకరణం గావించారు. ఈ పర్ణశాలను మూడు విభాగాలుగా తూర్పు అభిముఖంగా నిర్మించారు. మధ్యభాగములో దేవస్థాపనతోపాటు యజ్ఞ కుండాన్ని నిర్మించారు. ఇచ్చటనే గాయత్రీ మంత్ర అఖండజపాన్ని చేయుటకు తగిన ఏర్పాట్లు చేశారు. దీనికి ఇరువైపుల స్త్రీ-పురుషులిరువురకు విడివిడిగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. జపము చేయుటకై విచ్చేసిడి సాధకులకు భోజన వసతికై వంటశాలను కూడా నిర్మించుట జరిగింది. ఈ పర్ణశాలను 11 మార్చి 2017 శనివారము సమీపమందున్న కృష్ణా, గుంటూరు జిల్లా గాయత్రీ పరివార్ కార్యకర్తల సమక్ష మందు ప్రారంభించుట జరిగింది.

ప్రారంభోత్సవాన్ని గాయత్రీ యజ్ఞముతో ప్రారంభించుట జరిగింది. హాజరైన పరివార్‌లో అత్యంత సుదీర్ఘకాలం నుండి కొనసాగుచున్న శ్రీ జి. చెన్నకేశవరావు, ఉండవల్లి గుంటూరు జిల్లా వారి చేత అగ్నిస్థాపన చేయించారు.

యజ్ఞాన్ని శ్రీయుతులు బి.యల్.యన్.మూర్తి ఎర్రబాలెం మరియు డా॥ శ్రీరామ్, తెనాలివారలు నిర్వహించారు. 1008 గాయత్రీ మంత్రాహుతులతో యజ్ఞాన్ని నిర్వహించారు.

తదుపరి సభను నిర్వహించుట జరిగింది. ఆనాటి సభలో శ్రీయుతులు స్వామి శివానందజీ, మందడం, గుంటూరు జిల్లా, శ్రీ వెంకటేశ్వర యోగా గురూజీ, మంగళగిరి, ఎన్.ఆర్.ఐ. వైద్యశాల మరియు వైద్యకళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్య సభ్యులైన డా॥ నర్సరాజు, డా॥ వశిష్ఠగారు, డా॥ శ్రీధర్, డా॥ మణిభూషణ్-వైద్యశాల సూపరింటెండెంట్, శ్రీ రమేష్‌గారు తదితర ప్రముఖులు దీనిలో పాల్గొని యజ్ఞ సఫలతకై వారి సంపూర్ణ సహకారాలను అందించెదమని వాగ్దానం చేశారు. శ్రీ మద్దూరి శివశంకర ప్రసాద్, మంగళగిరి, రైసు మిల్లర్స్ అసోసియేషన్‌వారు సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన ప్రముఖులు ఈ రీతిగా తమ సందేశాలను వినిపించారు.

1. శ్రీ శివానందస్వామివారు ప్రవచిస్తూ వేదమంత్రాలన్నింటిలో గాయత్రీ మహామంత్రము మకుటాయ మానమైనది. గాయత్రీ మంత్రోపాసన మోక్ష ప్రదాయిని త్రిలింగ దేశం మధ్యలోనున్న మంగళగిరిక్షేత్రము పరమ పవిత్రమైనది. ఇట్టి క్షేత్రమందు నిర్వహింపబోవుచున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికి విశ్వధర్మ పరిరక్షణ సమితి తమ సంపూర్ణ సహాయ సంపత్తులనందించగలదని ప్రకటించారు.

2. శ్రీ వెంకటేశ్వర యోగా గురూజీ: వారు ప్రవచిస్తూ ఇలా సెలవిచ్చారు. 'జపం' అనెడి పదానికి అర్థము జన్మపరంపర విచ్ఛేదనంగావించి, పాపనాశనం చేసి పునర్జన్మ రాహిత్యాన్ని ప్రసాదిస్తుంది. మంగళగిరి పట్టణం భౌగోళికంగా, పర్వతాగ్రం కలిగి ఉంది. కృష్ణానదీ పరీవాహక ప్రాంతం, చారిత్రక పునీత ఘట్టాలతో నిండియున్న అమరావతి పట్టణానికి అతి సమీపంలోనున్నది. ఈ నేల అంత పవిత్రతను సంతరించు కున్నది. 'దైవీశక్తి, గురుశక్తి మరియు కార్యకర్తల శక్తి ఈ మూడింటి కలయికతో మంగళగిరిక్షేత్రము పరమ పునీతమైనది. అట్లే వైద్యాలయం, విద్యాలయాలకు తోడుగా దేవాలయం ఒనగూడిన పవిత్రస్థలి ఇది.

ఈ కుటీరం పేరు 'గౌతమి మహర్షి అశ్వమేధ గాయత్రి యజ్ఞ పర్ణశాల' అని పెట్టుట యాదృచ్ఛికమైనప్పటికి దీనివెనుక అఖండ గురుసత్తా పని చేయుచున్నది. ఒకనాడు ఈ దేశంలో వర్షాలు లేక కరవు తాండవిస్తున్న సమయంలో గౌతమి మహర్షి, తన తపశ్శక్తితో భూమిపైకి గంగను దింపి, ఈ పృథ్విని పరమ

**సమయాన్ని సదుపయోగం చేసినవాడే పరిపూర్ణ లాభం పొందుతాడు**

పవిత్రం గావించాడు. అట్లే నేటి అనైతిక ప్రవృత్తులతో నిండి, అశాంతితితో కూడి, అనేకానేక విపత్తుల నెదుర్కొనుచున్న మానవజాతి సముద్ధరణకై పరమపూజ్య గురుదేవులైన శ్రీ పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు జన్మ తీసికొనుట జరిగింది. వారి ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి మరియు జ్ఞానశక్తులు అఖండంగా ఈ పృథ్విని కర్మభూమిగా మరియు యోగభూమిగా మార్చుటకై వారి నిరంతర కృషి నేటికీ కొనసాగుచున్నది.

పై లక్ష్యసాధనలో భాగంగా, గాయత్రీ పరివార్ చేయు చున్న ఈ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ సాఫల్యానికై మా వంతు సంపూర్ణ సహకారాన్ని అందించెదమని సభా ముఖంగా వీరు ప్రకటించుట అత్యంత ముదావహం.

3. డి.వి.ఆర్.మూర్తి: చీరాల పట్టణంలో జూన్ 18-19 తేదిలలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తు న్నామని సభికులకు తెలియజేయుట జరిగింది. తదుపరి అశ్వమేధ యజ్ఞము 2018లో 1008 కుండములతో యజ్ఞాన్ని నిర్వహించుటకై శాంతికుంజ్ యాజమాన్యాన్ని ఒప్పించెదమని ప్రకటించారు.

తదుపరి శ్రీమతి గౌతమి-ఉండవల్లి, డా॥ శ్రీరామ్-తెనాలి, శ్రీ ప్రసాద్-మంగళగిరి రైసుమిల్లర్సు అసోసియేషన్ ప్రతినిధి, శ్రీ కోట్ల వెంకటేశ్వర్లు-గుంటూరు, శ్రీ మణికుమార్-రేపల్లె, శ్రీమతి రమాదేవి-యర్రబాలెం, శ్రీ బహదూర్-యర్రపాలెం, కల్లం సింగారెడ్డి మరియు శ్రీమతి నాగరాజకుమారి-కొత్తపాలెం, తదితర గాయత్రీ పరివార్ సభ్యులు దాదాపు 100 మంది పాల్గొన్నారు.

శ్రీ సుబోధానంద-దత్తాశ్రమం, మంగళగిరి వారు ప్రవచిస్తూ 350 సంవత్సరాల క్రితం భవిష్యద్రష్ట మహాముని బ్రహ్మంగారు, మంగళగిరిక్షేత్రం ఒక మహాపుణ్యక్షేత్రమగునని ప్రకటించారు. అది నేడు క్రియారూపం ధరింపబోవుచున్నది. ఈ క్రతువులో పాల్గొనబోవుచున్న మనందరము భాగ్యశాలురు మరియు ధన్యజీవులం కూడా. ఈ యాగ సఫలతకు తమ వంతు సహకారాన్ని అందించెదమని మాట ఇచ్చారు.

ఈ పర్ణశాల నిర్మాణానికై మంగళగిరి గాయత్రీ పరివార్ శాఖ అవిరళ కృషి చేసింది. ఈ శాఖ ప్రగతికై, అవిరళ కృషి చేయుచున్న శ్రీ భోజనంపల్లి ప్రసాద్, శ్రీ వెంకటేశ్వర్లుగార్లు, శ్రీ తాతారావుగారు మిగుల అభినందనీయులు. అట్లే శ్రీ ప్రకాశ రెడ్డి, గుంటూరు గాయత్రీ పరివార్ యజ్ఞ ప్రాంగణ మ్యాప్ తయారుచేసి అందించుటకై తీవ్రకృషి చేశారు. వీరందరిని యుగశక్తి గాయత్రి మిగుల అభినందించుచున్నది.

## గాయత్రీ పరివార్ సాధకులకు ఆహ్వానము

మంగళగిరి పట్టణములోని ఎన్.ఆర్.ఐ. వైద్యశాల మరియు వైద్య విద్యాలయం ప్రాంగణములో 2018 జనవరిలో నిర్వహింపబోవుచున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ సంపూర్ణ సఫలతకై చేపట్టిన కోటానుకోట్ల గాయత్రీ మంత్ర జపశ్శక్తి సాధనలో భాగంగా మంగళగిరి గాయత్రీపరివార్ శాఖ బహువ్యయప్రయాసలకోర్చి చక్కని అఖండ గాయత్రీ జప పర్ణశాలను నిర్మించారు. దీనిని 11 మార్చి, శనివారం 2017న ప్రారంభించుట జరిగింది.

ఇచ్చట అఖండ గాయత్రీ మంత్రజపము ప్రారంభించ బడింది. అట్లే నిత్యము ఏకకుండీ గాయత్రీ యజ్ఞము జరుగు చున్నది. వీనిని అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము ప్రారంభించు వరకు కొనసాగించెదరు. ఈ కార్యక్రమంలో భాగము పంచు కొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని తెలుగు సోదర సోదరీమణులను మరియు ఇతర గాయత్రీ పరివార్ సభ్యులను సవినయంగా కోరుచున్నాము. దీనిలో పాల్గొనదలచినవారు ఈ క్రింది వివరముల తెలుపుచూ ఈ క్రింది చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేసి, ముందస్తు అనుమతిని పొంది రావలసిందిగా కోరడమైనది.

### తెలియజేయవలసిన వివరాలు:

1) పూర్తి పేరు, చిరునామా 2) సెల్‌నెంబర్ 3) ఆధార్ కార్డు జిరాక్సు కాపీ 4) పర్ణశాలకు చేరుకొనెడి తేది, సమయం, ఎన్ని దినములు జపంలో పాల్గొనెడిది తెలపాలి. 5) మీ ప్రజ్ఞామండలి, మహిళామండలి, శక్తిపీఠము, వివరాలు తెలుపుట.

**సంప్రదించవలసిన చిరునామా**

గాయత్రీ పరివార్ ట్రస్టు, మంగళగిరిశాఖ
కేరాఫ్ భోజనంపల్లి ప్రసాద్-హార్డువేర్ షాపు,
మెయిన్ బజార్, మంగళగిరి (పో॥ & మం॥)
గుంటూరు జిల్లా
సెల్: 9394449927

**పెద్దమనస్సుతో అందరిని మనవారిగా చేసుకోవాలి**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో

2017 ఫిబ్రవరి 18 మరియు 19 తేదిలలో 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞము, గాయత్రీ పరివార్, ప్రత్తిపాడు శాఖ 13వ వార్షికోత్సవ సందర్భంగా 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ప్రత్తిపాడు గ్రామంలో నిర్వహించారు.

18వ తేదిన నారీమణులతో కూడిన భవ్య కలశయాత్ర గ్రామంలోని శివాలయం నుండి ప్రారంభమై యజ్ఞ ప్రాంగణం వరకు నిర్వహింపబడ్డది. భక్తిగీతాలు పాడుతూ మహిళా మణులు కలశయాత్రలో కోలాటం చేస్తూ గ్రామ వీధులలో ప్రచారం చేశారు.

మరునాడు 19వ తేది ఉదయం 10 గంటలకు 54 కుండములతో యజ్ఞము నిర్వహించారు.

యజ్ఞాన్ని శ్రీయుతులు డా॥ శ్రీరామ్ మరియు బ్రహ్మారెడ్డి గార్లు నిర్వహించారు. కలశయాత్రను శ్రీమతి అనసూయనంద గారు నిర్వహించారు. పై యావత్ కార్యక్రమాలనన్నింటినీ శ్రీ మదమంచి సుధాకర్‌గారి ఆధ్వర్యంలోని నిర్వహించుట జరిగింది. ప్రజలు వందలాదిగా యజ్ఞంలో పాల్గొని, భోజన ప్రసాదాలను స్వీకరించారు.

## గుంటూరు జిల్లా కుందూరువారిపాలెంలో

వసంతపంచమి పర్వదినము మరియు గాయత్రీశక్తి పీఠము (సాందీపుని ఆశ్రమం) కుందూరివారిపాలెం, ముప్పాళ్ళ (మం) గుంటూరు జిల్లా ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించు కొని గాయత్రీ మహాయజ్ఞము నిర్వహించారు. పరమపూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య పరమ వందనీయ మాతా భగవతీదేవిశర్మలకు ప్రతీకలుగా స్మారకాలుగా ప్రఖరప్రజ్ఞ - సజలశ్రద్ధల నిర్మాణం చేశారు. వీనిలో గురు యుగ్మ పాదుకల ప్రతిరూపాలు ప్రతిష్టించి గాయత్రీ పరివార్ తమ సమర్పణను చాటుకొనే అవకాశాన్ని కల్పించారు.

ఇట్టి ఆహ్లాదకర, శాంతియుత ఆశ్రమ వాతావరణానికి పరివారమంతా ప్రభావితులై క్రమం తప్పక ఆశ్రమాన్ని సందర్శించుట వారి నిత్యజీవితంలో ఒకభాగంగా చేసికొనుట జరిగింది.

ఆనాటి కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో వేలాదిగా పరిజనులు పాల్గొన్నారు. శ్రీయుతులు యుగంధర్ మరియు విజయశ్రీ దంపతులు ఈ కార్యక్రమానికి విచ్చేసి పరిజనులకు, పరమపూజ్య గురదేవుల పావన సందేశాన్ని తెలియజెప్పారు. అట్లే 2018 జనవరిలో మంగళగిరిలో జరుగనున్న అశ్వమేధ యజ్ఞ ప్రాశస్త్యాన్ని, విశిష్టతల తెలియ జేస్తూ, ఈ యజ్ఞంలో పాల్గొనుటకై పరిజనులు చేపట్టవలసిన విధివిధానాలను సభికులకు వివరించుట జరిగింది. దాదాపు 600 మంది పై చిలుకు సాధకులకు అశ్వమేధ గాయత్రీ యజ్ఞమునకు సంబంధించిన నిత్య జప సామాగ్రిని అంద జేయుట జరిగింది. పై యావత్ కార్యక్రమాన్ని శ్రీ పేరిశాస్త్రి గారు పర్యవేక్షించారు.

## కొలుకుల గ్రామం ప్రకాశం జిల్లాలో

కొలుకుల గ్రామము, ఎర్రగొండపాలెం మం॥, ప్రకాశం జిల్లాలో కొలువైయున్న శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పురస్కరించుకొని అష్టకుండీ గాయత్రీ యజ్ఞాన్ని దేవాలయ యాజమాన్యం మరియు గ్రామస్థులు కలిసి నిర్వహించారు. మార్చి 10వ తేది 2017న యజ్ఞాన్ని నిర్వహించారు. యజ్ఞములో గ్రామస్థులు 500 మంది వరకు పాల్గొన్నారు. మతాంతీకరణ చేసిన అనేకమంది గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఈ యజ్ఞంలో స్వచ్ఛందంగా పాల్గొనుట ఒక విశేషము.

## మహేశ్వరం, హైదరాబాదులో

15 మార్చి 2017 బుధవారము పంచకుండీ గాయత్రీ యజ్ఞాన్ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని అశ్విని హోమియో & ఆయుర్వేదిక్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆవరణలో నూతనంగా నిర్మించిన (కొబ్బరినూనె తయారీ) భవన ప్రారంభోత్సవ సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దక్షిణ భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావుగారు పర్యవేక్షించారు. యజ్ఞంలో పాల్గొన్న

**పిల్లల మొదటి గురువు వారి తల్లి**

కార్మికులందరి చేత యుగనిర్మాణ సత్సంకల్పాలను చదివించి తగిన ప్రేరణను అందించారు. యజ్ఞాన్ని శ్రీయుతులు వేణుగోపాలరెడ్డి మరియు జగన్నాథంగార్లు, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట వారు నిర్వహించారు. ఈ యజ్ఞంలో దాదాపుగా 100 మంది పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా పొన్నూరులో

గాయత్రీ ప్రజ్ఞామండలి, పొన్నూరు పట్టణశాఖ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, 24 కుండముల గాయత్రీ యజ్ఞము 2017 జనవరి 21, 22 తేదీలలో నిర్వహించారు.

జనవరి 21వ తేది సాయంత్రము 108 కలశాలతో కలశయాత్రను పొన్నూరు పట్టణ వీధులలో శోభాయమానంగా నిర్వహించారు. మరుసటి రోజు 22వ తేదిన 24 కుండముల గాయత్రీ యజ్ఞ పూర్ణాహుతిని నిర్వహించారు. యజ్ఞములో వందల సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు. గాయత్రీ పరివార్ వరిష్ట కార్యకర్తలైన శ్రీ దమ్మాల వెంకటేశ్వర్లు మరియు శ్రీ శ్రీనివాసరావుగార్లు తదితర కార్యకర్తలు కార్యక్రమ విజయానికి తీవ్రకృషి చేశారు. వీరి కృషిని గాయత్రీ చేతనా కేంద్రము మనసారా అభినందించుచున్నది.

యజ్ఞానంతరము భోజన ప్రసాద్ వితరణ జరిగింది. వేలమంది భోజన ప్రసాదాన్ని స్వీకరించారు.

## కడప జిల్లా కమలాపురంలో

24 కుండముల గాయత్రీ యజ్ఞము ఈ క్రింది స్థలాలలో ఆయా తేదిలలో జరిగాయి.

18 ఫిబ్రవరి 2017న కమలాపురంలోను 19 ఫిబ్రవరి 2017న కడపలో నిర్వహించారు. వీనిలో 200 మంది సుమారుగా పాల్గొన్నారు. పై యజ్ఞాలను శ్రీ గురురాజారావు మరియు రామకేశవులు, కర్నూలు వాస్తవ్యులు నిర్వహించారు. యుగశక్తి మాసపత్రికకు చందాదారులుగా కొందరిని చేర్పించారు. 2018 అశ్వమేధ యజ్ఞాన్ని గురించి వివరించారు.

## కష్టార్జితం

*లుహార్ ఒక గృహస్థుడు. నైపుణ్యంతో, శ్రమతో కుటుంబాన్ని చక్కగా పోషించుకుంటున్నాడు. అతని కుమారుడికి ఎక్కువగా ఖర్చుచేయడం అలవాటయింది. తండ్రి కుమారుడి మీద ఆంక్షలు విధించి ఇలా అన్నాడు– "నీవు కష్టపడి ఒక రూపాయి సంపాదించి తీసుకొనిరా" నీ ఖర్చుకు డబ్బిస్తాను.*

*బాలుడు ప్రయత్నించాడు. సాధించలేకపోయాడు. తను దాచుకున్న డబ్బునుంచి ఒక రూపాయి తీసుకొని వెళ్ళాడు. తండ్రి బట్టీ దగ్గర కూర్చున్నాడు. ఆ రూపాయిని చేతిలోకి తీసుకొని చూసి అన్నాడు ఇది నీ సంపాదన కాదని బట్టిలో విసిరేశాడు. కుమారుడు సిగ్గుపడి వెళ్ళిపోయాడు.*

*రెండవరోజు కూడా సంపాదించడం చేతకాక కుమారుడు చాటుగా తల్లిని అడిగి తీసుకువచ్చాడు. ఆ రోజు కూడా అలాగే జరిగింది. మూడవరోజు దొంగతనం చేసి తీసుకొచ్చాడు. కాని తండ్రిని మోసగించలేక పోయాడు. ప్రతిసారీ కష్టపడి సంపాదించినది కాదని తండ్రి బట్టీలో వేస్తూ వచ్చాడు.*

*సంపాదించకుండా పని జరగదని కొడుకు అర్థం చేసుకున్నాడు. రెండు రోజులు కష్టపడి ఏదో విధంగా ఒక రూపాయి సంపాదించి తీసుకువచ్చాడు. తండ్రి వాటిని చూసి కూడా అదే మాట చెప్పి బట్టీలో వెయ్యబోయాడు. కుమారుడు కేకవేస్తూ తండ్రి చెయ్యిపట్టుకొని 'ఏం జేస్తున్నావు నాన్నా! నా కష్టార్జితాన్ని వృధాగా బట్టిలో వేయవద్దు' అన్నాడు.*

*తండ్రి నవ్వాడు. ఇలా అన్నాడు – 'కుమారా! కష్టపడి సంపాదించడంలోని బాధ ఇప్పుడు అర్థమైందా? నువ్వు అనవసర పనులకు నా సంపాదనను ఖర్చు చేస్తుంటే నేను కూడా నీలాగనే విలవిలలాడాను."*

*పుత్రునికి అంతా అర్థమైంది. డబ్బును దుబారా చేయనని ప్రతినపూనాడు. తండ్రికి సహకరించడం మొదలుపెట్టాడు.*

★★★

**పిల్లల ప్రథమ విద్యాలయం వారి ఇల్లే**